
సూక్తులు

# వేమన వేద సూక్తులు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖




మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీరస్తు

# వేమన వేద సూక్తులు

రచయిత :
పండిట్ వి. ఉదయశంకర్



శ్రీ ఎల్. వి. రామయ్య, సుబ్బమ్మ దంపతులు

# తొలిపలుకు

ప్రతి తెలుగుబిడ్డ అక్షరాభ్యాసము అయిన పిదప చదువుకునే తొలి తెలుగు పద్యం వేమన పద్యమే. తెలుగు సాహితీ లోకంలో వేమన స్థానానికి ఇదొక మచ్చు తునక. అనగా "ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు" అను పద్యము చదవని ఆంధ్రుడు వుండడు అంటే అతిశయోక్తి కాదు.

భారతీయ వాఙ్మయమున వేదములు ఆది సాహిత్యమని ప్రతీతి, ఈ వేదము 4 భాగములలో నాలుగు ధర్మాల్ని సమగ్రంగా ప్రబోధిస్తోంది. ఇదంతయూ మానవ సుఖసౌఖ్య జీవనమునకు, సుగమ మార్గాన్ని చూపే సమస్త ధర్మాల్ని, విధుల్ని ఆచారాదులను నిర్దేశించింది. ఈ వేదమునుండి 4 వేదాంగములు ,6 శాస్త్రములు, రూపొందించబడి అనేక విషయములు, తర్క, వితర్కములతో సూక్ష్మాతి సూక్ష్మ ధర్మములతో, మానవోపయోగకరమగు సమస్త విశేషములను విశ్లేషించబడినవి, అటుపిమ్మట ఈ వేదశాస్త్ర విషయములను సామాన్య జనావళి ఆకళింపు జేసుకొనుట కష్టసాధ్య మగుటచే, జనబాహుళ్యమునకు వీలుగ వేదోక్త, శాస్త్ర విషయ విజ్ఞాన మార్గమును, గాథారూపముజేసి వీటిని పురాణములుగాను భారత భాగవతాది ఐతిహాసికములుగాను రూపొందించి లోకమున నెలకొల్పిరి.

ఈ పైన పేర్కొన్న సమస్త వాఙ్మయ సారము క్షుణ్ణంగా పరిశీలించినచో నిగ్గుగా తేలు విషయములు రెండే రెండు. అవి 1, పరోపకారము పుణ్యము 2. పరహాని పాపము. ఈ రెండు

విషయముల పైనే యావద్భారతీయ కర్మశాస్త్రము. కర్మకాండ. జ్యోతిశాస్త్రాది బహు శాస్త్రములు ఆధారపడి నిర్మించబడినవి.

అనగా ఆదిమానవుని కాలములో కావలసినప్పుడు తిండి తింటూ స్త్రీ పురుషులు స్వేచ్ఛగా విహరిస్తూ గడిపితే, వేదకాలము నాడు ప్రజోత్పత్తి అధికమై కొన్ని ఇక్కట్లు ఏర్పడడంతో నాటి మేదావివర్గం లోతుగా యోచించి, మానవ నిత్యజీవనం సుగమంగా శాంతివంతంగా కొనసాగడానికి మానవ ధర్మాన్ని, విధులను, వృత్తులను గ్రంధరూపం చేసినారు.

పిదప శాస్త్ర యుగము నాటికి అది అత్యుంతోచ్ఛ స్థితికి చేరి పిదప వేదకాలంనాటి వృత్తి ధర్మాలు, వృత్తి కులాలు అనేవి, స్వార్ధచింతన ద్రోహ చింతనలో వెర్రితలలు వేసి విపరీత ధర్మాలు, కులవృత్తులు ఆరంభమై ఋజు మార్గమున పయనించు భారతీయ మహోత్కృష్ట జీవన ధర్మ మార్గము, సంఘ జీవనము, కొన్ని అప శృతులను పలకడం ప్రారంభించింది అటువంటి అపశృతులను సవరించి పురోభివృద్ధికి సక్రమ మార్గ సూత్రాలను నిర్దేశించిన మహానుభావులు అనేకులు వారిలో ఈ మన 'వేమన' కూడా ఒక విశిష్ట మూర్తిగా చెప్పదగ్గవాడు.

ఏ కాలంలోనైన మానవుని నైతిక ధర్మం నైతిక బాధ్యత మార్పు చెందదు, చెందరాదు. అటువంటి ధర్మానికి భిన్నంగా, ఏ దేశములోనూ ఏ కాలములోనూ, విపరీత ధర్మాలు, విరుద్ధాచారాలు కొనసాగిస్తే అవి మానవుని మూఢత్వానికి, అధోగతికి తద్రచ్యా సంఘ జీవన స్థంభనకు, లోక కల్యాణ భంగమునకు ఎంతటి ప్రతి కూలములో అన్న విషయాన్ని సాంసారిక జీవితంలో తాను అనుభవించి, ఆచరించి తోటి సంఘానికి తద్రీచ్యా లోకానికి సాంఘిక

భాషలో సులువుగా సూక్తిగా సూచించిన శ్రీ 'యోగి వేమన' చిర స్మరణీయుడు. ఆనాటి వేద కాలములోని నిజధర్మము ఏదో ఆచరణములో వాటినే అతడు ప్రబోధించాడు. అనాచారాల్ని ఛాందస ధర్మాల్ని ఖండించి రచించిన రచనయే వేమన సాహిత్యం. యిటువంటి ఉత్కృష్ట సాహిత్యంపై వ్యాఖ్య చేయ వలసిందిగా నన్ను కోరినటువంటి సాహితీ ప్రియులు నాదు మిక్కిలి స్నేహితులు సుప్రసిద్ధ ఆంధ్ర వాఙ్మయ ప్రచురణా సంస్థయైన శ్రీ ఎన్. వి. గోపాల్ అండ్ కో., అధ్యక్షులు శ్రీ ఎన్. వి. రామ కృష్ణన్ గారికి అనేక కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలుపు కుంటున్నాను.

యావదాంధ్ర సోదర సోదరీ మణులకు నా చిన్న మనవి ఈ 'వేమన వేద సూక్తులు' చదివిన దానిలో కొంతైనా ఆచరణలో పెడితే జీవితాలు కొంతలో కొంతైనా శాంతి, సౌభాగ్యములు పొందవచ్చని నా ప్రగాఢ విశ్వాసం ఆ కోరిక ఫలిస్తుందని ఆశిస్తూ,

మద్రాసు-17
12-8-1992

మీ
ఉదయశంకర్.

# వేమన వేద సూక్తులు

## (పద్యముల 'అకారాధి' క్రమపట్టిక)


| పద్యము | పుటసంఖ్య | పద్యము | పుటసంఖ్య |
|---|---|---|---|
| అంకె లెటిగి | 55 | ఆత్మలోన శివుని | 50 |
| అంగమెల్ల వదలి | 68 | ఆత్మశుద్ధిలేని | 33 |
| అజ్ఞానమె | 52 | ఆదిమ కవులవలె | 36 |
| అదనెరిగిన మగువ | 62 | ఆరు రుచులు వేరు | 51 |
| అనగననగ రాగ | 58 | ఆలి మాటలు విని | 28 |
| అనగననగ | 27 | ఆలి రంకు తెలుప | 42 |
| అన్నిదానములందు | 26 | ఆలి వంచలేక | 58 |
| అనువుగాని చోట | 46 | ఆలుమగని మాట | 59 |
| అన్నమరుగ నతని | 97 | ఆలు రంభయైన | 19 |
| అన్నమిడుటకన్న | 97 | ఆసనము పన్ని | 76 |
| అప్పుతీర్చలేని | 89 | ఇంటియాలి విడిచి | 59 |
| అప్పుదీయు రోత | 88 | ఇంతి చనుల బిరుసు | 65 |
| అరయ నాస్తియనక | 100 | ఇచ్చువాని చెంత | 100 |
| అరుదుగా నడిగిన | 101 | ఇనుము విరిగెనేని | 61 |
| అర్థవంతు సొమ్ము | 100 | ఇల్లు నాలు విడిచి | 21 |
| అల్పబుద్ధి వాని | 28 | ఈకెలనుచు కొన్ని | 73 |
| అల్పుడెపుడు | 46 | ఉప్పుకప్పురంబు | 23 |
| అష్టదళములకు | 75 | ఉర్వివారికెల్ల | 103 |
| అనుభూతి | 55 | ఋషులుగాని | 24 |
| అజానజ్ఞా | 64 | ఎంత చదువు చదివి | 29 |
| ఆకలిగొని | 68 | ఎరుకలేని వారలేమేమి | 36 |
| ఆకు చాటున దగు | 74 | ఎండయనక | 82 |
| ఆకులన్ని దిన్న | 78 | ఎక్కడి సుతులెక్కడి | 52 |
| ఆడుదాని బొంకు | 63 | ఎద్దుకైనగాని | 81 |

| పద్యము | పుటసంఖ్య | పద్యము | పుటసంఖ్య |
|---|---|---|---|
| ఎరుక లేని దొరల | 51 | కాఁకి బోవువాని | 41 |
| ఎరుక మాలువాడు | 18 | కార్యేషుదాసీ | 61 |
| ఎరుగకుంట లెస్స | 35 | కుండ కుంభమన్న | 22 |
| ఎలుగుతోలు దెచ్చి | 25 | కుక్క తోకదెచ్చి | 33 |
| ఏక బ్రహ్మంబు | 35 | కులము గలవారు | 95 |
| ఏరు దాటి | 41 | కులము లేనివాడు | 95 |
| ఒకని జెఱుచు | 13 | కూడబెట్టుకున్న | 42 |
| ఓగు నోగుమెచ్చు | 86 | కోటి దానమిచ్చి | 87 |
| ఔనటంచు | 24 | కోతిబట్టి తెచ్చి | 83 |
| కడుపు బోరగించి | 78 | కోపమునను ఘనత | 87 |
| కడుపు నిండ తవుడు | 19 | కిటుకెరుఁగనీక | 47 |
| కపట వేషమూని | 89 | ఖలుల తిట్టిరంచు | 49 |
| కబ్బ మొకటి | 36 | గంగ పారుచుండు | 103 |
| కల్ల నిజము | 32 | గుడులు దేవతలని | 91 |
| కలిమిగల యతనికి | 70 | గుణములో గలవాని | 45 |
| కలిమి జూచి | 70 | గుణవతియగు యువతి | 61 |
| కలిమియున్న వాని | 71 | గొప్ప బిరుదుగన్న | 66 |
| కలిమి లేనివాడు | 44 | గురుడనగా | 81 |
| కల్లు కిచ్చునట్లు | 27 | గురుని శిక్ష లేక | 45 |
| కాంచనంబుపైన | 64 | గురువు చిల్లగించు | 48 |
| కాకి పక్షులందు | 23 | గురుడు తాన యనుచు | 80 |
| కానివానిచేత | 89 | గురువునకును పుచ్చు | 80 |
| కారుకారు గరులు | 79 | గురువు లేక విద్య | 48 |
| కాళ్ళు చేతులుండ | 38 | గుహలలోన జొచ్చి | 39 |
| కావి పంచగట్టి | 38 | గొడ్డుటావు బిదుక | 101 |
| కాశికాశి యంచు | 41 | గొఱ్ఱెలు పదివేలు | 75 |
| కాశి నీళ్ళు మోసి | 41 | గోచి విడుచువాని | 22 |

| పద్యము | పుటసంఖ్య | పద్యము | పుటసంఖ్య |
|---|---|---|---|
| గ్రాస మింతలేక | 79 | తరుణి పుణ్యవతిగ | 57 |
| చంపదగిన యట్టి | 105 | తరుణి సొగసుకాని | 66 |
| చదువు చదవకున్న | 44 | తరువ తరువబుట్టు | 21 |
| చదువు జదువనేల | 50 | తల్లి గర్భమందు | 73 |
| చదువులెల్ల జదివి | 65 | తల్లివలన బుట్టి | 20 |
| చదివిన వానికన్న | 32 | తల్లిదండ్రి మీద | 84 |
| చదువులెల్ల చదివి | 56 | తల్లి దండ్రి హితులు | 19 |
| ఛాత్ర ధర్మమెరిగి | 79 | తాతగన్న తల్లి | 72 |
| చిక్కియున్న వేళ | 31 | తానె తత్త్వమనుచు | 28 |
| చిత్తశుద్ధి కలిగి | 50 | తాము గడన సేయు | 98 |
| చీమ కుట్టనేని | 22 | తాము కన్నవారు | 56 |
| చెప్పులోని రాయి | 28 | తిరుపతిక బోవ | 26 |
| చేటు వచ్చెనేని | 39 | తీర్థయాత్ర కనుదు | 40 |
| చేత ధనము పెట్టి | 103 | తోలు తిత్తిలోన | 54 |
| జడలు కట్టనేల | 76 | దర్శనంబు లందు | 29 |
| జనన కాలమంచి | 72 | దశము యేకాదశి | 92 |
| జార పురుషునకు | 60 | దాతలేని కొంప | 96 |
| జీవి జీవి జంప | 105 | దాన ములను జేయధర | 96 |
| టీక వ్రాసినట్లనేకులు | 18 | దుండగీడు కొడుకు | 86 |
| ఠింగణాలు బిలిసి | 25 | దేవుడనగ వేరే | 52 |
| తండ్రి సొమ్మునైన | 99 | దేవుడనగ వేరు దేశమం | 93 |
| తగిన కులజుండైన | 63 | ద్రోహ బుద్ధినైన | 99 |
| తనదు భ్రాతలెల్ల | 97 | ధనము కూడబెట్టి | 102 |
| తనదు సొమ్ము జాడ | 98 | ధనము లేమియనెడి | 94 |
| తనువు లస్థిరమని | 89 | ధనమే మూలము | 94 |
| తనువులోన నున్న | 32 | దేహ గుణములెల్ల | 49 |
| తప్పులెన్నువారు | 27 | నానార్థీతు భవేత్తావద్యాం | 42 |

| పద్యము | పుటసంఖ్య | పద్యము | పుటసంఖ్య |
|---|---|---|---|
| నిక్కమైన మంచి నీల | 14 | పేదవాడుయైన | 70 |
| నిజము లాడువాని | 31 | పేరు సోమయాజి | 67 |
| నీళ్ల మునగ నేల | 40 | ప్రాణమందు శివుని | 76 |
| నీళ్ళలోని చేప | 64 | బంచె త్రాళ్ళుదెచ్చి | 92 |
| పంచమ నిగమంబు | 105 | బట్ట త్రాళ్ళతోను | 92 |
| పంచ శత్రులదెగి | 18 | బయలున సర్వము | 53 |
| పంది పిల్లతాను | 32 | బహుళ కావ్యములను | 34 |
| పతిని విడువరాదు | 63 | బాపడనగ నేమి | 104 |
| పదుగురాడు మాట | 24 | బోటి యొకతె | 57 |
| పనస తొనలకన్న | 62 | బ్రతుకు తెగువులేని | 38 |
| పట్టరాని పట్టు | 37 | బ్రహ్మజంపి | 51 |
| పట్టు పట్టరాదు | 47 | బ్రహ్మ మేడదనుచు | 93 |
| పట్టు పట్టిన తరి | 47 | బావమరసి తన్ను | 59 |
| పరనారీ సోదరుడై | 34 | భార్య మీద ఆశపరగ | 58 |
| పరుల దిట్టినంత | 83 | మంచివారు లేరు | 88 |
| పరుల మోసపుచ్చి | 88 | మంచి శకునములనె | 71 |
| ప్రస్తావ సదృశం | 46 | మంత్రమును దలుతురు | 46 |
| పాపమనగ వేరె | 82 | ముక్కుకు జననేల | 26 |
| పాముకన్న లేదు | 82 | మనసులోని వాని | 75 |
| పాల పక్షి శకున | 43 | మాతృవత్పర | 34 |
| పాలరాళ్ళ దెచ్చి | 29 | మాలవాడయినను | 53 |
| పిండములను జేపి | 43 | మాలవాని నేల | 104 |
| పికము వనములోన | 22 | మావత్స్వస్థమిదం | 55 |
| పిసినివాని యింట | 101 | మిరెపుగింజ చూడు | 23 |
| పుస్తకములు జదలు | 39 | ముక్కుత్రాళ్ళు గుచ్చి | 77 |
| పృధివి కుదకమేగె | 21 | మేడిపండు జూడ | 86 |
| పెట్టి పోయలేని | 96 | మైధునమున బుట్టు | 20 |

| పద్యము | పుటసంఖ్య | పద్యము | పుటసంఖ్య |
|---|---|---|---|
| యొడలుబడలు చేసి | 77 | వెనుక జాతమన్న | 30 |
| యోనియందె పుట్టి | 30 | వెర్రి నక్కలవలె | 37 |
| ఱ్రాను దిద్దవచ్చు | 85 | వెట్టివానికైన | 69 |
| రక్తిలేని పసుల | 18 | వేద విద్యలెల్ల | 48 |
| రాజపురుల కెపుడు | 66 | వేదములను చదివి | 37 |
| రాతి బొమ్మ కేల | 91 | వేమన చెప్పిన మాటలు | 17 |
| రామనామ పఠన | 104 | వేము పాలుబోసి | 25 |
| రాయియగు | 90 | వేరు పురుగువేరి | 84 |
| రాళ్ళదెచ్చి నరులు | 90 | వేషభాష లన్ని | 78 |
| రూపు నడక జూడ | 66 | శాంతమే జనులను | 87 |
| లంజ కొరకు | 67 | శివలింగ పూజ | 91 |
| లోభివాని జంప | 102 | శిలను ప్రతిమచేసి | 90 |
| వలపు విరిగెనేని | 19 | శూద్రతనము పోదు | 30 |
| వలపు కలిగెనేని | 65 | శూద్ర యువతి | 31 |
| వాడ కురికి తిట్టు | 60 | శ్రీకరంబగు వేమ | 17 |
| వావి వర్తనలును | 45 | సకల యజ్ఞములకు | 40 |
| వ్యాధి నెఱుగలేని | 30 | సాధనంబు లేక | 31 |
| వివాద శీలాం | 60 | సిగ్గుగల | 73 |
| విడువవలయు నూరు | 54 | సిగ్గు విడువకున్న | 74 |
| విత్త మొకనికిచ్చి | 33 | సుహృన్మిత్రా | 35 |
| విప్రులెల్ల వాడి | 71 | సుగుణవంతురాలు | 57 |
| వెతల దీర్చువాడు | 56 | సుతులు సతులు మాయ | 31 |
| వెన్న చేతబట్టి | 77 | సేతుమందు | 25 |
| | | స్వానుభూతి లేక | 54 |

# వేమన వంశవృక్షము

కొండవీటిసీమను పాలించిన ప్రోలయవేమారెడ్డి

|

అనవేమారెడ్డి

|

అనపోతవేమారెడ్డి

|

కుమారగిరివేమారెడ్డి

| కుమారగిరివేమారెడ్డి కుమారులు | |
|---|---|
| కోమటివెంకారెడ్డి | అనవేమారెడ్డి (యోగివేమన) |

కొండవీటిసీమను పాలించిన మొదటివాడు ప్రోలయవేమారెడ్డి ఇతని కుమారుడు అనవేమారెడ్డి, ఇతడు ముప్పది సంవత్సరములు రాజ్యమేలెను. ఇతని కుమారుడు అనపోతవేమారెడ్డి యుద్ధమున వీర మరణము నొందెను. ఇతని పుత్రుడు కుమారగిరివేమారెడ్డి. ఇతని కుమారులు కోమటివెంకారెడ్డి, అనవేమారెడ్డి (యోగివేమన) యనువారలు.

# పీ ఠి క

## వేమన చరిత్ర - తత్త్వదర్శనము

సహస్ర వర్ష విస్తార విశిష్ట చరిత్ర కల్గినటువంటి ఆంధ్ర సాహితీ సాగరంలో వేమన కవిత ఒక ఉప్పెన వేద, పురాణ, కావ్యాగమాదులు పుక్కిటబట్టిన వాఙ్మయ బ్రహ్మలు నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱనాదులకుగాని, ఆ తరువాత వారైన పోతన, శ్రీనాధులకు గాని లభించని అద్వితీయ ప్రాచుర్యం ఒక కర్షక కవికి లభించిందంటే, కేవలం అతని కవితలో వున్న వాస్తవిక దృష్టి, లౌకిక భాషాపుష్టి మతాతీత మానవాభ్యుదయ మార్గసృష్టి.

మానవతావాది, చైతన్యమూర్తి, కర్మయోగియైన ఈ వేమన యోగి చరిత్రను గమనిస్తే.

చాలా కథలు ప్రచారంలో విన్పిస్తున్నాయి.

బహుళ ప్రచారంలో వున్న ఓ కథ

కొండవీటిని పాలించిన ప్రోలయ వేమారెడ్డి మనుమడైన అనపోత వేమారెడ్డికి వేమన మనుమడని, చాలాకాలం ఒక వేశ్యకు తగులుకుని విచ్చలవిడిగా తిరిగేవాడని, ఇతనికి గల అన్న, వదిన యితన్ని చాలా గారాబంగా చూడడం. వదిన, మరిది అడిగినదల్లా యిస్తూ వుండడం, చాలాకాలం లోకం తెలియకుండా ఆ వేశ్యే సర్వస్వమనుకొని జీవిస్తూ వుండగా—

వదిన ముక్కెరను చూచిన ఆ వేశ్య వేమనను, ఆ ముక్కెర కోరడం, దానితో వేమన వదినను అడగడం, వదిన మరిదికి జ్ఞానోదయం కలుగజేయాలనే తలంపుతో, సరేనని ఆ [illegible]

గదిలో వివస్త్రయై ఒంగుని వుండి కాళ్ళ మధ్యనుండి వెళ్ళి మంచంమీద వుంచిన ముక్కెరను తీసుకోమనగా, స్త్రీ స్వరూపం చూచి చలించిన వాడైన వేమనకు జ్ఞానోదయం కల్గిందని, పిదప అన్న ఆజ్ఞమేరకు రాజ సంబంధమైన నగల తయారీ కర్మాగారానికి ఉద్యోగిగా నియమింపబడినాడని, అది యేదో యధాలాపంగా చేస్తూండడం, అదే కర్మాగారంలో పనిచేస్తూన్న 'అభిరాము'డనే విశ్వకర్మ రోజూ పనికి ఆలస్యంగా రావడం, వేమన అతనిని మందలించినా అతను మౌనంగా ఉండడం.

అది వేమనలో ఆశ్చర్యాన్ని కలుగజేయడంతో అభిరాముని ఆలస్యానికి కారణం ఏమిటో తెలుసుకోదలచి వేమన వేకువ ఝామునే అభిరాముని యింటి ప్రాంతమందుండి గమనించగా, అభిరాముడు పూజా ద్రవ్యములతో ఆ వూరు చివర్లో వున్న ఒక కొండ గృహలోకి ప్రవేశించి తన గురువుని పూజించడం, అభిరాముని అనుసరిస్తూ వేమనకూడా ఆ గృహలో చాటుగా ప్రవేశించడం.

గురువు అభిరాముని వుద్దేశించి, నాయనా! నాకు కాలము సమీపించింది. రేపటి దినము యిదే సమయమునకు నీకు "మోక్ష విద్య" నుపదేశిస్తాను. రా అనగా ఆ మాటలు విన్న వేమన, ఆ మోక్ష విద్య తాను పొందాలనెడి ఆకాంక్షతో వదినకు చెప్పి, అన్నతో అభిరామునికి అత్యవసర కార్యము అప్పగింపజేసి, అభిరామునికి బదులు, అతని అనుచరునిగా గురువువద్ద మోక్షవిద్య పొందెనని, తర్వాత జరిగిన విషయమునకు అభిరామునికి క్షమాపణ చెప్పుకుని అతని జ్ఞాపకంగా, తన పద్యాల్లో మకటంగా "విశ్వదాభిరామ వినురవేమ"లో అభిరాముని చేర్చి సంతుష్టుడైనాడని చెపుతూ వుంటారు.

ఇది ఎంతవరకూ నిజమో గమనిద్దాం సర్వసాధారణంగా కవి తన కావ్యాల్లో గాని, రచనల్లోగాని, తన చరిత్ర గూర్చి ఎంతో కొంత చెప్పుకుంటాడు అవే అతని కాలమాన చరిత్రను పరిస్థితులను చాటి చెప్పడానికి ఆధారభూతమౌతాయి

ఊరుకొండ వీడు ఉనికి పశ్చిమవీధి
మూగ చింతపల్లె మొదటి ఇల్లు
ఎడ్డెరెడ్డి కుల మదేమని తెల్పుదు

అని వుంది ఒక సంకలనంలో, కాని ఇది సి పి బ్రౌన్ సంకలనంలో లేదు మరీ పద్యం వారికి ఎక్కడ లభించిందో తెలియదు

ఇక్కడ కొండవీడొకటి, మూగ చింతపల్లె మరొకటి కన్పిస్తున్నాయి. ఈ వూరు గూర్చి పరిశీలిస్తే ఈ మూగ చింతపల్లె అనే వూరు రాయలసీమలో చిత్తూరుజిల్లా చంద్రగిరి దగ్గర ఒకటి, మరొకటి కడపజిల్లాలోనూ కన్పిస్తున్నవి. ఇక ఆంధ్రలో ఈ పేరు మూగచింతపల్లెగా ఎక్కడా కన్పించడంలేదు, చింతపల్లె పేరుతో మాత్రము చాలా వున్నవి.

ఈ కడప జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వేమన పుచ్చకాయలను తన చేతి కర్రతో కొట్టి కాయలను బంగారంగా చేసాడని కట్టుకథలు, పురాణాల్లా చెప్పేవాళ్ళు చాలామంది వున్నారు.

వారు చెప్పే కథలు నమ్మ శక్యంగాక పోయిన, వేమనసాహిత్యాన్నంతా తరచి చూస్తే అతనిలో ఆవిర్భవించిన తత్త్వసంపన్నునికి ''హేమకార విద్య'' అసాధ్యమైనది కాదేమో, కొండవీడుకి, మూగ చింతపల్లెకి పొత్తులేదు. చరిత్రాకారుల నిర్ణయం ప్రకారం మూగ చింతపల్లె అనునది వేమన జన్మస్థలంగా చెప్పబడుతోంది.

వేమన ఈ పద్యంలో ''ఎడ్డె రెడ్డికులము'' అన్నాడు మరొకచోట—

కలియుగమున నున్న కాపుకులానకు
వేమన తనకీర్తి విక్రయించె' అన్నాడు

కులాల్లో రెడ్డి, కాపు అనేవి యించుమించు సమతుల్యంగా కన్పిస్తూ, బహుశా, రాచరికాలు ఏర్పడిననాటినుండి ఈ బేధం ఏర్పడి వుండొచ్చేమో, రాయలసీమ జిల్లాల్లోని కొన్నిచోట్ల కాపుని అని రెడ్డి అని పిలుస్తూండడం కూడా వుంది.

వేమన ఈ ప్రాంతాన్ని బాగా తిరిగినవాడు అందునా ఆనాడు రెడ్డి, కాపు అనే తారతమ్యం లేకపోయివుండొచ్చు, తనకీర్తి అంతా కాపుకులానికి చెందుతుంది అన్నాడు అందుచే యితడు కాపుగాని రెడ్డిగాని కావొచ్చు, (కులప్రసక్తి అనవసరమే, కాని చారిత్రక ప్రాధాన్యత దృష్ట్యా చర్చించవలసొచ్చింది )

ఇక ముందు చెప్పిన కథ ప్రకారం వూరు కొండవీడు మాత్రం కాదని పాఠాంతరాలలో చేర్చినదై వుండుటకు అవకాశములు హెచ్చు. కొండవీడు రాజులకి ఈ వేమనకి అంతగా సంబంధం లేదనిపిస్తోంది.

ఎందుచేతనంటే, ఎక్కడా తన రాచరికం గురించిగాని అటువంటి సంఘటనల గూర్చిగాని ప్రస్తావనే లేదు. మొత్తంమీద ప్రచారంలో వున్న కథ కల్పిత గాదేగాని, వాస్తవ చరిత్రకాదని చెప్పవచ్చును.

అలానే యింకో పద్యంలో

కాపు కులజులెంత కర్ములైననుగాని
పాపరాశికొంత పరసిపోవు
వివర మెరుగనట్టి వెర్రిజీవులుగాన: అన్నాడు.

తన కులంవారు పాపపుణ్యాలు తెలియనివారని, అమాయకు లని చెప్తున్నాడు.

అంతేగాని ఎచ్చటనూ రాచరికపు పోకడలు ప్రదర్శించడం లేదు. యోగికదా రాచరికాన్ని ఎందుకు ప్రదర్శిస్తాడనే వారున్నారు. యోగైనా, జోగైనా, కనీసం తన కులచరిత్రలో పూర్వాశ్రమ వాతావరణం ఎక్కడో చోట అనుకోకుండా చెప్పక తప్పదు. కథలోని ప్రోలయ వేమారెడ్డిముని మనుమడు ఈ వేమన మాత్రం కాదనిపిస్తోంది.

ఈ వేమన ఒక మధ్య తరగతికాపు. తిండికీ, బట్టకీ లోటు లేనివాడు అయి వుండవచ్చును.

ఇక అతని విద్యా విషయం గమనిస్తే—

గురువులేక విద్య గురుతుగా దొరకదు. అంటూ ఓ పద్యంలో విద్యకి గురువు అవసరమని,

గురుడనగా మొదలంతుకు
గురుశిష్యుల నంగనెల్ల కొమ్మలుకాగా! అన్నాడు

గురువు వృక్షానికి మొదలైతే శిష్యులు కొమ్మలువంటి వారని చెప్తున్నాడు. వీటిరీత్యా వేమన ఉత్తమ గురువువద్ద విద్యాభ్యాసం చేసి, ఆ కాలంలోని తెలుగు, సంస్కృతాలు పఠించి వుంటాడని భావించుటలో దోషము లేదు.

యుక్తవయస్సు:-

గొప్ప పిరుదుగన్న కుచకుంభముగన్న
చెప్పరానిచోట చేవగన్న
ముప్పిరి గొనునయ్య మొనసిన మోహంబు! అన్నాడు

అలానే మతము దారి మరచు మధురాధరము జూచి
మగువ రూపుజూచి మనసు మరచు
యోనిజూచి సర్వయోగములు మరచురా॥

బహుశా తన యుక్తవయస్సునందలి యవ్వనోద్రేక అనుభవాలు యిలా చెప్పుకుంటున్నట్టుంది. ఎందువేతనంటే?

కడుపునిండ తవుడు గంపలో పెట్టక
చన్ను ముట్టనీదు తన్నుబర్రె
వారకాంత విటుని వలచునా యూరక

ఇదొక అనుభవం గావొచ్చు వేమనకు

వివాహం -"తుంట వింటివాని తూపుల మాతకు
మింట మంట నడుమ మిడుక దరమె
ఇంటి యాలు విడిచి యెట్లుండవచ్చురా" అన్నాడు.

సలక్షణమైన, రూపగుణ శోభితయైన ఒక యువతిని పెండ్లాడి, ఆమెతో ఆనందాన్ని పంచుకున్నాడన్న మాట, పెండ్లాన్ని విడిచి వుండడం కష్టమంటున్నాడు అంటే అంత అన్యోన్య కలయి కన్న మాట వాళ్ళది ముందెన్ని వేషాలు వేసినా, పెండ్లయ్యాక గ్రహించి వుంటాడు.

"ఇంటి యాలు విడిచి యిల జారకాంతల
వెంట దిరుగువాడు వెర్రివాడు
పంట చేను విడిచి పరగ యేరినయట్లు"

పెళ్లాం వుండగా వేశ్యల వెంట తిరిగే వాళ్ళని దుయ్యబడు తున్నాడు, అటువంటివాణ్ణి పంట పొలములో రాలిన పరగతో పోలుస్తున్నాడు అంటే చక్కనైన సంసార సౌఖ్యాన్ని, దానిలో వున్న రుచిని చవిచూసాడు. బహుశా వేమన సంసారం కొంతకాలం

వరకూ ఏ చీకూ చెంతా లేకుండా సాగి, ఆ తర్వాత భార్యకీ తనకీ ఏవో పొరపొచ్చలు వచ్చి వుండొచ్చు

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు యింతింత కాదయా' అన్నాడు

తన యింటిలో ఏదో అలజడి ప్రారంభమై వుండినట్టుంది. ఈ విషయ నిర్ధారణకి ఈ ఒక్క పద్యమే ఆదారం కాదు అనేక పద్యాల్లో స్త్రీ ద్వేషాన్ని వెళ్ళగ్రక్కాడు

ఒకచోట:- వలపు కలిగెనేని వనజాక్షి యధరంబు
పంచదార కుప్ప పాలలప్ప' అన్నాడు.

అదేతర్వాత:వలపు విరిగెనేని వనజాక్షి యుధరంబు
ములకపంటి గిజరు ముష్టి రసము' అంటూ.

ప్రేమ పుట్టినప్పుడు ప్రియురాలి పెదవి పంచదార కుప్పలా ఎంతో మధురంగా వుంటుందని, ఆ ప్రేమ విరిగిందంటే అదే పెదవి ములకకాయ గింజ బాగా ముదిరింది కొరికితే ఎలా ఉంటుందో అలా చేదుగా వుంటుందని పోల్చి చెప్పాడు

యింకా అంటాడు.-తనదుష్ట భార్య తన యాకలినె కాని
పరుల యాకలెరుగ దరయ'' అంటాడు

బహుశా, వేమన కుటుంబ పరిస్థితులు కొంచెం దెబ్బతిని తత్కారణంగా కుటుంబం గడవడం కొంత కష్టమైనదేమో, అలాంటి పరిస్థితుల్లో కొందరు ఇల్లాళ్ళు భర్తను సాధించడం ఉన్నప్పటిలా చూడక పోవడం సహజమే కదా'

దీనికే కలిమి గలిగెనేని 'కాముగా' జూతురు
లేమి చేతజిక్కి లేవలేని
మదను వంటివాని 'మాలగా' జూతురు అంటాడు.

ఉన్నప్పుడు లేదా నాల్గు డబ్బులు సంపాదిస్తున్నప్పుడు భార్య ఎంతో గోముగా, ఎనలేని అనురాగం వ్యక్తం చేస్తాదట, చిల్లికాణీ సంపాదన లేనప్పుడు ఎలా చూస్తాదో చెప్పాడు.

ఇలాంటి సంసార చికాకులు అధికమై "ఇంటిలోని పోరు ఇంతింత కాదయా" అంటూ భార్యపోరు భరించలేక,

యినుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు క్రమముగాను
మనసు విరిగెనేని మరి చేర్చరాదయా

అంటూ సంసార జీవితం నుండి నిష్క్రమించి, వైరాగ్య చింతన మనస్సు నిండా అలుముకోవడంలో విరాగియై, యోగులతో కలిసి తిరగడం ప్రారంభించి ఆధ్యాత్మిక తత్త్వం గురించి తెలుసు కుంటూ వూరూరా తిరుగుతూ

శివకవులకు నవకవులకు
శివభక్తికి తత్త్వమునకు, చింతామణికిన్
శివలోక ప్రమధులకును
శివునకు గురువునకు శరణు సేయర వేమా

అంటూ తనకున్న భాషాజ్ఞానంతో కందపద్యంలో తన వేదాన్ని పలకడం ప్రారంభించాడు.

సర్వసాధారణంగా యోగులు, విరాగులు, సన్యాసులు, వైష్ణవత్వం కన్నా, శైవత్వాన్నే అధికంగా స్వీకరిస్తారు. శివుడే వారికి ముక్తి ప్రదాతని భావించడం అధికం.

కాబట్టే శివుణ్ణే ముక్తిదాతగా ఎంచి, ఆ పశుపతి మీద తొలి పద్యాన్ని పలికాడు.

అలా యోగిగా రాయలసీమ ప్రాంతం పర్యటిస్తూ తనకు తనే యోగినని చెప్పుకున్నాడు.

వేమన నగయోగి వెలసె లోకములో
పూజ విడుదు పుణ్య పురుషులార
పూజలిడిన యంత భుక్తిముక్తుల నిచ్చు

అక్కడనుండి దిన దినం తనకు కన్పించే ప్రతి సంఘటన మీద అభ్యుదయ భావంతో ఎదురు తిరిగి,

ఆత్మశుద్ధిలేని యాచార మదియేల
భాండశుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా

అంటూ తన కవన శంఖాన్ని పూరించాడు యోగులకు, సన్యాసులకు, మాదవకవళమే కదా శరణ్యము

దానితో ఆకలన్న వాని కన్నంబు బెట్టిన
హరుని కర్పితముగ నారగించు అని

దొరికినది తింటూ అవిశ్రాంతిగా తత్వ శోధన చేస్తూ

నీతి తెలియజెప్ప నిజముగ వేమన
పాతకముల నెల్ల పారబట్టి
లోతు తత్త్వ మరసి లోకులకును జెప్పె.

నీతిని లోకానికి చెప్పడానికి తత్త్వం యొక్క లోతుకెళ్ళి తరచి తరచి చూసి చెప్పినట్టు తెల్పుకుంటున్నాడు, యిది అక్షర సత్యము సంఘంలో వున్న ప్రతి విషయం మీద బలీయమైన తన తత్త్వాలోచనంతో నూతన ప్రభావాన్ని రగులు కొల్పాడు శాస్త్రాలు, మతాలు, నమ్మకాలు, ఆచారాలు, వంటివాటిపై తీవ్ర అక్షేపణ లేవ

దీస్తూ చురకల్లాంటి వ్యంగ్య పదజాలంతో నవ్య నవనీత మాన వాభ్యుదయ మత బోధ గావించడం ఆరంభించాడు

ఒకచోట దొంగ సన్యాసుల్ని నిలదీశాడు మరొకచోట దురాచారాల్ని దుయ్యబట్టాడు యింకొకచోట మూఢ నమ్మకాలు ఒమ్ముగావించాడు సంసారంనుండే సన్యాసి కావాలంటూ, మానవ మనుగడకు, ధర్మం, నీతి, న్యాయం, కట్టుబాట్లు, యొక్క అవశ్య కతని గుర్తింపజేస్తూ ముందుకు సాగాడు.

వేమన కాలం సుమారు 1670 లేదా 17వ శతాబ్ద పూర్వ భాగమందు జీవించినట్టుగా చారిత్రిక పరిశోధకులు భావిస్తున్నారు

వేమన రూపం:-

సర్వసాధారణంగా వేమన పేరు చెప్పగానే దిసమొలతో వున్న చిత్రం కండ్లముందు కన్పిస్తోంది. కారణం, ఆ బొమ్మలోనే వేమన రూపాన్ని చూడడంవలన వేమన గూర్చి పరిశోధన చేసిన వారు, కొందరు విమర్శకులు, వేమన చిత్రం దిగంబరునిగా వుండడం చూసి, అంటే ఈ దిగంబరరూపం 1920 ప్రాంతంలో మల్లిడి సత్తిరెడ్డి అనే వ్యక్తి "రెడ్డిరాణి" అనే మాసపత్రికలో, తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయమునందు వేమన చిత్రం దిసమొలతో వున్నట్టు ప్రకటించడం

దానితో అప్పటినుండి వేమనకు దిగంబరత్వం సార్థకమైంది. ఇటువంటి దిశ మొలతో అనగా మోకాలు పైకిఎత్తి రెండపకాలు క్రిందగా పఱచి కూర్చున్నట్టున్న చిత్రం. ఇటువంటిదే కంది మల్లయపల్లెలో వున్నటువంటి శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో, శ్రీ బ్రహ్మంగారి సమాధికి చేరువుగా మూడడుగుల ఎత్తుగల నల్లరాతితో మలచిన వేమన విగ్రహం

ఒకటి కన్పిస్తూన్నది. ఐతే మన విమర్శకులు భావిస్తూన్నట్లు వేమనపై జైనమత ప్రభావం వున్నట్లు కన్పించదు, కేవలం దిగంబరత్వమే జైనమత ప్రభావంగా భావించడానికి వీల్లేదు. హిందూ యోగులకు దిగంబరత్వం అనాదిగా వుంటున్నది. యిప్పటి హరిద్వార ఋషీకేష్ ప్రాంతంలో అనేకమంది దిగంబరులు మౌనంగా తిరుగుతూ కన్పిస్తూంటారు హరిద్వారలో జరిగే కుంభమేళా కార్యక్రమానికి దేశంలోని ఎక్కడెక్కడి హిందూ దిగంబర యోగులు ఆరోజు అక్కడే దర్శనమిస్తారు. ''వేదవిద్యలెల్ల వేశ్యల వంటివి'' అని వేదాలని దుయ్యబట్టినప్పటికి

పంచాక్షరి బీజంబుల
సంచితముగ నెరుగు నా తడఖిలజ్ఞుండై
వంచన మెరుగక కువలయ
సంచారము సేయునతడు శంభుడు వేమా। అంటూ.

ఓం ''నమశ్శివాయ'' అనే పంచాక్షరీ మంత్ర విశిష్టతను పొంది, తత్ప్రభావాన్ని అనుభవించి దాన్ని గూర్చి లోకానికి చెప్తున్నాడు

వేమనకన్న గొప్పవారు ముందు వెనుక జన్మించి యుండ వచ్చు, అందునా సాహితీవేత్తలూ వుండుగాక. కాని వేమనయోగి లాంటి ప్రజాకవి మాత్రం యీనాటి వరకు తెలుగు భూమియందు లేరనే చెప్పవచ్చు వేమనను గూర్చి లోతుగా యోచిస్తే—

వేమన ప్రపంచ ప్రఖ్యాత గ్రీకు తాత్విక చక్రవర్తి, విజ్ఞాన మహర్షియైన సాక్రటీసుతో పోల్చ తగిన వాడని చెప్పటలో ఎంత మాత్రము అతిశయోక్తి లేదు సాక్రటీసు జీవితంలో భార్యతో పోరాక జీవనమలుపు, అట్లే, ఈ వేమన యోగిది

తల్లి గర్భమందు తాబుట్టినపుడు
మొదలు బట్టలేదు తుదకులేదు
నడుమ బట్టకట్టునగుబాటు కాదొకో

పుట్టినప్పుడు ఏ మానవుడికి బట్టుండదు. అలానే మరణించిన పిదప కూడా ఏర్పడుతుంది ఈ మధ్యకాలంలోనే బట్టకట్టేది అంటున్నాడు ఈ పద్య భావతత్త్వానికి చేరుకోవడానికి వేమనకు యోగిగా ఎంతటి సమతాదృష్టి వుండి వుంటుందో అర్థమౌలోంది. సృష్టిలోని ప్రతి వస్తువుని ఒకే విధంగా చూడగల భావనకు. ఆ వ్యక్తిలో ఎంతటి వైరాగ్యత వుండాలో కదా!

ఈ భావం మనస్సు నిండా అలుముకుంది. ఆత్మలోని దైవాన్ని నిత్యం దర్శించి ఆనందించ గలుగుతున్నాడు. యోగిగా పరిపక్వత, మోక్షగామిగా పరిపూర్ణత ఏర్పడినాయి. ఆ స్థితిలో కనీసం వంటిమీద వస్త్రం వుండాలనే ధ్యాసే లేకపోయింది.

సంఘం కట్టుబాట్లకు వ్యతిరేకంగా దిగంబరంగా గుడ్డలు విప్పకు తిరగడమంటే. ఆ పరిస్థితుల్లో వేమనను చూసిన జనం ''వెర్రివేమన్నంటూ'' ముక్కుమీద వేలేసుకు నవ్వుకుంటున్నారు అటువంటి తరుణంలో—

ఈకెలనుచు కొన్ని తోకలనుచు కొన్ని
కోకలనుచు కొన్ని గోచులనుచు
కచ్చమూయ నెన్ని కట్టడిజేసెరా

అంటూ పక్షులు, పశువులు ఏ విధంగా తమ మర్మాంగాలని దాచుకుంటున్నాయో, మానవులు, చీరలు గోచీలు ఎలా కప్పుకుంటున్నారో చెప్పాడు

తన దిగంబరత్వాన్ని చూసి జనం నవ్వినందుకుగాను యింకొక చురక అంటించాడు అందరూ నోరు మూసుకుని ఆలోచించేట్టుగా.

గోచి విడుచువాని కోతినట్లాడించి
వెర్రివాని జేసి వెడలదరుము
తనదు భార్యయొద్ద దాగోచి తియ్యడా

అంటూ ప్రతివాడికి ముల్లులా గుచ్చాడు తనదు భార్యయొద్ద దాగోచి తియ్యడా

ముందు పద్యంలో సృష్టిరహస్యాన్ని అతిచక్కగా అందించాడు "ఈకెలనుచు కొన్ని తోకలనుచు కొన్ని" అంటూ మానవులకి, వాటికి వున్న యింగిత జ్ఞాన భేదాన్ని వాటికిలేని సిగ్గు, మానవులకి వుండే సిగ్గు చెప్తూ ఎలాంటివాడూ పెళ్ళాం దగ్గర సంభోగ కార్యంలో గోచీ తియ్యవలసిందే సుమీ!

సిగ్గు, సిగ్గన్నమాట లోటి జనాల నాలుకలనుండి విని,
సిగ్గుగల దటంద్రు సృష్టిలోపలివారు
వెర్రివేమన గని వెరగుబడిరి

తనకు గలుసిగ్గు దైవమే యెరుగురా! అంటూ సిగ్గంటే ఏమిటో వివరించాడు

అక్కడితో వూరుకోక, సిగ్గు విడువకున్న శివసౌఖ్యమే లేదురా అంటూ తన సహజ దోరణిలో తత్త్వాన్ని పూరించాడు

నవయుగ కవితా వైతాళికుడు శ్రీ గురజాడకు వేమన కవిత ఒక స్పందన. వేమన తన కవితలో ఆనాటి కన్యా శుల్కాన్ని ఖండిస్తూ—

పేదవాడుయైన పెంటికిచ్చెదనని
పైడి నడుగరాదు పడుషమునకు
పైడిగొనుట పెంటిబట్టిన యట్లయా

కన్నతండ్రి ఎంతటి నిరుపేదయైనా కన్యాశుల్కం మాత్రం పౌరుషానికైనా తీసుకోకూడదంటూ

''కలిమిజూచి యియ్య కొయమిచ్చినయట్లు'' ధనవంతుణ్ణి చూసి పిల్లని కట్టబెడితే, అది పిల్ల శరీరం అమ్మినట్లౌతుందే కాని పెండ్లి కాదు సుమీ' అంటున్నాడు

* శ్రీ గురజాడ సాంఘిక చైతన్య కవన కెరటాలకి వేమన ఆవేశాన్ని ప్రోత్సాహాన్ని రగిలించిన వాడనడానికి మరో మచ్చు తునక—

గ్రాసమింతలేక కడు కష్టపడుచున్న
విద్యయేల నిలచు వెడలుగాక అని.

కష్టపడే వానికి తగిన తిండి అవసరమని అది లేకపోతే ఏమీ చేయలేడని చెప్తున్నాడు.

వేమన సంఘంలో పాతుకుపోయిన ధన మదాంధులపైన, సాంఘిక సమతా వాదంపైన, తనకున్న అభ్యుదయ విప్లవ దోరణిని వెల్లడిస్తున్నాడు

ద్రోహ బుద్ధినైన దొంగరికెమునైన
నటులనైన సాహసమునవైన
సంపదధికు వలన సాధించి ధనమును
బడుగునకు నొసంగు బాగు వేమ' అంటూ.

---

* ఉసురోమని జనాలుంటే, అనే పద్యం

ఏ విధంగానైనా సరే వున్నవాణ్ణించి లాగి ధనాన్ని బల హీనుడికి పంచిపెట్టమంటున్నాడు

ఇప్పటికి సుమారు 300 సంవత్సరములనాడే వేమన ఎంతటి చైతన్య మూర్తిగానో, సాంఘిక దురాచారాలైన మతం, మూఢ విశ్వాసాలు, కన్యాశుల్కాలు, ఒకటేమిటి యావత్ హిందూ సంస్కృతిలోని బూజుపట్టిన మురికి సాంప్రదాయాలపై ఉదయించిన విప్లవ మత సంస్కృతీ భానునిగా సహస్ర కిరణాలతో దర్శన మిస్తున్నాడు.

తన సాహిత్యంలో ఎక్కడా ఏ విషయాన్ని గ్రుడ్డిగా వదిలి పారేయలేదు. నేటి సమాజంలో కన్పిస్తూన్న అతి చిన్న విషయం నైతం ఆనాటి వేమన దృష్టిపథం నుండి తప్పించుకోలేదు. సంఘం మీద. మానవ జీవనం విధానం మీద ఎంతటి అపూర్వమైన అవ గాహనాశక్తి ఆ మహామహునికి ఏర్పడిందో చెప్పడానికి మాటలు చాలవు. అతని వేదము మానవాళికి సర్వదా, సర్వత్రా అనుభ వైకము, అందుకే వాటిని 'వేమన వేద సూక్తులు' అంటున్నాము.

ఏమేమో చదివాము అంటూ శాలువాలు కప్పుకుని, యింటిలో కూర్చుని పండితులమంటూ మఠం వేసుకుని వాస్తవిక సంఘ జీవనానికి ఆకాశమంత దూరంలో మాట్లాడుతూ బ్రతికినంతకాలం గ్రుడ్డినమ్మకాలతోనే జీవించి కనీసం తనని తాను తెలుసుకోకుండానే పైకి చేరే విద్వాంసులనే వాళ్ళందరికి ఒక కనువిప్పు వేమన యోగి

తెలుగు భూమియందు ప్రప్రథమ అభ్యుదయ విప్లవమత ప్రభోధకుడు వేమననే చెప్పాలి.

మార్గం వేరైనా వేమన తర్వాత ఆంధ్ర దేశంలో కేవలం ఆధ్యాత్మిక ధోరణితో చైతన్యం, నూతన మత విప్లవం తీసుకు వచ్చినవాడు పోతులూరి వీరబ్రహ్మం.

ఈ వీరబ్రహ్మం మీద తనకి ముందు తరంవాడైన వేమన యోగి ప్రభావం అధికంగా వుందవి చెప్పవచ్చు

కేవలం వీరబ్రహ్మం జీవితాన్ని కల్పిత గాధామయం చేయకుండా యోచిస్తే చాలా బాగుంటుంది ఆధ్యాత్మిక శక్తి సంపన్నత, పరిపూర్ణ యోగసిద్ధి నొందినవాడు వీరబ్రహ్మం

వేమనయోగి తన సమకాలీన దృశ్యాల్ని యథాతథంగా, కొంత వ్యంగ్య సరళితో మానవాళికి బోధిస్తే, వీరబ్రహ్మం తనకు గల శక్తియుక్తులతో భవిష్యత్తుని, కాలజ్ఞాన తత్త్వాలుగా బోధించాడు.

ఆ బోధనలో అనేకచోట్ల వీరబ్రహ్మం కూడా మూఢత్వాలపై చైతన్య ఖడ్గాన్ని ఝుళిపించాడు.

వేమన మీద యిప్పటివరకు జరిగిన పరిశోధనల రీత్యా పూర్తి సమాచారము అందలేదనియే చెప్పవచ్చును. వేమనయోగిని గూర్చి యింకా గట్టి పరిశోధనలు జరుపవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఆ 'యోగి వేమన'కు నమస్సహస్రములు జేస్తూ.

శెలవ్

మీ

మద్రాసు
4-8-92

ఉదయశంకర్.

శ్రీ గణేశాయ నమః

# వేమన వేద సూక్తులు

## తత్త్వ సూక్తులు

1. శ్రీకరంబగు వేమన జెప్పినట్టి
పద్యముల నెవ్వడేనియు పరనసేయు
నట్టి పురుషుడు మనమున నిట్టిదనుచు
జెప్పరానట్టి వస్తువు జేరువేమా

శుభదాయకమైనట్టి వేమన చెప్పిన పద్యములను ఎవ్వడు చదువునో వాడు మనస్సున చెప్పనలవికాని జ్ఞానానందమును పొందును సుమీ!

2. వేమన జెప్పిన మాటలు
సామంబున సకల వేదసారంబు గదా
సామెత పంచాక్షరిలో
నీ మహిమల దెలియకున్న నింపావేమా

వేమన చెప్పినటువంటి వాక్యాలు సాధారణంగా సకల వేదములయొక్క సారమే కాని వేరుకాదు, పంచాక్షరీ మంత్రము లోని ఈ నిగూఢ మహిమా విశిష్ఠత తెలియకున్నచో ఫలము శూన్యము.

3. పంచ శత్రులదెగి పంచబాణుని గెల్చి
పంచ వర్గములను పరనజేసి
పంచ ముఖములు గల భవసంజ్ఞ గలవాని
పంచ జేరువాడు పరగ వేమ

మానవునిలో నిభిడీకృతమై వున్న పంచేంద్రియములనే పంచబాణుడు అనగా తామరపుష్పము, అశోకము, మామిడి, నవ మల్లిక, నల్లకలువ అనే ఐదు బాణములను ప్రయోగించి జీవిత కామోత్పాదన జనింపచేసేటటువంటి మన్మధుని, దగ్గఱకు రానీ కుండా, ధైర్యము, శాంతము, కరుణ, క్షమా, సత్యము అనే ఐదు ముఖములతో వుండే ఈ సంసారమును దోష రహితముగా కల్గి పరమేశునియొక్క బ్రహ్మానందమనెడి పంచన చేరేవాడు అత్యుత్తముడు.

4. రక్తి లేని పనులు రమ్యమై యుండునా?
రక్తి కలిగెనేని రాజుమెచ్చు
రాజుమెచ్చు రక్తి రమణులు మెత్తురు
విశ్వదాభిరామ వినురవేమ.

ఇష్టంలేని పనులు రమ్యంగా వుండవు. మనస్సుకి యింపైన పనులను రాజు మెచ్చును. రాజు మెచ్చినవాటిని స్త్రీలు కూడా మెచ్చుకుంటారు.

5. టీక వ్రాసినట్లనేకులు పెద్దలు
లోకమందు చెప్పి లేక మంచు
కాకులట్టి జనులు కానరీ మర్మంబు
విశ్వదాభిరామ వినురవేమ.

పెద్దలనేకమంది అందరూ సమానమని వివరించి చెప్పారు. కాని కాకుల్లాంటి జనులు ఈ రహస్యాన్ని గమనించరు. వర్గాలు, మతాలు తగిలించుటకు వర్తిస్తారు

6. తల్లిదండ్రి హితులు తగిన చుట్టములెల్ల
ఏరి కోరి బాలు నెరుపుజూచి
పడుచు నిత్తురింతె భాగ్యమియ్యగలర?-విశ్వ.

తల్లిదండ్రులు, స్నేహితులు, చుట్టాలు పెళ్ళి చూపుల్లో కుర్రాడి అందం, రంగు చూసి ఓహో బాగున్నాడు అంటూ పిల్ల నిస్తారు. తర్వాత ఆ దాంపత్యుల అన్యోన్య భాగ్యాన్ని యివ్వగలరా?

7. ఆలు రంభయైన సతి శీలవతియైన
జార పురుషుడేల జాడమాను
మాలవాడ కుక్క మరిగిన విడుచునా-విశ్వ.

పెళ్లాం రంభయైనా, పతివ్రతయైనప్పటికీ, వ్యభిచరించేవాడు వాడి పని మానడు. మాలవాడలో దుమ్ములు మరిగిన కుక్కలాగ.

8. కడుపునిండ తవుడు గంపలో బెట్టక
చన్ను ముట్టనీదు తన్ను బర్రె
వారకాంత విటుని వలచునా యూరక-విశ్వ.

కావలసినంత తవుడు గంపలో పెట్టి దాని ముందు పెడితే గాని పాలు పితకనివ్వదు గొడ్డె. అలానే ఏమీ యివ్వకుండా పూర కనే దగ్గఱకు రానిస్తుందా వేశ్య.

9. వలపు విరిగెనేని వనజాక్షి యధరంబు
ములక పంటిగిజరు ముష్టిరసము
చింతపండు లొడ్డు జీడి సమానమౌ-విశ్వ.

* వలపు పుట్టునపుడు వలచినవాడి పెదవి ఎంతో తియ్యగా అన్పిస్తుంది. అది తీరిన తర్వాత ఆ పెదవే వెగటుగా వుంటుంది ములకకాయ గింజలు చింతపండు లొడ్డు, జీడితో సమానము.

10 మైథునమున బుట్టు మానవులందరు
తిరుగుచుందు రందె తెరవులేక
ఎందుబుట్టు వారికందందె గతిగద-విశ్వ.

రతివాంఛ జీవులన్నిటియందు ప్రకృతి సహజము. ఏ జీవి యైన రతి సంభోగమువలనే జన్మిస్తుంది. యవ్వన వయస్సు రాగానే, స్త్రీ-పురుషులలో శారీరక వాంఛ సహజ సిద్ధంగా జనిస్తుంది ఈ వయస్సులో స్త్రీకి పురుషుడిమీద, పురుషుడికి స్త్రీ మీద దృష్టి ప్రసరిస్తుంది. అనగా స్త్రీని కలవాలని పురుషుడు, పురుషుణ్ణి చేరాలని స్త్రీ తపిస్తారు.

11. తల్లివలన బుట్టి తల్లిచన్ను గుడిచి
తల్లితోడ జాణ తనములాడి
తల్లినాలని యెదు తత్వమెందునో-విశ్వ.

స్త్రీ వలన పుట్టి, స్త్రీ పాలు త్రాగి, స్త్రీతో ఆడి, మరొక స్త్రీని పెండ్లాడి, కన్న స్త్రీని తల్లిని, పెండ్లాడినదాన్ని భార్యని, పేర్ల మార్పులోనే ఎంత తారతమ్య భావమునకు గురౌతున్నారో మానవులు.

---

* ములుకపంటి = ములుకపండు, గిజరు = గింజ, ముష్టి రసము = చేతిలో అనేక పర్యాయములు పిండగా వచ్చు రసము. లొడ్డు = పులుసు

12. పృథివి కుదకమేగె పృథివిపై మొలకెత్తి
మొలక పృథివికేగ మొగుడే సుతుడు
ధరణి జనులకెల్ల తల్లియె పెండ్లాము-విశ్వ.

ఆకాశంనుండి వర్షం కురియడంతో పంటపండి, ఆ పంట నుండి వచ్చిన విత్తనాలే నాటితే మళ్ళీ అంకురిస్తున్నాయి. ఇక్కడ భూమి క్షేత్రముగను, నారు వీర్య చిహ్నముగను కన్పిస్తాయి. భర్తే కొడుకుగా జన్మిస్తాడు, పురుషులకు తల్లే భార్య అంటూ పై పద్యములో సమన్వయిస్తున్నాడు.

13. ఇల్లునాలు విడిచి యినుప కచ్చలగట్టి
వంటకంబు నీరు వాంఛలుడిగి
యొంటినన్న యంతవొచ్చు నాతత్వంబు-విశ్వ.

* ఇల్లు - ఇల్లాలినీ వదిలి యినుపకచ్చలుగట్టి, నీళ్లు, తిండీ, కోరికలు వదిలి ఏకాకినని చెప్పుకున్నంత మాత్రాన తత్త్వం తెలియదు. సంసారిక అనుభవంతోనే సర్వమును తెలుస్తాయి.

14. తరువ తరువబుట్టు తరువున నవలంబు
తరువ తరువబుట్టు దధిని ఘృతము
తలప తలపబుట్టు తనువున తత్వంబు-విశ్వ.

చెట్టు కొమ్మ కొమ్మా తరచగా తరచగా నిప్పు పుడుతుంది. పెరుగు చిలకగా వెన్న (నెయ్యి) వస్తుంది. అలానే ఆలోచించగా ఆలోచించగా తనకే తత్త్వం తెలుస్తుంది.

---

* ఇనుప కచ్చలు = మేకచర్మ దోవతి.

15. గోచి విడుచువాని కోతి నట్లాడించి
వెఱ్ఱివానిజేసి వెడలదరుము
తనదు భార్యయొద్ద దాగోచి దియ్యడా-విశ్వ.

గోచీ కూడా తీసి తిరిగేవాణ్ణి వెఱ్ఱివాణ్ణిజేసి కోతి నాడించి నట్లు వెంటపడి తరుముతారు ప్రతి మగాడు పెళ్ళాం దగ్గఱ గోచీ తియ్యకుండా వుంటాడా'

16. కుండ కుంభమన్న కొండకుధరమన్న
నుప్పు లవణమన్న నొకటికాదె
భాషలెన్నియైన పరతత్వమొక్కటే-విశ్వ.

సంస్కృతమునందు కుండను కుంభమని, కొండను *కుధర మని, ఉప్పును లవణమని పిలుతురు. కాని భాష వేరైనా వస్తువు ఒక్కటే అల్లే భాషలు ఎన్నియున్నా పరమాత్మ మాత్రము ఒక్కటే.

17. చీమ కుట్టెనేని జీవు కనిపించును
చీమ యెంత దాని జీవమెంత
చీమవంటి గురుని సృష్టిలో యెరుగరా-విశ్వ

చీమెంత? దాని బ్రతుకెంత? అది కుట్టిందంటే ఎలాంటి వాడికన్నా చివుక్కుమంటుంది ఆ చీమనుండి కూడా నేర్వవలసి వుంది సుమీ'

18 పికము వనములోన చెల్లుగాపలికిన
భంగి ప్రాజ్ఞజనుల పలుకులుండు
కాకి కూతబోలె కర్మబద్ధుల కూత-విశ్వ.

* కుధరము = కొండ.

కోకిల తోటలో ఆనందంతో పొంగి పాడినట్టుంటాయి పండితుల మాటలు. కానీ, చాందస వైదిక కర్మబద్ధుల కూతలు కాకి కూతల్లాగుంటాయి

19. కాకి పక్షులందు కడుహీనమందురు
కాకి మంచి నెవరు గనరు భువిని
కాకికన్న మొసగి కాళ్ళకు మ్రొక్కరా-విశ్వ.

పక్షి జాతిలో కాకి అన్నిటికన్న నీచమైనది. ఐతే పితరులకు పిండ ప్రదానము చేసేటప్పుడు కాకే పవిత్రమైన పక్షిగా ఎంచబడు చున్నది. అటువంటి కాకికి అన్నముపెట్టి నమస్కరించమని చెప్తున్నాడు.

20. మిరెపుగింజ చూడు మీద నల్లగనుండు
కొరికి చూడ లోన చురుకు మనును
సజ్జనులగు వారి సారమిట్లుండురా-విశ్వ.

మిరియపు గింజ చూడ్డానికి నల్లగా వుంటుంది కొరికితే దాని కారం తెలుస్తుంది. అలానే సజ్జనులు పైకి ఎలా కన్పించినా వారి శక్తి యుక్తులు దాగివుంటాయి.

21. ఉప్పు కప్పురంబు నొక్కపోలికనుండు
చూడ చూడ రుచుల జాడవేరు
పురుషులందరొకటె పుణ్యాత్ములును వేరు-విశ్వ.

---

మిరపకాయలు లేని కాలమునందు భారతదేశమంతటా మిరియాలు కారముగా ఉపయోగించేవారట.

ఉప్పు కర్పూరం తెల్లగా ఒకేలా వుంటాయి. వాటిని రుచి చూస్తే తెలుస్తాయి ఏదేమిటో, అలానే పురుషులంతా ఒకేలా ఉన్నా పుణ్యాత్ములు వేరు. పాపాత్ములు వేరును.

22. ఔనటంచు నొక్కడాడిన మాటకు
కాదటంచు బలుక క్షణము పట్టు
దాని నిలువ దీయు తాతలు దిగవచ్చు-విశ్వ.

ఒకరు ఔనన్న మాటను కాదని క్షణములో చెప్పొచ్చు. కానీ, ఔనన్న విషయాన్ని వాధించి ఖండించడానికి చాలా సమర్థత వుండాలి తాతలు దిగొస్తారు అంటూ హెచ్చరించాడు.

23. పదుగురాడు మాట పాటియై ధరజెల్లు
ఒక్కడాడు మాట యెక్కదెందు
ఊరకాడువాని నూరెల్ల వోపదు-విశ్వ.

పదిమంది ఆదేమాటే లోకంలో చెలామణీ అవుతుంది. ఒక్కడన్నమాట చెల్లదు. అది మంచిదైనా చెడ్డదైనా సరే, కారణం లేకుండా ఊరికే వాదించే వాళ్ళని లోకం ఒప్పుకోదు.

24. ఋషులుగాని పింత్రు హీనుల యట్టుల
వారిబోధ పెద్ద మేరువంత
లోన నున్న యట్టి జ్ఞానంబు మహిమరా-విశ్వ.

ఋషులు పైకి చూడ్డానికి హీనుల్లా కన్పిస్తారు. గాని, వారి బోధలు మేరుపర్వతమంత గొప్పవై వుంటాయి, కారణం వారిలో దాగియున్న జ్ఞాన సముద్రము.

25. రింగణాలు బలిసి సింగికి నెగిరిన
జెట్టు చివరిపండు చేతబడునే
పుస్తకము సదువ బొందునా మోక్షంబు-విశ్వ.

పొట్టివాళ్లు లావెక్కి పైపైన ఎంత ఎగురుతున్నా చివరినున్న చెట్టు పండు చేతికందదు. అలాగే పుస్తకాలు చదివినంత మాత్రాన అనుభవం లేనిదో మోక్షం లభించదు

26. ఎలుగుతోలు దెచ్చి యేడాది యుదికినా
నలుపు నలుపె కాని తెలుపుకాదు
కొయ్య బొమ్మదెచ్చి కొట్టితే గుణియౌనె-విశ్వ.

ఎలుగు నల్లగా వుంటుంది దాని తోలు తెచ్చి ఓ సంవత్సర కాలం వుదికినా, దాని నలుపు నలుపేగాని తెలుపవ్వదు. అలానే చెక్కబొమ్మను దండించి బోధిస్తే సుగుణాలు అబ్బుతాయా.

27. వేము పాలుబోసి వెయ్యేండ్లు పెంచినా
చేదు విడిచి తీపి జెందబోదు
ఓగు గుణము వీడి యుచితజ్ఞుడగునెట్లు-విశ్వ.

వేపచెట్టుకి పాలుపోసి పెంచినప్పటికీ దాని కాయలు తియ్యగా వుండవు. అలానే దుష్టునికి ఎంతటి జ్ఞానబోధ చేసినా శూన్యమే.

28. సేతుమందు మునుగుక్షితి కాకి తెలుపౌనె
కాశికేగ గ్రద్ద గరుడుడగునె
ఒదరి కరుగ వృద్ధుబాలుండు గాడయా-విశ్వ.

సేతువునందు స్నానం చేసినంత మాత్రాన కాకి తెలుపవ్వదు. కాశికేగినంత మాత్రాన వృద్ధుడు బాలుడు కాజాలడు

---

రింగణాలు = పొట్టివారు

29. తిరుపతికి బోవ తురక దాసరికాడు
కాశి కరిగి లంజ ఘనత గనదు
కుక్క సింహమగునె గోదావరికి బోవ-విశ్వ.

ఒకమతంవారు వేరొక మత పుణ్య ప్రదేశానికి వెళ్ళినంత మాత్రాన మతం మార్చుకోరు కాశికెళ్ళినంత మాత్రాన వ్యభిచారి, సంసారి కాదు. గోదావరిలో స్నానంచేసినంత మాత్రమున కుక్క సింహము గాదు

30. * మక్కకు జననేల మడుగుతారా నేల
ఏకమైన చిత్త మెందులేదు
అన్నిట పరిపూర్ణుడల్లా మహమ్మదు-విశ్వ.

మక్కా వెళ్ళడం ఎందుకు? తిరిగి మళ్ళి రావడమెందుకు? ఏకమైన మనస్సు ఎక్కడైనా లభిస్తాయి అన్నిటియందు అల్లా మహ్మద్ సంపూర్ణంగా వుంటాడు.

31. అన్ని దానములందు అన్నదానమె గొప్ప
కన్న తల్లికంటె ఘనతలేదు
ఎన్న గురువుకంటె ఎక్కువ లేదయా-విశ్వ.

దానాలన్నిట్లో అన్నదానం గొప్పది అలానే కన్నతల్లికంటె గొప్పది లేదు. గురువుకన్న మించినది లేదు.

---

* క్షేత్రానికి వెళ్ళినంతమాత్రాన జన్మరాహిత్యం పొందుట కల్ల, స్థిర మనస్కులకు దైవమంతటా వుంటాడు అని భావము.

32. కల్లు కిచ్చినట్లు చల్ల కివ్వగలేదు
కొల్ల కిచ్చునట్లు కుడువలేదు.
బుల్ల కిచ్చునట్లు పుణ్యానికీయదు-విశ్వ.

* జనులు మంచికార్యాలకన్నా వ్యసనాలకు, వ్యభిచారాలకు ఖర్చు చేసినట్లు పుణ్యకార్యాలకు చేయరు లోటివాళ్ళకు కల్లు పోస్తారు గాని, బీదవాళ్ళకి చల్లపోయరు,

33. అనగననగ రాగ మతి రమ్యమైయుండు
తినగ తినగ వేము తియ్యనగును
సాధనమున పనులు సమకూరు ధరలోన-విశ్వ.

పాడగా పాడగా రాగం అత్యంత వినసొంపుగా వుంటుంది. తినగా తినగా వేపాకు కూడా తియ్యగా వుంటుంది. అలానే కష్టపడి సాధిస్తే ఎలాంటి కార్యాలైనా సాధించవచ్చు.

34. తప్పు లెన్నువారు తండోపతండమ్ము
లుర్విజనుల కెల్లనుండు తప్పు
తప్పులెన్ను వారు తమతప్పు లెరుగరు-విశ్వ.

ఎదుటివారి తప్పు లెంచేవారు తమ తప్పు లెంచరు. ప్రతివాళ్ళూ ఏవోతప్పులు చేస్తుంటారు. తమ తప్పులు తెలుసుకునేవాళ్లు ఎదుటివాళ్ళ తప్పులు అంతగా ఎంచరు తమ తప్పులు తెలుసుకోలేనివారే ఎదుటివారి తప్పులను ఎక్కువగా ఎంచుతుంటారు

---

* కొల్లకిచ్చు = చెడ్డ పనులకిచ్చునట్లు; బుల్లకిచ్చునట్లు = శారీరక సుఖాలకిచ్చునట్లు.

35. తానె తత్త్వమనుచు తన్నెరుంగగలేక
మాయ తత్త్వమనుచు మరుగుచుండు
ధర్మ కర్మములను దగరోమ తత్త్వమౌ-విశ్వ.

తానే తత్త్వము అన్న సంగతి గ్రహించక, మాయని భ్రమించి తత్త్వమనుకుందురు. కర్మ, ధర్మములను సాధించి శోధించుచే తత్వము

36. చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలిముల్లు
ఇంటిలోని పోరు ఇంతింత కాదయా-విశ్వ.

చెప్పులో వున్న రాయి, చేతిలోకి దూరినటువంటి జోరీగ, కంటిలోపడ్డ నలుసు, కాలిలో గ్రుచ్చుకున్న ముల్లు, ఇంటిలో భార్యాపిల్లలువల్ల కలిగే బాధ చెప్ప శక్యము గానిది.

37. ఆలిమాటలు విని అన్నదమ్ముల రోసి
వేరె పోవువాడు వెర్రివాడు
కుక్క తోకబట్టి గోదావరీదినా-విశ్వ.

పెళ్లాల చెప్పడు మాటలు విని తోబుట్టువులను వదలి వేరే వెళ్ళువాడు వెర్రివాడు సుమీ, అది కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టిది. అనగా సమిష్ఠి కుటుంబమే ఆనందమయమంటున్నాడు.

38. అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన
దొడ్డవారినెల్ల దొలగగొట్టు
చెప్పుదినెడు కుక్క చెఱకు తీపెరుగునా-విశ్వ.

అల్పుడికి అధికారం యిస్తే తన మాటకి తందాన పలికే వాళ్ళనుంచి గొప్పవాళ్ళని దూరం చేస్తాడు, చెప్పుతినే కుక్కకి చెరకు తీపి ఏమి తెలియును?

39. ఎంత చదువు చదివి ఏనీతి విన్నను
హీనుడవ గుణంబు మానలేడు
బొగ్గుఁపాలఁ గడుదఁ బోవునా మలినంబు-విశ్వ.

ఎంతో చదువు చదివినప్పటికి ఎన్నో నీతులు విన్నప్పటికీ హీనుడైనవాడు దుర్గుణాలను విడువడు. అలానే పాలతో బొగ్గును కడినంత మాత్రాన దాని నలుపు పోవునా

40. దర్శనంబులందు ధరషణ్మతములందు
వర్ణాశ్రమముల వదలకెపుడు
తిరుగుచుండువాఁడు ధరలోన నంధుండు-విశ్వ.

ఆరు మతములందును, దర్శనములందును కూడా కులాలు, మతాలు అంటూ తిరిగేవాడు గ్రుడ్డివాడు సుమీ!

41. పాలరాళ్ళదెచ్చి పరఁగంగ గుడిగట్టి
చెలఁగి శిలలపూజ చేయుచుంద్రు
శిలల సేవఁజేయు జిక్కునదేమిటి-విశ్వ.

పాలరాళ్ళతో గుళ్ళుకట్టి ఆ రాళ్ళకు పూజ చేస్తారు, దానివల్ల ఒరిగేదేమిటో! విగ్రహారాధన ఖండిస్తున్నాడు.

---

భారతీయ దర్శనములు 2 విధములు. 1. ఆస్తిక దర్శనములు, 2. నాస్తిక దర్శనములు.

42. యోనియందె పుట్టి యోనికి రుచిజేసి
చన్నుగుడిచి పెరిగి చన్నుఁ బట్టి
సృష్టిలోనతగు సిగ్గెరుంగనిజీవి-విశ్వ.

యోనినుండి పుదతారు, తిరిగి ఆయోనితో రతిక్రియ చేస్తారు. బాల్యంలో చనుబాలు త్రాగి పెరుగుతారు. తిరిగి యవ్వనంలో మళ్ళీ ఆ చన్నునే మర్దిస్తారు సృష్టిలో దాగియున్న సిగ్గెరుగడు జీవి.

43. వెనుకఁ జూతమన్న పెనమ కష్టపు గుంట
ముందుఁ జూతమన్న ముఱికి గుంట
వెలఁది జూచి యేల వేడుక పడుదురు-విశ్వ.

వెనుకచూస్తే గుదము, (మల స్థానము) ముందు చూస్తే మూత్ర స్థానము, వెనకాముందు మలమూత్ర స్థానములే, రెండూ దుర్గంధమయము అటువంటి స్త్రీని చూసి ఎందుకో సంబరపడతారు.

44. వ్యాధి నెఱుఁగలేని నేద్యము దేలరా
కొదవఁ దెలియలేని కోర్కెలేల
మనసు తెలియలేని మర్మజ్ఞు లేటికి-విశ్వ.

ఇన్నియూ నిరుపయోగయే.

45. శూద్రతనము హోయె శూద్రుడు గావని
ద్విజుఁడనుకొనుటెల్ల తెలివి లేమి
ఇత్తడెపంగు పసిఁడి యీడనవచ్చునా?-విశ్వ.

ఇత్తడెలా బంగారము గాదో అలానే, అజ్ఞానముచేత శూద్రుడు శూద్రుడే, జ్ఞానముచేత బ్రాహ్మడు బ్రాహ్మడే

* బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణః అన్న సత్యాన్ని స్పష్టం చేశాడు.

46. శూద్రయువతి కొడుకు శుద్ధాంతరంగుఁడై
వేద వేద్యుఁడైన పాదు తెలిసి
బ్రహ్మపదవిగన్నఁ బ్రాహ్మణుఁడే కదా-విశ్వ.

జన్మంచేత ఎవ్వడూ శూద్రుడు కాడు, జ్ఞానంచేత మాత్రమే శూద్ర, బ్రాహ్మణత్వములు కల్గును

47. సాధనంబు లేక సమకూడ దేదియు
బోధనలేని విద్య పొందదెపుడు
పాదుకొల్పి మదిని భావించి చూడరా-విశ్వ.

కృషితో నాస్తి దుర్భిక్షం, "జపతో నాస్తి పాతకః" అని ప్రమాణం. ఏ కార్యమైన గట్టి కృషిలో సాధ్యపడును.

48. సుతులు సతులు మాయ సుఖదుఃఖములు మాయ
సంస్మృతియను మాయ జాలిమాయ
మాయబ్రతుకునకనె మాయ గల్పించెరా-విశ్వ.

సంసారమనే లంపటం అంతా మాయే సుమీ. ఏదీ శాశ్వతంగాదు.

49. చిక్కియున్న వేళ సింహంబునైనను
ఒక్క కుక్కయైన బాధసేయు
బలిమి లేనివేళ పంతముల్ చెల్లవు-విశ్వ.

అనుకూలమైన కాలము, తగిన బలము లేనప్పుడు మౌనమే ఉత్తమం.

50. నిజము లాడువాని నిందించు జగమెల్ల
నిజముఁ బల్కరాదు నీచుల కడ
నిజ మహాత్ముఁ గూడి నిజమాడ వలయురా-విశ్వ.

నిజా నిజాలు పలకడానికి కూడా ఎదుటివార్ని గమనించి మాట్లాడాలి

51. కల్ల నిజము రెండు కరకంఠుఁ డెరుగును
నీరు పల్లమెరుగును నిజముగాను
తనయుని జన్మంబు తల్లి తా నెరుగును-విశ్వ.

సత్యాసత్యాలు భగవంతుడెరుగు, అలానే నీరెప్పుడు పల్లానికే చేరుతుంది బిడ్డ జన్మ రహస్యం కన్నది గనుక ఆ తల్లికే తెలుస్తుంది.

52. చదివినవానికన్న చాకలి తా మేలు
కులము వేల్పుకన్న కుక్క మేలు
సకల సురలుకన్న సర్వేశ్వరుడు మేలు-విశ్వ.

"చదువుకున్నోడికన్న చాకలోడు" మేలన్న సామెతుంది. ఇంట కులదేవత కాపాడుతుందో లేదోగాని యింట కుక్కమాత్రం యింటిని రక్షిస్తుంది. ఎందరో దేవతలకు మ్రొక్కేకన్న ఒక సర్వేశ్వరుడికి మ్రొక్కితే మేలు

53. పందిపిల్లతాను పదునైదు నొకటిని
కుంజరంబదీను కొదమ నొకటి
నుత్తమ పురుషుఁడటు నొక్కఁడు చాలడా-విశ్వ.

అల్పులు నూర్గురుకన్న వివేకి ఒక్కడు చాలు

54. తనువులోన నున్నతత్త్వంబు దెలియక
వేరే యాత్రబోవు వెట్టివాడు
గంత మోసిమోసి గాడిద తిరుగదో-విశ్వ.

తనలో ఆత్మను గ్రహిస్తే చాలు నానా యాత్రలు ఒగర్చుకుంటూ గాడిదలా తిరిగేకన్న.

55. ఆత్మశుద్ధిలేని ఆచార మదియేల
భాండ శుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజయేలరా-విశ్వ.

ఏ పనైనా మనసా, వాచా, కర్మణా చేస్తేనే దాని ఫలం లభిస్తుదిం.

56. విత్తమొకనికిచ్చి వితరణగుణమును
చిత్తమొకరికిచ్చి చేర్చినాడు
బ్రహ్మచేతలెల్ల పాడైన చేతలు-విశ్వ.

ఐశ్వర్యం ఒకళ్ళకి ధానగుణం మరొకరికి యిస్తే ఉపయోగం ఏమిటి, ధనికుడు లోభి గావచ్చు, ధానశీలి బీద గావచ్చు.

దీనినే పూర్వకాల గ్రంధాల్లో ఇలా చెప్పబడింది.

శ్లో॥ దాతాదరిద్ర కృపణో ధనాఢ్యః
పాపీ చిరాయుః సుకృతిగతాయుః
రాజాకులీనః సుకులీ చ భృత్యః
కలౌయుగే షడ్గుణ మాశ్రయంతి

57. కుక్కతోకదెచ్చి గొట్టంబు జేర్చిన
క్రోవిచెంతనుండు కొంతతడవు.
యెంతఁజెప్పు జెడుగు పంతంబు మానునా-విశ్వ.

కుక్కతోకకి గొట్టముచేర్చి నిలువచేస్తే కొంత సేపుంటుంది. మళ్ళీ వంకరే. అలానే చెప్పినంత కాలమేగాని దుష్టుడు పంతం మానడు.

# ఉత్తమ గుణములు

58. బహుళ కావ్యములను పరికింపగా వచ్చు
బహుళ శబ్దచయము పలుకవచ్చు
సహన మొక్కటబ్బ చాల కష్టంబురా-విశ్వ.

ఎంతో చదువు చదవవచ్చునుగాని, సహనగుణము అలవడడ మంటే చాలా కష్టం.

59. పరనారీ సోదరుడై
పరధనముల కాసపడక పరహితచారై
పరులలిగిన తానలుగక
పరులెన్నగ బ్రతుకువాడు ప్రాజ్ఞుడు వేమా

పరస్త్రీకి సోదరునిగా వర్తిస్తూ, యితరుల ధనానికి ఆశపడక స్నేహ ధర్మంతో, ఒకవేళ యితరులు తనపై కోపించిననూ తాను కోపించక అన్యులను ప్రశంసిస్తూ శాంత గుణంతో జీవించేవాడు ఉత్తముడు దీనినే నీతి శతకంలో

60. శ్లో. మాతృవత్పర దారాంశ్చ
పరద్రవ్యాణి లోష్టవత్
ఆత్మవత్సర్వ భూతాని
యఃపశ్యతి సపశ్యతి॥

అనగా ఎవడు పరస్త్రీని తల్లిగాను, పరధనమును మన్ను వలెను అందరినీ తనవలెను చూస్తాడో వాడే సమస్త ధర్మజ్ఞాన మును కల్గినవాడు.

61. ఏకబ్రహ్మంబు నిత్యము
వైకల్పితమైన యట్టి వస్తువులెల్లన్
ఏకత్వంబని యెఱిగిన
శోకంబు లేనట్టి ముక్తి సులభం వేమా॥

బ్రహ్మస్వరూపమనేది ఒకటే అను వాక్యము నిత్యము, సత్యము, శాశ్వతము, ప్రకృతిలోని సమస్తము కేవల కల్పితములు అన్నియు ఒకటే సుమీ అని గ్రహించినవానికి ముక్తి సులభంగా లభిస్తుంది దీనినే ఈ విధంగా చెప్తాడు

62. శ్లో సుహృన్మిత్రా ద్యుదామధ్యస్త
ద్వేష్య నసీన బంధుషు
సాధుష్వపిచ పాపేషు
సమ బుద్ధిర్వి శిష్యతే॥

అనగా మిత్రునియందును, ఉపకారియందును అపకారి యందును పక్షపాత వైఖరి లేనివాడై, బంధువులయందును. సత్పురుషులందును పాపాత్ములందును సమానముగా వర్తించువాడే యోగులలో ఉత్తముడు

## మూఢత్వము

63. ఎరుగకుంట లెస్స యెరుగుట కడులెస్స
యెరిగి యెరుగకుంట యేటిలెస్స
కచ్చికచ్చి యెరుక కలుగుట రోతరా-విశ్వ.

ఏ విషయం గూర్చియైనా తెలియకపోతే పరవాలేదు. ఇంకొకర్ని అడిగి తెలుసుకోవచ్చు. ఒకవేళ పూర్తిగా తెలిస్తె

చాలామంచిది. అంతేగాని సగం తెలిసి, సగం తెలియక పోవడం వలన ప్రయోజనం లేదు. అలా తెలియడం కొన్ని అనర్థాలకు దరి తీస్తుంది కూడాను

64. ఎరుకలేని వారలేమేమి చదివినా
చదివినంత సేపె సద్గుణంబు
కురిసి తామరందు కప్ప కూర్చుండదా-విశ్వ.

అర్థం గాకుండా ఎన్ని గ్రంథాలు చదివితేమాత్రం దాని ప్రయోజనం తెలుస్తుందా. చదివినంతసేపే చదివినట్టు భావించాలి. తామరపుష్పం మీదకెక్కి కప్ప కూర్చుంటుంది కాని దాని విలువ తెలిస్తే కదా దానికి, అటువంటిదే అర్థంలేని చదువు అందుకే ''అర్థంలేని చదువు వ్యర్థం'' అంటారు.

65. కట్ట మొకటి పూని గడగడ చదివిన
లోని యర్థమెట్లు తానెరుంగ
యెరుకమాలు చదువేటికో తెల్పరా-విశ్వ.

దొరికింది కదా కావ్యమంటూ పైకి పెద్ద కంఠంతో గడగడా చదివితే లాభమేమిటి, దానిలోని భావము, రసము తెలిస్తేకదా ఆనందము, ప్రయోజనమును.

66. * ఆదిమ కవులవలె నల్పుండు తానెగ్గి
చెప్పలేడుగాని తప్పుబట్టు
ద్రొబ్బ నేర్చుకుక్క దొంతులు బేర్చునా-విశ్వ.

పూర్వ కవులంతా విషయం తెలిసినా ఎదుటివార్కి రహస్యాన్ని విప్పి చెప్పరు. అలానే అల్పుడు కూడా ఆడంబరంగా

---

* తప్పులు కొట్టేవాళ్ళను కుక్కతో పోల్చాడు.

మాట్లాడతాడే తప్ప అసలు విషయం చెప్పలేడు గాని ఎదుటివాడి తప్పులు ఎక్కడున్నాయో చటుక్కున చెప్పడానికి పూనుకుంటాడు. దొంగిలించి తినే కుక్కకి రక్షించడం తెలియదు.

67. వెర్రి నక్కలవలె వేదముల్ చదివేరు
ఆశయంబు లెరుగరయ్య వార్లు
వేదసారమంత వేమన యెరుగును-విశ్వ.

ప్రతి పనికి ఏదో ఒక కారణము, ఫలము వుంటుంది, అది లేకుండా చేసేపని ''గొడ్డుటావుని మేపడం'' లాంటిది ఏదో వేద ములో వుందని గ్రుడ్డిగా నమ్మడం అది గురుముఖతా కంఠస్థం చేస్తూ బడాయి పలకడం వెర్రినక్కల కూతల వంటివి. దాని పరమార్థం తెలియదు చాలామంది పండితులమనే వారికి.

68. వేదములను చదివి వెరవేమి గాంచిరి
యరిగి తిరిగి వత్తు రందరిండ్ల
బ్రహ్మమహిమ తెలిసి బ్రదుకుట నిజమయా-విశ్వ.

వేదాలు చదివామంటూ చెప్తుంటారు గానివారు వానివలన. ఎటువంటి ప్రయోజనం పొందిరో ఆత్మ విమర్శ చేసుకోవాలి. కేవలం వేదం చదివితిమని ఆ యవారానికి వేదపనసలు వల్లిస్తూ యిండ్ల చుట్టూ తిరగడం, ఆ భిక్షతో బ్రతకడం కాదు. పరబ్రహ్మ స్వరూపాన్ని తెలిసికొని బ్రతకడం వలన వేద పరమార్థం లభిస్తుంది సుమీ'

69. పట్టరాని పట్టు పట్టి యుండెడివాడు
పుడమిలోన కీర్తి పొందలేడు
సుగుణ లక్షణమున సుజ్ఞానియౌనయా-విశ్వ.

చేతగాని కార్యాలు. నిష్ప్రయోజన పనులందు గొప్ప కృషి చేయడం వలన ఎటువంటి ఫలము కీర్తి ప్రతిష్ఠలు కలుగవు. అన్నిటికన్న మంచి గుణములతో, జ్ఞాన యుక్తంగా ధర్మార్థ, కామ, మోక్షాలను గుర్తిస్తే వాడు గొప్ప జ్ఞాన యోగి అవుతాడు.

70. బ్రతుకు తెరువులేని బడుగు లందరు పెద్ద
యోగి వరుల మంచు సాగిరాగ
ఒంచవాండ్రు ముందు దండంబు విడుదురు-విశ్వ.

శిరస్సునుండి అరికాళ్ళ వరకూ జడలు పెంచుకుని చేతిలో పొడుగాటి దండము, కాషాయి గుడ్డ, మెడలో ఏవో నిమ్మకాయల దండలు, నుదుట బూడిద వ్రాసుకుని, కష్టించి బ్రతుకలేక ఈ వేషాలతో తిరిగే దొంగ సన్యాసులకు వారిలాంటి సోమరిపోతులే దండాలు, హారతులు, స్వాగతాలు పలుకుతారు

71. కాళ్ళు చేతులుండ కర్మలు చేయక
యోగిననుచు సాకదొకటి పన్ని
మౌనియైన అనరె మాయలమారని-విశ్వ.

భగవంతుడిచ్చిన కాళ్ళూ, చేతులూ వుండగా తోచిన కష్టం చేసి జీవించక సన్యాసినంటూ సాకు చెపుతూ మునిగా జీవిద్దామంటే, ఏదో ఒకరోజు ప్రజలు వాణ్ని మాయ ముండాకొడుకు అని తన్ని తరుముతారు.

72. కావిపంచగట్టి ఘనయోగి వలెనుండి
వెలికి గోర్కెలెల్ల విడిచిపెట్టి
తొడరి తిరుగువాడు దొంగసన్యాసయా-విశ్వ.

కాషాయ పంచెలు కట్టుకుని గొప్ప యోగినంటూ చీకటి పడ్డంతో మధువు, మగువ వెదికే వాళ్ళు దొంగ సన్యాసులు. చాలా చూసిగాని సన్యాసని నిర్ధారించగూడదు సుమీ'

73. పుస్తకములు జడలు పులితోలు బత్తంబు
కక్ష పాలలు పదిలక్షలైన
మోతచేటెగాని మోక్షంబు లేదయా-విశ్వ.

తైల సంస్కారం లేని జడలు, పులిచర్మం, వగైరా సన్యాసి సామగ్రి మోత దండగే గాని మోక్షమార్గం కాదు, రాదు.

74. * గుహలలోన జొచ్చి గురువుల వెదుకంగ
క్రూరమృగ మొకండు తారసిలిన
ముక్తిదారియదియె ముందుగా జూపురా-విశ్వ.

ఎక్కడో గురువు లుంటారు వారే మోక్ష దాతలు అని వెదకే బదులు నిర్మల మనస్సుతో యోచించి దర్శిస్తే ముక్తి మార్గం తనవద్దే వుంటుంది ఒకప్పుడు అటువంటి గృహాల్లో ఏ క్రూర మృగమో చూసిందంటే భక్షించి మోక్షాన్ని చూపిస్తుంది అని గేలి చేస్తున్నాడు

75. చేటు వచ్చెనేని చెడనాడు దైవంబు
మేలు వచ్చెనేని మెచ్చుదన్ను
చేటు మేలుదలుప చేసిన కర్మముల్-విశ్వ.

కీడు కల్గితే విధిని దూషించడం, ఏదైనా మేలు ఒరిగిందంటే అదంతా తమ ప్రభావమే అనుకుంటారు మంచి, చెడుల గూర్చి కర్మలను చేయ ఆలోచించరు

---

* సంసారియైగాని సన్యాసి గారాదని గ్రుచ్చి చెపుతున్నాడు

76. తీర్థయాత్ర కనుదు తిరుగబోయిన వాడు
పామరుండు కాక భక్తుడగునె
తీర్థయాత్రచేత దివ్యుండు కాడయా-విశ్వ.

"మాతృదేవోభవ" 'పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' అని వేదోక్తి. తల్లి, తండ్రి, గురువుని మించినదైవం లోకంలో వేరేలేదు. అది గమనించక కాశీ, గయ, కేదారం అంటూ ఏడాదికోమారు సరంజామా సర్దుకుని ప్రయాసతో కాళ్ళరిగేలా తిరుగుతూంటారు.

77. సకల యజ్ఞములకు సకల తీర్థములకు
తలలు గొరుగుకున్న ఫలములేదు
మంత్ర జలముకన్న మంగలి జలమెచ్చు-విశ్వ.

తిరుపతి వెంకన్నకి తలనీలాలు మ్రొక్కుకోవడం ఆంధ్ర రాష్ట్రములోనే గాకుండా ఇతర దేశాల జనాలు కూడా మ్రొక్కుకుని గొరిగించుకుంటున్నారు ఇప్పుడు. దానివల్ల ఫలితమేమిటన్నది ఎక్కడా కన్పించదు వెంకన్న కూడా వెంట్రుకలు కావాలని అడిగినట్టు దాఖలాలు ఎచ్చటా లేవు, నమ్మడామన్నా, అందుచేతనే. మంత్రజలం కన్న మంగలి చిప్పలో నున్న జలమే హెచ్చంటున్నాడు.

78. నీళ్ళ మునగనేల నిధుల మెట్టగనేల
మొనసి వేల్పులకును మ్రొక్కనేల
కపట కల్మషములు కడుపులో నుండగా-విశ్వ.

పుణ్య తీర్థాల్లో మునిగినా, దేవతలకు మ్రొక్కినా, హృదయ నిర్మాల్యం లేకపోతే అన్నీ వ్యర్థమే.

79. కాశి నీళ్లమోసి కాళ్ళు మొగము వాచి
యెందు సుఖములేక యెండి యెండి
చచ్చి వెనుక ముక్తి సాధింపగలరొకో-విశ్వ.

కాశీనుండి గంగని మోసుకు వస్తూంటారు. దార్లో దాహంతో నాలుక పిడచకట్టుకుపోయి ప్రాణం పోయే ప్రమాదం వచ్చినా ఆ నీళ్ళు మట్టుకు త్రాగరు. చచ్చిన తర్వాత ఏదో ముక్తి వస్తుందనే భ్రమ సుమీ!

80. * కాశికిబోవు వాని కర్మమేమన చెప్ప
చావహేతు వుండి చచ్చెనేని
మనసు కాశిజేరు మరిముక్తి లేదురా-విశ్వ.

కాశిలో ప్రాణం విడిస్తే కైలాసం చేరవచ్చుననే ఓ ప్రగాఢ నమ్మకం వుంది హిందువులలో. కాశికి వెళ్ళేలోపునే చచ్చాడంటే మనసు మాత్రం కాశి చేరుతుంది. ముక్తి మాత్రం దూరానే వుంది.

81. కాశికాశి యంచు కడు వేడ్కతో బోదు
రందు గలుగు దేవుడిందు లేడె
ఇందు నందు గలడు హృదయంబు లెస్సైన-విశ్వ.

కాశీ మీద ఎంతో మమకారం హిందువులకి. కేవలం అక్కడున్న ఈశుడు తమవద్దే వున్నాడన్న సత్యాన్ని గ్రహించలేక.

82. ఏరుదాటి మెట్టకేగిన పురుషుండు
పుట్టి సరకు గొనక పోయినట్టు
యోగ పురుషుడేల యొడలు పాటించురా-విశ్వ.

---

* "కాశ్యాన్తు మరణాన్ముక్తి" కాశీలో మరణించినవాడు ముక్తి పొందునని అనాది సూక్తి

నదిని దాటిన తర్వాత మానవుడు దాటించిన పడవను ఏ విధంగా పట్టించుకోడో ఆ విధంగానే మోక్షమే పరమా విధిగా భావించేవారు తమ శరీరాన్ని లక్ష్యపెట్టరు దీనినే
దానినే ఉత్తర గీతలో—

83. శ్లో. నానార్థీతు భవేత్తావద్యాం
వత్సరం వగచ్ఛతి।
ఉత్తీర్ణేచ సరిత్పారేనౌక
యాకిం ప్రయోజనం॥

ఏటియొక్క అవతల ఒడ్డును చేరేవరకునే పడవ అవసరం. ఆ తర్వాత దాని ప్రయోజనం లేదు అనగా మోక్ష సాధనకి మాత్రమే శరీరం సుమీ, ఇది యోగికే తెలుస్తుంది.

84. ఆలిరంకు తెలుప నవిల యజ్ఞంబులు
తల్లిరంకు తెలుప తద్దినాలు
కాని తెరువు కర్మకాండ కల్పితమాయె-విశ్వ.

యజ్ఞం పేరుమీద జరిగే కొన్ని నికృష్ట క్రియలు, ఇటువంటి కర్మకాండలు కేవలము వాంఛాపూరితములు, అనాగరికములు మాత్రమే

85. * కూడబెట్టుకున్న కుక్షిలో జఠరాగ్ని
భక్షణంబు చేయు కుక్షిమలము
కూడు విడిచి మలము కుడుచురాయుపవాసి-విశ్వ.

సకాలానికి క్షుద్బాధ తీర్చకపోతే జఠరాగ్ని ఉదరమందున్న మల పదార్థాన్నే స్వీకరిస్తుంది అంటే చాలామంది వ్రతాలు,

* ఆత్మ శుచిత్వమే తప్ప ఉపవాసములు అక్కర్లేదంటున్నాడు

నోములు అంటూ ఉపవాసాలు చేస్తూంటారు భోజనాలు మానేసి దానివలన ప్రయోజనమేమిటంటే యిదే సుమీ' అంటున్నాతు

86. ఒకని జెఱుతు మంచు నల్లమందెంతురు
తమకుఁగల్గు చేటుఁ దామెఱుంగక
తమ్ముఁ జెఱుగావాఁడు దైవంబుగాఁడొకో-విశ్వ.

సమాజంలో ఒకరికి అన్యాయం చేయడానికి సంకల్పిస్తారు. కానీ తర్వాత దాన్ని మించిని అన్యాయానికి తాము గురౌతామన్న సంగతెరుగక.

87. పాల పక్షి శకున ఫలమిచ్చునందురు
పాలపక్షికేమి ఫలము తెలియు
తనదు మేలు కీళ్ళు తనతోడ నుండఁగ-విశ్వ.

శకునాలు చూసుకుని పనులు చేస్తారు చాలమంది అందులో పక్షి శకునాలు, బల్లి శకునాలు, కాకి, యింకా చాలా రకాలున్నాయి, శిఖి నరసింహశతకమనేది శకునాలమీద ఒక పెద్ద శాస్త్రమే పక్షి శకునాల్లో పాలపక్షి శకునం చాలా మంచిదని నమ్మకం. తను చేసే కర్మలకి తనుగాని కర్త పాలపక్షి కాదుగదా, తనకు తెలియని విషయం పక్షికి తెలుస్తూందనుకోవడం శుద్ధ అవివేకమే

88. పిండములను జేసి పితరుల దలపోసి
కాకులకును బెట్టు గాడ్దెలార
పియ్యి దినెడికాకి పితురుడెలాయెనో-విశ్వ.

పైతృక కర్మలు చేసేటప్పుడు పింద ముద్దల్ని కాకులకి పెట్టడం ఆచారం మలాన్ని తినే నీచమైన కాకి పితృుడెలాగైందో?

(ఒకచోట ఈ కాకికి పిండం వేయమని చెప్తూ ఆచారాన్ని వ్యక్తం చేసి పరమార్థాన్ని గ్రహించమంటున్నాడు.)

# జ్ఞాన గుణములు

89. నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు
తళుకు బెళుకురాళ్ళు తట్టెడేల
చాటు పద్యమిలను చాలదా యొక్కటి-విశ్వ.

నాణ్యమైన వస్తువు ఒక్కటి చాలు పనికి రానివి వెయ్యి వుండేకన్నా పద్యాల్లో చాటు పద్యానికి (కవితా శైలికి) వున్న సొంపు మరేదానికి లేదు. కొన్ని కొన్ని చాటు కవిత్వంలో చెప్తేనే వాటికి పుష్టి.

90. చదువు చదవకున్న సౌఖ్యంబులును లేవు
చదువు చదువెనేని సరసుడౌను
చదువు మర్మమెరిగి చదువిన చదువురా-విశ్వ.

"విద్య లేనివాడు వింత పశువు" అని సామెత అలాగ చదువుకున్నవాడికి చదువువల్ల కలిగే సుఖ సౌఖ్యాలు, లాభాలు తెలుస్తాయి. దానివల్ల లోక జ్ఞానము, సరసత విషయ విజ్ఞానము వస్తాయి కాని ఆ చదువుయొక్క పరమార్థం తెలిసికుని చదవాలి.

91. కలిమిలేనివాడు కవిగాడు రవిగాడు
కామిగాక మోక్షగామిగాడు
కామియైనవాడు కవియౌను రవియౌను-విశ్వ.

డబ్బు లేనివాడు ఏది చేయడానికి అసమర్థుడే, అందుకే వాడు కవిగాడు, రవిగాడు, పొందలేడు, చూడలేడు, దేనికైనా కోరి

కనేది మూలం, అది లేకపోతే ఏదీ చేయలేడు. డబ్బుకన్న కూడా కోరిక వుంటే అది కొన్ని మార్గాలని తెలిసేటట్టు ప్రయత్నింపజేసి తద్వారా జయాన్ని పొందగలుగుతాడు.

92. గురుని శిక్షలేక గురుతెట్లు గల్గునో
అజునికైన వానియబ్బకైన
తాళపు జెవిలేక తలుపెట్టు లూడును-విశ్వ.

సరియైన గురువు వద్ద విద్య పొందనిచో వాడికి విద్యా రహస్యం తెలియదు. వాడు ఎంతటివాడైనాసరే గురువు ఉండాల్సిందే లేనిచో తాళం లేకపోతే తలుపు తెఱవలేనట్లు జ్ఞాన మార్గాన్ని అవగతం చేసుకోలేడు

93. వావి వర్తనలును వరుసను మర్యాద
దప్పినడచెనేని తగులుకీడు
వదలదపుడు దాకునది తప్పితే తుది
ముసలి ముప్పునైన మునుగువేమ.

వావి వరుసలనేవి, మానవ మనగడకు అత్యంత ప్రయోజన కరములు, వాటిని తప్పి చరిస్తే, అనేక యిబ్బందులు ఎదుర్కోవాలి క్షణక్షణమూ.

94. గుణములో గలవాని కులమెంచగా నేల
గుణము కలిగెనేని కోటిసేయు
గుణములేక యున్న గ్రుడ్డిగవ్వయులేదు-విశ్వ.

అన్నిటికన్న మానవునికి గుణమే ఉత్తమం. గుణమే భూషణం కూడాను అది వున్నప్పుడు కులముతో పని ఏల

గుణవంతుడైన వాడు ఏ కార్యం చేయడానికైనా అర్హుడే అది లేకపోతే నిష్ప్రయోజనమే ఎన్ని వున్నప్పటికి

95. మంత్రమును చదుతురు మంత్రార్థ మెరుగరు
అర్థమెరుగలేక అంధులైరి
గురుతు తెలియక నెరిద్విజు డెట్లగు-విశ్వ.

ప్రయోజనము లేని పనులు చేయుట మెటువంటిదో అర్థము తెలీకుండా మంత్రాలు చదవడం కూడా అటువంటిదే. దానివల్ల ఫలం శూన్యం

96. అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పలుకు చల్లగాను
కంచుమ్రోగినట్లు కనకంబు మ్రోగునా-విశ్వ.

"నిండుకుండ తొణకదు" అని సామెతుంది. అలానే అల్పులే అధికంగా వాగుతారు బంగారంకంటె అతి తక్కువ విలువైన కంచు మ్రోతలో పెద్దది

97. అనువుగానిచోట నధికుల మనరాదు
యొదిగి యొక్కవంక నుండవలయు
మఱ్ఱియాకుపైన మాధవుడుండడా-విశ్వ.

సమయము, స్థలము ఎరిగి మసలుకొనుట అత్యవసరము. అట్లు చేయనిచో ఒక్కొక్కప్పుడు కొన్ని అనర్థాలకు గురి కావాల్సిందే, ఇదే విషయాన్ని.

హితోప దేశంలో—

98. శ్లో ప్రస్తావ సదృశం వాక్యం
స్వభావ సదృశాం క్రియాం

ఆత్మశక్తి సమం కోపం
యోజానాతి సపండితః॥

సమయోచితమైన మాట, స్వభావోచితమైనటువంటి పని, తనయొక్క శక్తి యుక్తులకు తగిన కోపము తెలుసుకుని ప్రవర్తించేవాడే పండితుడు.

99. పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ పట్టవలయు
పట్టు విడుటకన్న పడి చచ్చుటేమేలు-విశ్వ.

ఒక కార్యాన్ని తల పెడితే ఎంతో ఆలోచించి దిగాలి. దిగిన తర్వాత అది పూర్తి చేసేవరకూ భగీరథ కృషి చేయాల్సిందే.

100. పట్టు పట్టినతరి పరవాదములు వేల
నెట్టుకొన్న తలపు నిలుపవలయు
అట్టి పలుకులు విడ అవనిలో నగుదురు-విశ్వ.

ఏ కార్యం చేబూనినా లోకుల విమర్శ సహజం, ఐతే అది పూర్తి చేస్తేనే కార్యశూరుడి విలువ. లేకపోతే నగుబాటే.

101. కిటు కెరుంగనీక కేవల నిష్ఠతో
మౌన ముద్రనుండు మాయయోగి
ఉన్నదెల్ల జెప్పు నుత్తమ యోగిరా-విశ్వ.

ఏ విషయము చెప్పకుండా అన్నీ తెలిసినవానివలె ఎల్లప్పుడు మౌనంగా కూర్చుంటాడు దొంగ యోగి. కాని జ్ఞాని మాత్రం తనకు తెలిసినది లోకానికి తెలియ చెప్పాలని భావిస్తాడు.

102. ఎఱుక లేనివాడు యేమేమి చదివిన
చదివినంత సేపు సద్గుణియగు
కదసి తామరందు కప్ప కూర్చుండదా-విశ్వ.

పరమార్థం గ్రహించలేనివాడు ఏయే ఉత్తమ గ్రంథాలు చదివినా నిష్ఫలమే, తామరాకు గూర్చి తెలియని కప్ప తామరాకు మీద కూర్చున్నట్లుగా!

103. గురువులేక విద్య గురుతుగా దొరకదు
నృపతిలేక భూమి తృప్తిగాదు
గురువు విద్య లేక గురుతర ద్విజుడౌనె-విశ్వ.

విద్యా రహస్యాలు తెలియాలంటే గురువు వుండాల్సిందే, రాజులేని భూమివలె, గురువులేని విద్యకూడా వానాకాలం చదువే అవుతుంది

104. వేద విద్యలెల్ల వేశ్యల వంటివి
భ్రమల పెట్టి తేటపడగనియవు
గుప్తవిద్య యొకటి కులకాంత వంటిది-విశ్వ.

వేదాలు శాస్త్రాలు అనేవి సామాన్యునికి ఎంతో దూరంలో వున్నటువంటివి. అందులో ఏదో వుందని చెపుతాడు అది చదివినోడు, వట్టి భ్రమే, బ్రతకడానికి కులవిద్యే ఉపయోగపడుతుంది. అవన్నీ వినడానికే.

105. గురువు చిల్లగింజ కుంభమీ దేహంబు
ఆత్మ కలుషపంక మడుగుబట్ట
తెలిసి విరిచెనేని దివ్యామృతము తేరు-విశ్వ.

శరీరమనెడి కుండలో నున్నటువంటి మనస్సు అనెడి బురదను, గురువు అనే చిల్లగింజ వలన, దుర్గుణాలు అనే బురద నశించి, దివ్య జ్ఞానమనే నీరు పైకి తేరుతుంది.

106. ఖలులు తిట్టిరంచు కలవర పడనేల
వారి తిట్లనేమి వాసి చెడును
సజ్జనుండు తిట్ట శాపంబదౌనయా-విశ్వ.

రాచ వీధిలో నడుస్తున్న మహా గజాన్ని చూసి వీధి ఊర కుక్కలు ఎన్నో మొరుగుతుంటాయి. మృగరాజు గర్జనకి బదులిస్తుందే తప్ప కుక్కల వంక కన్నెత్తి చూడదు. అలానే దుష్టులు ఏవో వాగుతుంటారు. వాటివల్ల ఎటువంటి అపఖ్యాతి అంటదు. కాకపోతే సన్మార్గుడు క్షోభించి తిట్టాడంటే అది శాపములాగ పని జేస్తుంది

107. దేహగుణములెల్ల తెలిసిన శివయోగి
మోహ గుణములందు మోసపోడు
సాహసంబు కల సంగ్రామమెంతరా-విశ్వ.

దేహమనేది నానావిధ దుర్గంధ బూయిష్టము చెవినుండి గులిమి, ముక్కునుండి చీముడు, నోటినుండి పాచీ కంటినుండి పుసుకులు, ఇక మలమూత్రాలు, శరీరనుండి ఎల్లప్పుడు దుర్గంధమైన చెమట యిటువంటిది దేహమని తెలిసి యోగులు, కామ క్రోధాదులవైపు మనస్సు వెళ్ళనీరు. ధైర్యం ఉండాలేగాని యుద్ధం ఎంత సేపు.

108. చిత్తశుద్ధి కలిగి చేసినపుణ్యంపు
కొంచెమైన నదియు కొదవకాదు
విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత

ప్రచారంకోసం చేసే ధాన, ధర్మాలే ప్రస్తుతం ఎక్కడ చూసినా, పరిపూర్వ విశ్వాసంతో, ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే దేమివున్నదో అది గొప్ప పుణ్యఫలాన్నిస్తుంది. చిన్ని విత్తుతోనే సహస్రాది కొమ్మలతో వెలిగే మఱ్రిచెట్టు మాదిరిగా

109. చదువు జదువనేల సన్యాసిగానేల
షణ్మతములు జిక్కి చావనేల
యతని భజనచేసి యాత్మలో దెలియుడీ-విశ్వ.

ఏది ప్రయోజనకరంగా వుంటే ఆ మతంలోకి కప్పల తక్కిడిలా మారుతున్నారు జనులు, ఉద్యోగావకాశాలో లేక మరే అవకాశాలో చూసి, సత్యవర్తనతో భగవంతుని యాత్మలో పూజిస్తే చాలు. సన్యాసించక్కర్లేదు కూడాను

110. ఆత్మలోన శివుని ననువుగా శోధించి
నిశ్చలముగ భక్తి నిలిపెనేని
సర్వముక్తుడౌను సర్వంబు దానౌను-విశ్వ.

ఆత్మలో ఏకాగ్రతతో, నిశ్చల భక్తితో, పరమాత్మను దర్శిస్తే, అదే మోక్షానికి మార్గమౌతుంది. ఆపైన సర్వమూ తానే అనే భగవంతుడు వేరు తాను వేరుకాదు అనే ఏకత్వ భావాన్ని పొందగల్గుతారు ఇది వేదాంతికి, మోక్షగామికి శిఖరస్థాయి.

111. బ్రహ్మ జంపి విష్ణుభాగంబులో గలిపి
విష్ణుజంపి శివుని వీటగలిపి
శివుని జంపి తాను శివయోగి గావలె-విశ్వ.

రజస్సత్త్వ తమోగుణాలనేవి త్రిమూర్తి లక్షణములు, అనగా రజో గుణాన్ని చంపి, తమో గుణములో చేర్చి తమో గుణాన్ని చంపి, సత్త్వగుణములో చేర్చినట్లయితె పరబ్రహ్మానందాన్ని పొందగలుగుతాడు నిజమైన యోగి

112. ఆరురుచులు వేరు సారంబు నొక్కటి
సత్యనిష్ఠ వేరు సత్యమొకటి
పరమ ఋషులు వేరు భవ్యుండు ఒక్కండె-విశ్వ.

ఉప్పు, కారము, పులుపు, పగరు, తీపి, చేదు, అనేవి ఆరు రుచులు, యివి నాలుకకి రుచికి వేరుగా అన్పించినా, ప్రతీదీ శరీర పోషకమే, సత్యమూర్తులు నిష్ఠాపద్ధతులు వేరైనా సత్య ధర్మము ఒక్కటే, అలానే మహాత్ములు వేరువేరుగా కన్పిస్తున్నా వారిలోని పరమాత్మ మాత్రము ఒక్కడే, దీనినే యిలా చెపుతాడు,

113. మృత్పిండమేకో బహు భాండరూపం
సువర్ణమేకం బహు భుషణాని
గోక్షీరమేకం బహుధేను జాతం
ఏకః పరాత్మా బహు దేహవర్తీ॥

కుండలు వేరువేరు రూపములుగా వున్నా మట్టి ఒక్కటే భూషణాలు వేరైనా బంగారము ఒక్కటే, గోవుల రంగులు వేరైనా పాలు ఒక్కటే, అలానే శరీరము వేరైనా పరమాత్మ ఒక్కటే సుమీ।

114. దేవుడనగ వేరే దేశమందున్నాడె
దేహితోడ నెపుడు దేహమందు
వాహనముల నెక్కి వడిదోలుచున్నాడు-విశ్వ

మానవాళిలో అనాదిగా ఓ నమ్మకం. అందునా హిందువులలో విష్ణువు వైకుంఠంలోను శివుడు కైలాసంలో వుంటారని నమ్మిక, అది వట్టి భ్రమ మాత్రమే పరమాత్మ ప్రతి జీవునిలోను వుంటాడు అది తెలుసుకున్నవాడే వేదాంత మర్మజ్ఞుడు, ధన్య జీవుడును.

115. అజ్ఞానమె శూద్రత్వము
సుజ్ఞానము బ్రహ్మమౌట శృతులను వినరా
అజ్ఞాన మణచి వాల్మీకి
సుజ్ఞానపు బ్రహ్మమొందెఁ జూడర వేమా.

బ్రాహ్మణ్యము, క్షత్రియము, వైశ్యులు, శూద్రులు అనే నాల్గు వర్గాలు అంటూ అరుస్తూంటారు కొందరు వైధిక కర్మ బద్ధులు. అది కేవలము స్వలాభాపేక్షోద్దేశ్యమే, జ్ఞానులందరు బ్రహ్మలే, అటువంటి బ్రహ్మత్వమే బ్రాహ్మణ్యము, అజ్ఞానమే శూద్రత్వము, కిరాతునిగా నికృష్ట కార్యము లనేక మొనరించి, సప్తర్షుల కృపతో జ్ఞానాన్ని గ్రహించి, మహర్షి అయ్యాడు వాల్మీకి,

116. ఎక్కడి సుతులెక్కడి సతు
లెక్కడి బంధువులు సఖులు నెక్కడ భృత్యుల్
డొక్కుపడి పోవువేళల
జక్కటికిని యెవరురారు సహజము.

కన్న కొడుకులు గాని, భార్యకి భర్త. భర్తకి భార్య గాని బంధువులుగాని. స్నేహితులుగాని, సేవకులుగాని అంతిమయాత్రలో స్మశానం వరకు మాత్రం వస్తారు. ఆపైన వచ్చేవి తను చేసిన ధానం, ధర్మం మాత్రమే, దీనినే హితోపదేశంలో—

మరణించిన పిదప వానియొక్క సంపదలు, ఇంటియొద్దనే వుండును, బంధుమిత్రులు శ్మశానంలో విడిచి పెట్టేవరకు వస్తారు, ఆ పైన వచ్చేవి తాము చేసిన మంచి, చెడ్డ కార్యములయొక్క ఫలితమే.

117. మాలవాడయినను మఱి యాత్మ మీఁదను
మనసు నిల్పెనేని మాలగాఁడు
మనసు నిలుపకున్న మహిమీఁద మాలడౌ-విశ్వ

వైదిక కర్మబద్దుల నిర్ణయప్రకారం మాల అనేది కడ జాతిగా జమ కట్టారు అటువంటి వానిగా జన్మించినప్పటికి 'ఆత్మ దృష్టి!' కలవాడు మాలకానేరడు, ఆత్మదృష్టి లేనివాడు జన్మతః బ్రాహ్మణుడై జన్మించిననూ మాలవాడే వాడు.

118. బయలున సర్వము బుట్టును
బయలందే లీనమగును బ్రహ్మంబనగా
బయలని మదిలో దెలిసిన
బయలందే ముక్తి బట్టబయలగు వేమా.

శూన్యంనుండే సర్వం అవిర్భవిస్తాయి, తిరిగి అవి శూన్యం లోనే కలుస్తాయి బ్రహ్మమే శూన్యము, శూన్యమే బ్రహ్మమయము ని గ్రహించినవాడే ముక్తిని సులభంగా పొందగల్గుతాడు.

119. కోలు తిత్తిలోన దొలుత బుట్టిన తాను
వెనుక దెలియవలయు వివర మరసి
వెనుక దెలియలేమి వెఱ్ఱియై చెడిపోవు-విశ్వ.

ప్రతి మానవుడు తనకున్న జ్ఞానంతో అనుభవజ్ఞులను చేరియు జన్మరాహిత్యాన్ని తెలుసుకోవాలి. మృత్యువు మీదపడినా తెలుసుకోలేదు అంటే వాడి జన్మ వ్యర్థమే.

120. విడువవలయు నూరు విశ్రాంతి గాకున్న
విడువవలయు నాలి విధము చెడిన
విడువవలయు రాజు వితరణి గాకున్న-విశ్వ.

వితరణశీలి కానటువంటి రాజుని సుఖసౌఖ్యములు లేనటు వంటి వూరుని, గుణము చెడిన పెళ్ళాన్ని విడిచిపెట్టుట మంచిది.

121. ఎరుకలేని దొరల నెన్నాళ్ళు గొలిచిన
బ్రతుకులేదు వట్టి భ్రాంతిగాని
గొడ్డుటావు పాలు గోగితె చేపునా-విశ్వ

వట్టిపోయిన ఆవుని పొదుగుపట్టుకు ఎంత గోకితే మాత్రం సేపుతుంది. అలానే మూర్ఖుడైన రాజుని ఎన్నాళ్ళు సేవిస్తే సుఖ మేమిటి వట్టి భ్రమ తప్ప

122. స్వానుభూతి లేక శాస్త్ర వాసనలచే
సంశయంబు చెడదు సాధకునకు
చిత్ర దీపమునను చీకటి జెడనట్లు-విశ్వ.

కేవలం ఏదో శాస్త్రాలు చదివి ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకో వడమనేది జరిగే పనికాదు. అది కేవలము దీపపు బొమ్మవేసి

దాన్ని చీకటిలో పెట్టిన వెలుతురు కలుగునా. దీనినే మహావాక్య రత్నావళిలో—

123. శ్లో. అనుభూతి వినామూడో
ర్వృథా(బ్రహ్మణి మోదతే
ప్రతిబింబిత శాఖాగ్ర
ఫలా స్వాదన మోదవత్.

తనలో వున్న ఆత్మను చూడలేక వ్రతములద్వారా బ్రహ్మాన్ని పొందెద ననుట. పండుయొక్క నీడను తినిన పండుయొక్క రుచి ఎలా తెలియదో అటువంటిది.

124. అంకెలెఱిగి మాటలాడ నేర్చినపుడె
పిన్న పెద్దతనము లెన్ననేల
పిన్న చేతిదివ్వె పెద్దగా వెలుగదా-విశ్వ.

సంఖ్యలు తెలిసికొని మాట్లాడగలిగినప్పటినుండి జ్ఞానాన్ని పెంపొందింప జేసుకోవాలి జ్ఞానానికి చిన్నా పెద్దా అనే భేదంలేదు చిన్నవారి చేతిలో కూడా దీపము పెద్దగానే ప్రకాశిస్తుంది దీనినే భర్తృహరి వైరాగ్య శతకంలో—

125 శ్లో. యావత్స్వస్థమిదం శరీర మరుజం యావజ్జరాదూరితో
యావచ్చేంద్రియ శక్తిర ప్రతిహవాయావత్షయో నాయుషః।
ఆత్మశ్రేయనివాత దేవ విదుషాకార్యః ప్రయాత్నోమహా।
సందీప్తె భవనేతు కూపఖనన ప్రత్యుద్యమః కిందృశః॥

ఈ శరీరం వృద్ధత్వము-అనారోగ్యము చెందకుండా వుండే లోపున గొప్పవాడైన విద్వాంసుడు సంసార బంధములను విడిచి

తన మోక్ష మార్గాన్ని చూచుకోవాలి. అట్లు చేయనివాడు ఇల్లు కాలి పోతున్న సమయంలో నుయ్యి త్రొవ్వి, ఆ నీటిలో మంటలు చల్లార్చడము వంటిది. ఏమి ప్రయోజనము లేదు.

126. చదువులెల్ల చదివి సర్వజ్ఞుడై యుండి
బ్రహ్మ విద్యలెల్ల పదటగలిపి
యిరుకు యోనిజూచి పరమయోగమువాను-విశ్వ.

సర్వ విద్యలు నేర్చి, శట్చాస్త్రాలు చదివి. సర్వజ్ఞత సిద్ధించి నప్పటికీ, ఆడదాన్ని చూసి అన్నీ వదులుకుంటున్నాడు.

127. తాము కన్నవారుఁ దముగన్న వారును
జచ్చుటెల్లం తమకు సాక్ష్యమె కద
బ్రతుకు టెల్లఁ దెలియ బ్రహ్మకల్పంబులా-విశ్వ.

జన్మనిచ్చిన తల్లీ, తండ్రీ తమ కండ్లముందే గతించడం చూస్తారు ఒకప్పుడు అల్పాయుష్కులై తాము కన్నబిడ్డలు నైతం గతించడం చూస్తుంటారు. బ్రతుకు శాశ్వతం కాదు అన్నది తెలిసి కూడా ప్రజలుఅధ్యాత్మిక జాగ్రత నొందరు.

# సంసార లక్షణములు

128. వెతల దీర్చువాడు వేదాంత వేద్యుండు
రతుల నేలువాడు రసికుడగును
సతిని పెనగువాడు సంసారయోగిరా-విశ్వ.

జీవిత బాధలకి వేదాంతి మార్గం చూపుతాడు. జీవన కాలంలో సంసార సౌఖ్యాలన్నిటిని సంపూర్ణంగా పొందగల్గినవాడే

రసికుడు. పెళ్లాన్ని అనురాగంతో పెనవేసుకుని జీవితం గడిపేవాడే సంసార యోగి అని పిలువబడుతాడు.

129. బోటియొకతె బ్రహ్మనోటి మీసనె తన్నె
కొమ్మయొకతె విష్ణురొమ్ము తన్నె
సఖియయొకతె శివుని సగముగా జేసెరా-విశ్వ.

ఇదొక పెద్ద పురాణ వివరణ. సరస్వతి, బ్రహ్మ నోటి యందు ఒక్కోసారి అధిష్ఠిస్తూందట, పాపం అప్పుడు ఆమె పాదాలతో అతని నోటిని తాకాల్సిందే, విష్ణువుగారికి భార్యామణి హృదయమందుంటుందట, ఆమె అక్కడ వుండేటప్పుడుకూడా ఆమె పాదాలాయన వక్షస్థలాన్ని తాకక తప్పదుకదా: యిక ఆది దేవుడుగారు తమ శరీర సగభాగాన్నే యిచ్చేసారు వారి సతీమణి పార్వతమ్మగారికి, ఇది కొంచెం వ్యంగ్య దోరణిలో వున్నా, సతికి, పతికి వుండాల్సిన అన్యోన్యతను ఎంతో చక్కగా చెప్పాడు.

130. సుగుణవంతురాలు సుదతియై యుండిన
బుద్ధిమంతులగుచు పుత్రులొప్ప
స్వర్గమేటికయ్య సంసారి కింకను-విశ్వ.

గుణవతియైన భార్య బుద్ధిమంతులైన కొడుకులతో ఆనంద దాయకంగా సంసార జీవనం సాగుతుంటే, ఎక్కడో ఎవ్వడో చూచి రాని స్వర్గమెందుకు సంసారమే ఆనంద స్వర్గం.

131. తరుణి పుణ్యవతిగ వరుని బట్టియె యగు
పాపియగును మగని బట్టియె యిల
భర్తవర్తనంచె పడతుల యందుండు-విశ్వ.

సంసార సారధ్యంలో స్త్రీ పురుషులిర్వురూ సమానులే. భర్త నడవడికను బట్టే, భార్య నడుస్తుంది. భర్త ఆదర్శ ప్రాయుడైతే ఆదిలో కొంచెం దుడుకుగా వున్నా అతన్ని చూసి ఉత్తమ లక్షణాలు అలవర్చుకుంటుంది.

132 ఆలి వంచలేక యధమత్వమున నుండి
వెనక వంతు ననుట వెర్రితనము
చెట్టు ముదరనిచ్చి చిదమిన బోవునా-విశ్వ.

"మొక్కై వొంగనిది మ్రానై ఒంగునా" అని సామెత. అలానే, పెళ్లామైనా దుడుకుదైతే కట్టుదిట్టంగా, కళ్లెర్ర జేయాల్సిందే. అప్పుడు చేయకపోతే ఏదో ఒకరోజు మొదలకే మోసం వస్తుంది.

133. భార్యమీద ఆశపరగ మగనికుండు
మగనిమీద ఆశ మగువకుండు
శివునిమీద ఆశ సిద్ధునకుండు-విశ్వ.

భార్యమీద అనురాగం, అభిమానం అనేవి మొగుడు కుంటాది, మొగుడిమీద భార్యకుంటాది అలానే, శివుడిమీద సిద్ధ యోగి అనబడే వాడికుంటుంది.

134 అనగ ననగ రాగ మతిరమ్యమై యుండు
పెనగ పెనగ సతికి ప్రేమపుట్టు
తినగ తినగ వేము తియ్యనై యుండదా-విశ్వ

పాడగా, పాడగా, రాగం అతి మనోహరంగా చెవిని సోకుతుంది కలిసి, మెలిసి, అన్యోన్యం సంచరిస్తూంటే భర్తమీద

భార్యకు ప్రేమ కల్గుతుంది తినగా, తినగా చేదుగా వుండే వేప పండు సైతం తియ్యగా అన్పిస్తుంది

135. ఇంటియాలి విడిచి ఇలజార కాంతల
వెంట తిరుగువాడు వెర్రివాడు
పంటచేను విడిచి పరిగలేరిన యటుల-విశ్వ.

ఇంట్లో కట్టుకున్న భార్య వుండగా, కాసుకోసం కన్నుగీటే బజారు స్త్రీలతో తిరుగుతుంటారు కొందరు మద పిచ్చగాళ్ళు

136. బావమరసి తన్ను భార్య సేవించిన
ఇంటికైన నగును ఈశ్వరుండు
అదియు లేక బ్రతుకుటధమము భువిలోన-విశ్వ

ప్రతి మగాడికె స్త్రీ తోడు అవసరమని చెప్పాల్సిందే. సన్యాసికి తప్ప, "సతికి పతే దైవం" అని సామెత, కాబట్టే సంసారంలో స్త్రీ భర్తని సేవిస్తూంటే ఆ ఇంటికి ఆ పురుషుడు పరమేశుడే, భార్య గౌరవించని బ్రతుకు వ్యర్ధమే పురుషుడికి

137. ఆలుమగని మాటకడ్డంబు వచ్చెనా
ఆలుగాదు నుదుటి వ్రాలుగాని
అట్టియాలు విడిచి యడవినుండుట మేలు-విశ్వ.

భర్త మాటకి భార్య, భార్యమాటకి భర్త గౌరవం యిచ్చి పుచ్చుకుంటేనే, అందం, ఆనందం అంతేగాని మగడు చెప్పే ప్రతి దానికి చీదరించుకుంటూ, అడ్డమొచ్చే భార్య వుందంటే వాడి దౌర్భాగ్యం అంతా యింతా కాదు. అటువంటి పెళ్ళాన్ని విడిచిపెట్టి పోవడమే మేలు

138. వాడకురికి ఓట్టు వలదన్న మొరబెట్టు
ముందు మగనిదిట్టు ముసుకుబెట్టు
గడుసురాలు మగని గంప బెట్టమ్మురా-విశ్వ.

కొందరు "పెట్టమారి మొగుళ్ళు" సంఘంలో కన్పిస్తూం టారు. ప్రతి దానికీ భార్యే తప్ప వారికి వేరే మార్గం వుండదు. దానికి తగ్గట్టే పెంకి పెళ్ళాలుకూడాను. మాట్లాడితే విరుచుకు పడు తుంటారు ఒకో యిల్లాలి సంగతి వేరే చెప్పక్కర్లేదు భర్తగార్ని పనివాడిలా వెంటేసుకూ తిరుగుతుంటుంది ఇలాటి చేష్టలు మగ వాడ్ని బట్టీ స్త్రీకి అలవడతాయి దీనినే మనుస్మృతినందు—

139. వివాదశీలాం స్వయమర్థ చోరిణీం
పరానుకూలాం పరిహాసభాషిణీమ్
అగ్రాశినీం మధ్యగృహ ప్రవేశినీం
త్యజంతి భార్యాం దశపుత్ర మాతరమ్.

జగడాలమారి, దొంగ స్వభావము కలది, ఇతరులకు అను కూలంగా వుండేది, పరిహాసాలాడేది, ముందుగా భోజనం చేసేది పెత్తనాల మారియైన ఆడది 10 మందికి తల్లియైన విడువవలెను అంటాడు

140. జార పురుషునకు జాజిపూవులతోడ
పాన్పు వేయునయ్య పాతలంజ
సొంతమగని మీద చింతనిప్పులు జల్లు-విశ్వ.

స్త్రీని తెలుసుకోవడం కష్టం అంటారు పెద్దవాళ్ళు స్త్రీ దాచినట్లు రహస్యాన్ని పురుషుడు దాచలేడు. కనుకనే సంసారిగా వుండేది కూడా రహస్యంగా వచ్చిన మగాడికి పూలపాన్పు పరచి

మరీ సేవిస్తుంది కట్టుకున్న మొగుడైనా నచ్చకపోతే వాడు కన్పించేసరికెల్లా నిప్పుల్లో చింతకఱ్ఱ నిప్పులు బాగా మండతాయి. అటువంటివి జిల్లడానికైనా సిద్ధమే.

141. ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు
కాచి యతకవచ్చు క్రమముగాను
మనసు విరిగెనేని మరి చేర్చరాదయా-విశ్వ.

ఇనుము ముక్కలైనదంటే దాన్ని ఎన్నిసార్లయినా అతక వచ్చు, దానికి తగ్గ మార్గాలున్నాయి. కాని మనసనేది గాని బల మైన గాయం తగిలి విరిగినదంటే యిక దాన్ని ఏవిధంగాను అతక లేము సుమా।

142. గుణవతియగు యువతి గృహము చక్కగానుండు
చీకటింట దివ్వె చెలగురీతి
దేవియున్న యిల్లు దేవార్చన గృహంబు-విశ్వ.

పురుషుడికి గుణవతియైన భార్య లభించడం కన్నా మరో అదృష్టం ఏదీ లేదు అలాంటి స్త్రీ వున్న ఇల్లు చీకటింటికి దీపం ఎలాంటిదో అలా వుంటుంది. ఆ ఇంట్లో దేవి కొలువై వున్నట్లే. దీనినే పంచతంత్రమందు—

143. శ్లో. కార్యేషుదాసీ కరణేషుమంత్రీ
రూపేచలక్ష్మీః క్షమయాధరిత్రీ
స్నేహేచమాతా శయనేతువేశ్యా
షట్కర్మయుక్తా కులధర్మపత్నీ.

ఇంటి పనులందు దాసిగాను, ఆలోచన చెప్పేటప్పుడు మంత్రి గాను, రూపాలంకరణమందు లక్ష్మిగాను, ఓర్పునందు భూదేవి

వలెను, అభిమానమందు తల్లిగాను, సంభోగమందు వేశ్యగాను వర్తించే నేర్పు కలిగినటువంటిదే కులపత్నిగా చెప్పబడుచుండును

144. అద నెరిగిన మగువ అనువెర్గు చనువెర్గు
ముదముతోడ మగని మోహమెరుగు
విభుని శ్రేష్ఠగుణము వేశ్య తానెరుగునా-విశ్వ.

యుక్తాయుక్త విచక్షణ, సంసారమే స్వర్గమనుకునే స్త్రీ. భర్తకి కావలసింది సమయానికి సమకూరుస్తుంది అటువంటి స్త్రీ భార్య అయినపుడు పురుషుడు భార్యే సర్వస్వమని ఆరాధిస్తాడు. భగవంతుడికన్న భార్యే ఎక్కువగా భావిస్తాడు, తన దగ్గరకి వచ్చే విటుడికి ఏంకావాలో వేశ్యకి తెలిసిందల్లా ఒక్కటే

ఇచ్చట వేశ్యనీ కుల స్త్రీని పోల్చి చెబుతున్నాడు

145. పతిని విడువరాదు పదివేలకైనను
పెట్టి చెప్పరాదు పేదకైన
పతిని తిట్టరాదు సతి మానవతియేని-విశ్వ.

సతికి పతే దైవమని చెప్తునప్పుడు పతిని తిట్టడం పాపమే కదా! ఎటువంటి కష్టసమయంలో కూడా భర్తతోనే వుండడం పతి ధర్మం దానిలో నిజమైన ఆనందం అలానే పెట్టింది పేదవాడికైనా అన్యులతో చెప్పడం భావ్యం కాదు.

146. పనస తొనల కన్న పంచదారల కన్న
జుంటి తేనెకన్న జున్నుకన్న
చెఱకు రసముకన్న చెలుల మాటలు తీపి-విశ్వ.

పనస తొనలు ఒక రకమైన మధురం, పంచదార సరేసరి, తేనె మరొక రుచి, జున్ను రుచేరుచి, చెఱకు పానకం త్రాగేకొద్ది

త్రాగాలన్పిస్తుంది. ఇవన్నీ ఎంతటి మధుర పదార్థాలో వాటికన్న నచ్చి మెచ్చిన భార్య మాటలు మధురంగా వుంటాయి

147. ఆఁడుదాని బొంకు గోడపెట్టిన యట్లు
పురుషవరుని బొంకు పూరితడక
స్త్రీల నేర్పు మగలఁ జీకాకు పరచురా-విశ్వ.

రంకు నేర్చినది బొంకు నేర్వదా'' అని సామెత, అలానే స్త్రీ ఒక అబద్ధాన్ని చెప్పిందంటే నిజమేనన్పిస్తూంది. అదే పురుషుడు చెప్తే ఎక్కడోక్కడ దొరికిపోతాడు, స్త్రీల అబద్ధాలు ఒకప్పుడు చాలా ప్రమాదాలకి దారి తీస్తాయి.

148. తగిన కులజుండైన తనయెత్తు ధనమైన
పరపురుషుని నేల పట్టనిచ్చు
పరమ సాధ్విచూడ నౌరుల నంటదుసుమా-విశ్వ.

'పతివ్రత' అనే పదం ఎంత గొప్పదో, సృష్టిలో ఆ స్త్రీ అంత అరుదుగా దర్శనమిస్తుంది. ఉత్తమ యిల్లాలు, భర్తే సర్వస్వంగా మనసా, వాచా, కర్మణా విశ్వసిస్తూంది. ఒకప్పుడు గొప్పకులం వాడు, ఎంతో రూపసి, అంతకుమించి ఐశ్వర్యవంతుడు, ఐనప్పటికీ పరపురుషుణ్ణి కన్నెత్తి చూడదు ఏ విషయమున కేది మూలము చెప్తోంది.

శ్లో॥ వేదమూల మిద జ్ఞానం భార్యామూల మిదం గృహం కృషి
మూల మిదం ధ్యానం ధనమూల మిదం జగత్॥

## ఆశ - ఆత్మవంచన

149. నీళ్ళలోని చేప నెరిమాంసమాశకు
గాలమందు జిక్కి గూలినట్లు
యాశబుట్టి మనుజుడారీతి చెడిపోవు-విశ్వ

నీళ్ళలో జీవించే చేప మాంసానికి ఆశపడి గేలానికి వున్న ఎరను తినడానికి ప్రయత్నించి తనే చస్తుంది. అలానే మానవుడు అత్యాశతోనే చెడిపోతాడు. దీనినే భర్తృహరి వైరాగ్య శతకంలో-

శ్లో. అజానన్ దాహాత్మ్యంపతతు శలభ స్త్రీ ప్రదహనే
సమీనోప్య జ్ఞానాద్బదిశయు తమశ్నాతు పిశితం।
విజ్ఞానంతో ప్యేతేనయమిహ విపజ్జాలాక్ నముస్నామః
కామా నహహా గహాపోమోహా మహిమ॥

మిడత తెలియక మంటను చూచి భ్రమించి అందుపడి చస్తున్నది. అట్లే చేప తెలియక మాంసానికి ఆశపడి ఎలా గాలానికి చిక్కుతుందో అలాగనే మానవులు తెలిసికూడా పుత్ర మిత్ర కళత్రాది సంసారమాయా మోహంలో పడి బైట పడలేకుండుట ఆశ్చర్యముగా వుండి యున్నది కదా అంటున్నాడు.

## కామం - మోహం

150. కాంచనంబుపైన కాంతలపైనను
బ్రహ్మకైనబుట్టు రిమ్మతెగులు
తోయజాక్షి విడుచు దొరయెవ్వడును లేడు-విశ్వ.

సృష్టిలో ప్రతి మానవునికి మగువమీద, డబ్బుమీద మోహం అనేది తప్పక వుంటుంది. సృష్టికర్తకు సైతం వుంటుంది అటు వంటి రోగం. ఒకప్పుడు డబ్బునైనా వదులుతాడుగాని,* అందమైన ఆడదాన్ని ఎవ్వడూ సైతం వదలడు.

151. వలపు కలిగెనేని వనజాక్షి యధరంబు
వంచదార కుప్ప పాలలప్ప
చూత ఫలరసంబు జుంటి సమానంబు-విశ్వ.

స్త్రీ కోరిక కల్గినపుడు ప్రియురాలి పెదవి ముద్దుపెట్టుకుంటే పంచదార కుప్ప, పాలకోవ, మామిడిపండ్ల రసం, జున్ను ఎంత రుచిగా వుంటాయో అంత తీపిగా మధురంగా వుంటుంది.

152. ఇంతి చనులబిరుసు కొంతకాలమెగాని
పండగించి చూడ పాలతిత్తి
చింతవడక యేడ్చి చీకఁడా పుత్రుఁడు-విశ్వ.

ఏ ఆడదానికైనా రొమ్ములబింకం కొంతకాలమెగాని బ్రతికి నన్నాళ్లు వుండదు. జ్ఞానదృష్టితో ఆలోచించి చూస్తే అదొక పాల తిత్తిలాంటిది. పసిబిడ్డడు నిస్సంకోశంగా ఎటువంటి ఆలోచన చేయ కుండా కావలసినంత సేపు త్రాగుతాడు.

153. చదువులెల్లఁ జదివి సర్వజ్ఞులై యుండి
బ్రహ్మ విద్యలెల్ల పదటఁ గలిపి
పడఁతిఁ దలఁచునంత పరమయోగము మాను-విశ్వ.

ఎన్నో చదువులు చదివి, సర్వ శాస్త్రములు అభ్యసించి సకల విద్యావిశారదులైకూడా ఒక్క ఆడదాని మోహంలో పడి భ్రష్టులగుతున్నారు.

154. రాజవరుల కెపుడు రణరంగముల చింత
పరమ మునుల కెల్ల పరముచింత
యల్పనరుల కెల్ల నతివెలపై చింత-విశ్వ.

రాజులకి ఎప్పుడు యుద్ధాలుచేసి రాజ్యాభివృద్ధి చేసుకోవాలనే తాపత్రయం, అలానే పరబ్రహ్మమును దర్శించి మోక్షాన్ని పొందాలనే తాపత్రయమే వుంటుంది. పరమయోగులుకు కానీ ఎళ్ళవేళలా అందమైన ఆడదాన్ని పొందాలనే కోరికతో క్రుగ్గుతుంటారు నీచులు, కాముకులు.

155. గొప్ప పిరుదుగన్న కుచకుంభములగన్న
చెప్పరానిచోట చేవగన్న
ముప్పిరిగొనునయ్య మొలసిన మోహంబు-విశ్వ.

పెద్ద పిరుదులు, ఎత్తైన రొమ్ములతో యవ్వనపు పొంగులో వున్న స్త్రీని నగ్నంగా వున్న సమయంలో కాని చూస్తే మోహం మదినిండి నులిపెట్టినట్టు పురి ఎక్కిపోతుంది.

156. రూపు నడకజూడ దాపంబు బుట్టిన
భ్రాంతు లంకురించు నంతలోనె
బుద్ధి మరలుకున్న రద్దకి నెక్కురా-విశ్వ.

అందమైన జవ్వని రూపం నడక చూస్తుంటే పురుషుడికి లోపల మదనవాంఛ రగులుతుంది. అది అన్నీ అనుకూలించే స్థితిలో పర్వాలేదు గాని, కూడని పరిస్థితుల్లో కోరిక రేగితే దాన్ని మరల్చుకోకపోతే చిక్కులు పాలవ్వవల్సిందే.

157. తరుణి సొగసుకాని తనయుని గన్నను
మరుని కళల మించి మనసుపారు

పాపజాతి మనము పట్టంగ రాదయా-విశ్వ.

అందమైన మగాణ్ణి చూస్తే తన కొడుకైనప్పటికీ స్త్రీకి మనస్సు మన్మథ విహారంలోకి వెడుతుంది. మనస్సుకి, కోరికకి పట్టపగ్గాలు వుండవు. ఇదే భారతంలో స్పష్టంగా కన్పిస్తోంది.

శ్లో॥ సుందరం పురుషమ్ దృష్ట్వా భ్రాతరం పితరం సుతమ్।
యోనిర్ద్రవతి నారీణాం తస్య మే బ్రూహి కేశవ॥

తోబుట్టిన వాణ్ణిగాని, తండ్రిగాని, కొడుకుగాని యైనప్పటికి రూపవంతుడైన పురుషుణ్ణి చూసిన స్త్రీకి యోని ద్రవించును దీని తత్త్వాన్ని నాకు అనుగ్రహించు కేశవా! అంటూ ద్రౌపది కృష్ణుణ్ణి కోరుతుంది.

158. పేరు సోమయాజి పెనుసింహబలుడాయె
మేకపోతుఁబట్టి మెడలు విరుచు
క్రతువు చేయు ఫలము కామంబుకేగద-విశ్వ

మహర్షులు జరిపే సోమయాగం, సత్రయాగం, సర్వజిత్తు యాగం వంటి యాగాల్లో, యాగానంతరం వారు మద్యం మాంసం తీసుకున్నట్టు దాఖలాలు కన్పిస్తున్నాయి, విధిగా తీసుకోవాల్సిందే ఎంతటి బ్రహర్షియైనా యిటువంటి యాగాల ఫలితంగా స్వర్గంలో, సురకాంతలతో సంభోగావకాశం లభిస్తుందని నమ్మకం అలానే మేకపోతుల్ని బలులివ్వడం అది భక్షించడం-ఇదంతా ఎటువంటి క్రియలో తెలుస్తున్నాయి

159 లంజకొరకు మేకనంజుడు తినసాగి
యజ్ఞమెల్ల కామయజ్ఞమాయె
మొదట సోమయాజి తుదకామయాజిరా-విశ్వ

తంత్రక్రియలు చేసే క్షుద్రోపాసకులు, మద్యం, మాంసం, ఆపైన మగువతో విలాసించడం అలానే సౌమ్యోపాసకులు చేసే క్రతువు (యజ్ఞ యాగాలు) లను ముఖ్యంగా పై లోకాల్లో ఏవో సుఖసౌఖ్యం కల్గుతుందని వారి విశ్వాసం. ఒక విధంగా యిది స్వర్గ కాంత రంభా భోగం లభిస్తుందని నమ్మకమట, ఆ విధంగా యజ్ఞం చేసేవాడు, మొదట సోమయాజియైన తుదకు కామయాజే కదా,

160. ఆకలిగొని వచ్చెనని పరదేశికి
పట్టడన్నమైన పెట్టలేడు
లంజెదాని కొడుకు లంజెల కిచ్చురా-విశ్వ.

తఱచూ సమాజంలో ధనవంతులనేవాళ్ళు చేసేవేమిటంటే 'అన్నమో రామచంద్రా' రెండ్రోజుల్నించి కూడు లేదు బాబు అంటూ ఆర్తనాదం చేసేవాడికి కడుపునిండా పట్టెడన్నం పెట్టక కసిరికొడతారు కాని పడకమీద తొడ సంపర్కంకోసం లంజెల కివ్వడానికి వేలకి వేలు ఖర్చు చేస్తారు.

161. అంగమెల్లవదలి యటు దంతముల నూడి
తనువు ముదిమి చేత తరుచువణక
ముప్పుతిప్పలబడి మోహంబు విడువడు-విశ్వ.

వయస్సుమీదపడి శరీరం శుష్కించిపోతూ, పళ్ళు ఊడి పోయి. నిటారుగా వున్నదల్లా ఒంగిపోయి. చావు సన్నగిల్లి తమ పనులు తాము చేసుకోవడం కూడా కష్టంగావున్నా ఆహార, విహార, శారీరక సుఖాలమీద యింకా ఏదో వాంఛతోనే వుంటారు. ఈ విషయాన్నే శతశ్లోకీ___

శ్లో॥ అంగంగళితం ఫలితం ముండేం దశనవిహీనం జాతం తుండం
వృద్ధాయాతి గృహిత్వాదండం తదపిన ముఞ్చత్యాశా పిండం

శరీర పటుత్వము తగ్గినప్పటికీ. తల వెంట్రుకలు తెల్లగా పండి, ఓ ప్రక్క వూడిపోతున్నప్పటికీ. నిలుచుండి నడువలేక కర్ర సహాయంలో ముందుకు ఒంగి వణుకుతూ సంచరించవలసిన పరిస్థితులలో కూడా ఈ శరీరము మీద ఆశను వదలక జీవిస్తున్నారు కదా' అని చెపుతూంది,

162. వెఱ్ఱివానికైన వేషధారికినైన
రోగికైన పరమ యోగికైన
స్త్రీల చూచినపుడు చిత్తంబు రంజిల్లు-విశ్వ.

ఎంతటి వెర్రివాడికైనా, సన్యాసికైనా రోగంతో జీవిస్తున్న వాడికైనా యోగినంటూ జడల బర్రెలా తిరిగే వానికైనా, అందమైన ఆడదాన్ని చూసేసరికి ఏదో చలిస్తూ వుంటాడు. దీనినే,

శ్లో॥ విశ్వామిత్ర పరాశర ప్రభృతయో వాతంబు వర్ణా శనాస్తేపి
స్త్రీముఖం పంకజ సులలితం దృష్ట్వైవ మోహగతాః
శాల్యాన్నం సఘృతం పయోదధియుతం యేభంజతేమానవా స్తేషా
మింద్రియనిగ్రహో యదిభవేద్వింధ్యః ప్లవేత్సాగరేః॥

నీరు, గాలి, ఆకులు వంటివి తింటూ తపోదీక్ష చేసిన విశ్వామిత్ర, పరశరవంటి గొప్ప ఋషులు నైతము స్త్రీని చూసి భ్రమించిరంటే, ఇక నానావిధ రుచులలో జీవించే మానవులు ఇంద్రియ నిగ్రహంతో వున్నారంటే, అది సముద్రమునందు వింధ్య పర్వతం తెప్పలా తేలిందన్నంత నిజము, అంటే నమ్మరానిది.

# అభ్యుదయ లక్షణం

163. పేదవాడయైన పెంటికిచ్చెదనని
పైడి నడుగరాదు పరుసమునను
పైడిగొనుట పెంటిబట్టిన యట్లయా-విశ్వ.

(ఇది వేమననాటి కన్యాశుల్కం) పేదవాడు సైతము పిల్ల నివ్వనప్పుడు పౌరుషంగా కట్నం అడగకూడదు కట్నం అంటే ఆ నాటి కన్యాశుల్కం. అది తీసుకుంటే తన కూతుర్ని అమ్ముకున్నట్టే సుమీ.

164. కలిమిజూచి యియ్య కాయమిచ్చినయట్లు
సమున కియ్యనదియు సరసతనము
పేదకిచ్చు మనువు పేనవేసినట్లుండు-విశ్వ.

పిల్లనిచ్చేటప్పుడు కన్యాదాత వరుని ఆస్థిపాస్థులు చూసి పెళ్ళి చేస్తే అది పిల్ల శరీరాన్ని అమ్మినట్లే, తనలో సరిసమానమైన స్థితిలో వున్నవాడికిచ్చి చేస్తే అది సరసత అనిపించుకుంటుంది అలాగాక ఏదో దారినిపోయే పేదవాడి కిచ్చిచేస్తే అది వాడితో పిల్లని పెనవేసినట్టు ఔతుంది.

165. కలిమిగల యతనికి కన్యక నిచ్చుచో
మురియుచుంద్రు వెర్రి మూఢజనులు
పూజఫలమెకాని పూనికల్ నిల్చునా-విశ్వ.

పిల్లనిచ్చేటప్పుడు ఎదుటివాని ఆస్థి చూసే కట్టబెడతారు. నాలుగు కాసులుంటే పిల్ల జీవితం సుఖంగా వుంటుందనే తాత్కాలిక యోచన, ఐతే ఒకప్పుడు ఓడలు బండ్లు, బండ్లు ఓడలుగా మార

తాయి. అదే అంటున్నాడు "పూజ ఫలమె గాని పూనికల్ నిల్చునా" పుణ్యఫలం వుంటే అది కట్టుకున్నవాడు బీదైనా, తర్వాత కోటీశ్వరుడవ్వొచ్చు లేక కోటీశ్వరుడు వ్రాతబాగుండకపోతే పకీరవ్వొచ్చు.

166. కలిమియున్నవాని కనిపట్టి యిచ్చిన
మనసు పొంగు పాలు మరిగినట్టు
లాన నిగిరి కలిమి లొట్టపోయెడునొకో-విశ్వ.

నానా కష్టాలుపడి కోటీశ్వరుణ్ణి వెతకి, బ్రతిమలాడి బ్రాకులాడి పిల్లనిస్తే, యవ్వనం వున్నంతవరకూ ఇద్దరూ పాలు పొంగినట్టు పొంగి తర్వాత మరిగి, మరిగి ఇగుర్చుకుపోయి, వున్న కలిమి శూన్యమయ్యే ప్రమాదం కూడా ఏర్పడవచ్చు

167. మంచి శకునములనె యెంచక పెండ్లాడు
వారలొకరు లేరు వసుధలోన
జనుల కర్మములను శకునముల్ నిల్పునా-విశ్వ.

శకునాలు నిత్య జీవితంలో బాగా అలవాటైపోయింది. శకునం అంటే మంచి చెడ్డలు (శుభాశుభములు) వీటిని చూస్తేగాని కార్యాలు చేయిరు, అందులో పెండ్లికార్యం యింకా ప్రాదాన్యం. ఎన్ని శుభశకునాలు చూసి చేసినా, మానవుల కర్మల్ని అవి రక్షిస్తాయనుకోవడం వెర్రి మాటే. (వశిష్ఠభగవానంతటివాడు శుభశకునం చూడకుండా నిర్ణయించాడా రామపట్టాభిషేక ముహూర్తం).

168. విప్రులెల్ల కూడి వెర్రికూతలు కూసి
సతిని పతిని గూర్చ సమ్మతముగా
మునుముహూర్తముంచ ముండెట్లు మోసెరా-విశ్వ.

ఎన్నో లెక్కలు గట్టి క్రిందా మీదాపడి గొప్ప మహూర్తా లంటూ నిర్ణయించి పెద్దక్షరాలతో ప్రకటిస్తారు, అంతటి శుభ ముహూర్తాలు యోచించి వరుణ్ణి, వధువుని ఏకం చేసినప్పుడు ఆ వధువు ముండెందుకవాలి? అతి కొద్దిరోజుల్లోనే.

169. తాతగన్న తల్లి తండ్రిగను తల్లి
తన్నుగన్న తల్లి తల్లితల్లి
తల్లి శూద్రురాలు తానెట్లు బాపడు-విశ్వ.

అగ్ర వర్ణాలనే బ్రహ్మ, క్షత్రియ, వైశ్యలలో ఈ జందెం (యజ్ఞోపవేతం) వ్యవహారం మగవాళ్ళకే పరిమితం, ఆడవాళ్ళకి లేవు. గాబట్టి, కులానికి అగ్ర కులమైనా వాళ్ళు శూద్రులతో సమానమేనని వారి వాదన. తనని కన్నతల్లి శూద్రురాలైతే తానెలాగ బ్రాహ్మడౌతాడు.

170. జననకాలమందు జందె త్రాళ్ళను లేవు
తనదు సతికి సర్వదాను లేవు
నడుమ జందె మిడగ నగుబాటు గాదొకో-విశ్వ.

పై వర్ణాల వాళ్ళకి కూడా పుట్టినప్పుడు జంధ్యాలు లేవు. తనతో జీవనయాత్ర సాగించే భార్యకి లేదు. ఇంకా ముందుకిపోయి అంటే హిందూ ధర్మం ప్రకారం, చరమదశలో సన్యాసం స్వీకరించి నట్టయితే వున్న జందెం పీకెయ్యాల్సిందే అటువంటిది ఈమధ్య కాలంలో ఈ జందెం అవసరమేమిటో.

# వస్త్రధారణ

171. తల్లి గర్భమందు దాబుట్టినప్పుడు
మొదలు బట్టలేదు తుదకులేదు
నడుమ బట్టకట్ట నగుబాటు కాదొకో-విశ్వ.

ప్రతి మానవుడు పుట్టేటప్పుడు దిసమొలతోనే జన్మిస్తాడు. అలానే కాటిలో తగులబెట్టేటప్పుడుకూడా దిసమొలతోనే తగుల బెడతారు. అటువంటిది ఈమధ్య కాలంలో ఎందుకో ఈ బట్టలు. ఇది జీవిలో ఏకత్వ భావం పరిపూర్ణ వైరాగ్య పరిపక్వత కల్గి నపుడు ఉద్భవించే భావన

172. ఈకెలనుచు కొన్ని తోకలనుచు కొన్ని
కోకలనుచు కొన్ని గోచులనుచు
కచ్చమూయ నెన్ని కట్టడిచేసెరా-విశ్వ.

సృష్టిని పరిశీలిస్తే కొన్ని జంతువులు లేదా పశువులకు తోక తోను మర్మావయములు మూసుకోవడానికి వీలుగా సృష్టి జరిగింది. కానీ మానవులలో మాత్రం స్త్రీలైతే కోకలు, పురుషులు పంచెలు, గోచీలు ధరించాల్సిందే, ఒకప్పుడు నగ్నంగా వుండే జనులను రాజు వస్త్రాలు ధరించమని ఆజ్ఞ జారీచేస్తే, వారు వేరే మార్గం చూసు కుంటారే తప్ప వస్త్రాలు ధరించరు (బహుశా సృష్టిలో జంతువులకి మానవులకి వుండే యింగిత జ్ఞానాన్నిబట్టీ ఈ ఏర్పాటు చేసినట్టుంది).

# యోగ విశిష్ఠత

173. సిగ్గుగల దటంద్రు సృష్టిలోపలివారు
వెర్రి వేమన గని వెరుగుపడిరి
తనకు గలుసిగ్గు దైవమే యెరుగురా-విశ్వ.

నిండా మునిగిన వారికి చలి అన్పించదు అలానే తత్త్వం పూర్తిగా అవగతమైతే అతడికి యిక దేనిమీద దృష్టి వుండదు ఇక సిగ్గనేదేమిటి. వేమన తత్త్వం మూఢులకి వెర్రి వేమనగా అన్పించవచ్చు ప్రతివాడి సిగ్గు దైవానికి తెలుస్తుంది

174. సిగ్గు విడువకున్న శివసౌఖ్యమేలేదు.
తగ్గి మొగ్గకున్న సిగ్గువిడదు
సిగ్గువిడువాడె చిరకాల జీవిరా-విశ్వ.

కొన్ని కార్యాలకి సిగ్గెంత చేటో, ధైర్యమంత లాభం. దైవకృపను పొందాలి, సిద్ధత్వం కలగాలి అంటే, వాడి కార్యాలకి సిగ్గు అవరోధం కారాదు అలా చేసినవాడే నిజమైన శివయోగి ఔతాడు చిరంజీవిగా. యిదే సిగ్గునుగూర్చి ప్రాచీన నీతి శాస్త్రం—

శ్లో॥ గీతేవాద్యే తథానృత్తే సంగ్రామే రిపుసంకటే।
ఆహారే వ్యవహారేచ త్యక్త్వాలజ్జాం సుఖీభవేత్॥

సంగీతాన్ని ఆలపించునపుడు, వాద్యము వాయించునపుడు, నృత్యము చేసేటప్పుడు, యుద్ధం చేసేటప్పుడు, భోజనం చేసేటప్పుడు, వ్యవహారము జరుపునపుడు సిగ్గు విడిచి చేస్తేనే సుఖం కల్గుతుంది

175. ఆకుచాటునదగు నన్నిలోకంబులు
కొమ్మ కానరాదు బ్రహ్మకైన
కొమ్మ గానబడిన గొనియాడవచ్చురా-విశ్వ.

సిద్ధయోగులు షట్చక్రభేదన చేస్తారు. ఈ షట్చక్రాలను దళములు, పద్మములుగా చెప్పబడతాయి (చూ-హఠయోగ ప్రదీపిక) ఈ దళములు చాటుగా సర్వానికి మూలమగు ఆదిశక్తి వుంటుందని

చెప్పుతారు ఈ విషయమంతా కఠోరసాధన ద్వారా సాధించాల్సిందే. బ్రహ్మకైనా సులభంకాదు దాని కొమ్మకాన్పించాలంటే,

176. అష్టదళములకు నాధారమైనట్టి
ఆదిదేవు డొకడె యఖిలజగము
త్రయిని దాటువాడు తానెపో బ్రహ్మంబు-విశ్వ.

యోగసాధనలో అష్ట దళములనేవి చెప్పబడతాయి. వీటికి ఆధారం పరమేశుడే, త్రయిని అనగా భగవద్గీతలో చెప్పిన (1) కర్మ యోగము (2) భక్తియోగము (3) జ్ఞానయోగము అనే మూడింటిని అనుభవంగా దాటాడంటే వాడు పరబ్రహ్మత్వాన్ని పొందాడన్న మాటే

177. మనసులోని వాని మానుగా దెలిసిన
ఉర్వీజనులు వాని యోగియంద్రు
నీవు నిన్నెరుగక నీవెపో శివుడవు-విశ్వ.

తనలోని సుందరరూపమైన పరమాత్మను తెలిసికొంటే వాడి వర్తనే వేరుగా వుంటుంది. అది గ్రహించిన జనం అతనిని యోగేనని భావిస్తుంది తనలోని దైవాన్ని గుర్తించకపోతే వానికి వేరే దైవం ఎక్కడా లభించదు (రాళ్లు రప్పలు తప్ప)

178. గొఱ్ఱెలు పదివేలు కూడి యుండినచోట
తల్లి నెఱింగి వచ్చి దాని కొదమ
పరమయోగి నెఱింగి భక్తుండు వచ్చురా

మందలో గొఱ్ఱెలు అసంఖ్యాకంగా వుంటాయి ఇంచు మించుగా ఒకే పోలికలో వుంటాయి అన్ని వున్నప్పటికి గొఱ్ఱెపిల్ల

దాని తల్లి దగ్గరకే వెళుతుంది అలానే యోగులంతా ఒకేలా వున్నా వారిలో పరమయోగిని గుర్తించి అసలైన భక్తుడు వస్తాడు.

179. ప్రాణమందు శివుని భావింపనేరక
యోగ మందురేల నోగులార
యోగమందు గలదె భోగమం దున్నట్టు-విశ్వ.

తనలోని పరమాత్మను దర్శించడం చేయక, ఏదో యోగం, యోగం అంటూ కాషాయ గుడ్డలు, బర్రెలా జడలు పెంచుకుంటే ఏం ప్రయోజనం. ఆత్మలోని నిజమూర్తిని దర్శించి సంభాషిస్తే కలిగే ఆనందం యోగములో వుంటుందా.

## అయోగత్వం

180. జడలు కట్టనేల సన్యాసి కానేల
ఒడలు విరుచుకొనెడి యోగమేల
ముక్తికాంతబట్టి ముద్దాడనే కదా-విశ్వ.

శిరస్సునుండి పాదాలవరకూ తైల సంస్కారం లేకుండా జడలు పెంచుకుని, దండ, కమండల, కాషాయాంబరాలు ధరించడం ఆసనాలు వేసి ఆనందించడమే యోగం కాదు. అసలు యోగం ముక్తిమార్గం. అందన్వేషించి ముక్తి కాంతను పొందగలిగితేని యోగసిద్ధి.

181. ఆసనము పన్ని అంగంబు బిగియించి
యొడలు విరుచుకొనెడు యోగమెల్ల
జెట్టిసాముకన్న చింతాకు తక్కువ-విశ్వ.

ఏదో యోగాసనము వేసి అంగాన్ని లంగోటాలో గట్టిగా బిగించి కట్టి, ఏవేవో శారీరక భంగిమలు వేయడం మాత్రమే యోగం కాదు. ఇవన్నీ వ్యాయామకారులు చేసే, కర్ర, కత్తిసాము లాంటివి యించుమించుగా

182. ముక్కు త్రాళ్ళు గుచ్చి మురికి పోవగదోమి
కచ్చనీరు నించి కడిగి కడిగి
డొక్క తోమినంత దొరకునా మోక్షంబు-విశ్వ.

యోగులు ఆరోగ్యరీత్యా అనేక క్రియలు చేస్తుంటారు. అందులో ముక్కునందున్న రంధ్రాల్లోకి త్రాడు జొనిపి శుద్ధి చేయుట, అలానే గుదమునుండి నీటిని లోనికి తీసుకుని నేటికాలపు ''ఇనేమా'' మాదిరి ఉదర శుద్ధిని, అలానే డొక్క శుద్ధిని చేస్తూం టారు. ఇవి కేవలం ఆరోగ్య లక్షణాలే కాని, మోక్షమార్గాలు మాత్రం కాదు సుమీ.

183. యొడలు బడలచేసి యోగుల మనువారు
మనసు కల్మషంబు మానలేరు
పుట్టమీద గొట్ట భుజగంబు చచ్చునా-విశ్వ.

శారీరకంగా ఎన్నెన్నో రీతుల యోగాసనములంటూ శరీ రాన్ని అతికష్టపరుస్తూంటారు, మనస్సు మాత్రం నిష్కల్మషంగా వుంచలేరు పుట్టమీద కొట్టినంత మాత్రాన పాము ఎలాగ చావదో, అలానే పైపై శారీరక క్రియలద్వారా యోగసిద్ధి కలుగనేరదు సుమీః

184. వెన్న చేతఁబట్టి వివరంబు తెలియక
ఘృతము గోరునట్టి యతనిభంగి
తానుదైవమయ్యు దైవంబు తలచునే-విశ్వ.

చేతినిండా వెన్నముద్ద పెట్టుకుని నెయ్యి కావాలనే వాడు ఎలాంటి వెర్రివాడో అలానే తనలోని దైవాన్ని చూడకుండా గుళ్ళు గోపురాలంటూ ఊరూరా తిరిగేవాడు మూఢుడు

185. ఆకులన్ని దిన్న మేకపోతులకేల
కాకపోయెనయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెర్రిపోకిళ్ళు పోదురు-విశ్వ.

కేవలం కాయసిద్ధికోసం ముక్కు మూసుకుని అరణ్యాల్లో గాని నిర్జన ప్రదేశాల్లో గాని కూర్చుంటూ ఏదో చెట్ల ఆకులు తిన్నంత మాత్రాన కాయసిద్ధికాదు, అలాగైతే నిత్యం ఆకులు మేసే మేకపోతెందుకు కాయసిద్ధి నొందుట లేదు. మానసిక పరివర్తన కావాలి సుమా। అది లేకుండా ఆహార విహారాదులందు, ఎన్ని క్రియలు చేసినా వ్యర్థమే

186. కడుపు బోరగించి కన్నులు ముకుళించి
బిర్ర బిగిసికొన్న బీదయోగి
యముని బారిగొర్రె యతడేమి చేయును-విశ్వ.

నిత్యం కండ్లు మూసుకుని ఊపిరి బిగిస్తు కూర్చుని పరమేశ్వరైక్యం చెందాలనుకోవడం, ఏదో ఒకరోజు నిద్రాహార లోపంతో యమపురికి పోవడం తప్ప మోక్షం మాత్రం అలభ్యమే.

187. వేషభాష లెరిగి కాషాయ వస్త్రాలు
కట్టగానె ముక్తి కలుగబోదు
తలలు బోడులైన తలుపులు బోడులా-విశ్వ.

నాల్గురకాల భాషలు మాట్లాడుతూ కాషాయ గుడ్డలు కట్టి ఊరూరా తిర్గినంత మాత్రాన యోగికాడు, జుత్తు గొరిగించుకున్న

మాత్రాన శిరస్సు బోడిదవ్వొచ్చు గాని, మనస్సులోని ఆలోచనలు సమత్వసిద్ధికి చెందవుగదా బంగారాన్ని గడ్డిపరకను స్త్రీని కూడా ఒకే విధంగా (గడ్డిపరక అన్నిటికన్న హీనం (వ్యర్థం) అన్న భావంతో) చూసే స్థితి సమత్వస్థితి.

188 కారుకారు గరులు కాగుణితము జెప్ప
శాస్త్ర పారములను చదివి చెప్ప
ముక్తిదారి చూపు మూలము గురుడురా-విశ్వ.

క, ఖ, గ, ఘ, ఙ,లు నేర్పినంత మాత్రాన అతడు పరమగురువు కాజాలడు. అలాగే షట్శాస్త్రాలను ఆరోహణ, అవరోహణలో బోధించినప్పటికి అతడు నిజగురుడు కాలేడు. ముక్తికి దారిచూపే వాడే గురువు సుమీ!

189. ఛాత్ర ధర్మమెరిగి చక్కని భక్తితో
గురుని సేవజేయు గుదిరినపుడె
సర్వమర్మములును చక్కగా విడిపోవు-విశ్వ.

విద్యార్థి తనయొక్క ధర్మాలను గుర్తించి, వినయము భక్తి నిరంతర విద్యాకృషి వుండి నిష్కల్మష హృదయంతో గురుని సేవిస్తే, ఎటువంటి బ్రహ్మ విద్యైనా సూక్ష్మాతి సూక్ష్మరహస్యాలతో సులువుగా అవగతమౌతుంది.

దీనినే నీతిశాస్త్రంలో అంటాడు—

"విద్యాతురాణాం నసుఖం ననిద్రా" విద్యాపేక్షలో తపించే వాడికి సుఖము, నిద్రా అనే ప్రసక్తే వుండదు

190. గ్రాస మింతలేక కడు గష్టపడుచున్న
విద్యయేల నిలచు వెడలుగాక
పచ్చికుండ నీళ్ళు పట్టిన నిలుచునా-విశ్వ.

పచ్చికుండలో నీళ్ళు నింపితే అవి ఎలా అయితే కుండలో నిల్చియుండవో అలానే పుష్టికరమైన తిండి లేకుండా విద్య నేర్చుదా మంటే నేర్వడం కూడ బహుకష్టం ఆ విద్య నిలవదు అంటే ఒంటబట్టదు

191. గురువునకును పుస్స కూరైన నీయరు
అరయ వేశ్యకిత్తు రర్ధమెల్ల
గురుడు వేశ్యకన్న గుణహీనుడగునొకో-విశ్వ.

మన పురాణ గాథల్లో గురు శిష్యుల అవినాభావ సంబంధాలు ఎలా వుండేవో తెలుస్తుంటాయి. ఈ కాలంలో (అదే వేమన కాలం కూడాను) విద్య పూర్తయిన తర్వాత మళ్ళీ ఆ గురువు మొఖం చూడరు. అప్పు జేసైనా లంజకిస్తారు గాని విద్యాబుద్ధులు నేర్పిన గురువుకి పుచ్చు వంకాయి ఐనా యివ్వరు.

192. గురుడు తాన యనుచు గుణమించుకయు లేక
చందమామ కిచ్చె శాపమపుడు
గురుడు కోపమూన గూడ దెప్పటికైన-విశ్వ.

గురువనబడే వ్యక్తికి కోప స్వభావము అసలు వుండ కూడదు ఉదారగుణము అనంతంగా వుండాలి, ఎదుటివారు ఎంతటి పాపకర్మకి ఒడుగట్టినా క్షమించగలిగే తత్త్వం అలవర్చుకోవాలి. బృహస్పతి వద్దకు విద్యకొఱకు వచ్చి చంద్రుడు గురువు యింటి వద్ద లేని సమయంలో తనని మోహించి వలపించిన గురుపత్ని తారతో మన్మధలీలలు జరుపగా అది గ్రహించిన గురుడు ఆగ్రహంలో చంద్రుడికి శాపమిచ్చాడు. అటువంటి సమయంలోకూడా గురువు శాంతముతోనే వ్యవహరించాలంటాడు మన వేమన

193. గురుడనగా పరమాత్ముడు
పరగంగా శిష్యుడనగ పటుజీవుడగున్
గురుశిష్య జీవ సంపద
గురుతరముగ గూర్చి తనడు గురువగు వేమా॥

నిజ గురువంటే పరమాత్మ స్వరూపమే, శిష్యుడనగా జీవాత్మ, మంత్రోపాసకులు ముఖ్యంగా గురువు పాదుకాదీక్షనొందిన క్షణమునుండి గురువే సాక్షాత్తు దైవముగా ధ్యానించుట ఆచారము. గురు శిష్యులనేది ఒకవిధమైన కుటుంబ సంపద, ఇదే విషయాన్ని భర్తృహరి:—

శ్లో॥ వేదోన దీక్షన చ మండలిక్రియా
దురుర్న శిష్యోన చ మంత్ర సంచయః
ముద్రాదికంచా సినయత్ర భాసతే
తమీశమాత్మానముపై మిశాశ్వితమ్

వేదపరనము వలన, దీక్షవలన, చేసే కర్మలవలన, గురుత్వము చేతను, శిష్యత్వము చేతను గాయత్ర్యాది మంత్రముల చేతను షణ్ముఖాది ముద్రలవలనను ముక్తి లభించదు. ఏ పరమాత్మవలన ఈ లోకము నడుచుచున్నదో అట్టి శాశ్వత పరబ్రహ్మమును పొందుచున్నాననేది ఎవ్వరు తెలుసుకుంటాడో వానికే ముక్తి లభిస్తుంది. అనగా గురువునే పరబ్రహ్మంగా భావించాలి సుమా!

## మూర్ఖులు - నీచులు

194. ఎద్దుకైన గాని యేడాది తెల్పిన
మాట తెలిసి నడుచు మర్మమెరిగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన-విశ్వ.

నోరులేని పశువు ఎద్దు అటువంటి ఎద్దు సైతం ఒక సంవత్సర కాలం శిక్షణ నిస్తే ఆ ప్రకారం నడుస్తుంది. కాని మూర్ఖునికి మాత్రం ముప్పై సంవత్సరాలు నేర్పినా గ్రహించడు

195. పాముకన్న లేదు పాపిష్ఠి జీవము
అట్టిపాము చెప్పినట్లు వినును
ఇలను మూర్ఖుదెలుప నెవ్వరి వశమయా-విశ్వ.

విష జంతువులలోకెల్ల అతి భయంకరమైనది సర్పము. అందునా పాముని పగకి ప్రతీకగా వాడుతుంటారు లోకంలో. పగ అంటే కక్ష. ఈ కక్ష ఉత్తముల్లో ఒక క్షణకాలము, మధ్యమునియందు రెండు ఘడియలు, అధమునియందు ఒక రోజు, పాపిష్ఠియందు చచ్చేవరకునూ వుంటుందని అంటారు. ఈ పాముకి కూడా పగ అలా వుంటుంది. కనుకనే పాపిష్ఠి జీవమన్నాడు. అటువంట పాముకూడా నాగస్వరానికి లొంగి చెప్పినట్టు ఆడుతుంది. కానీ మూర్ఖునికి చెప్పాలంటే ఎవ్వరితరమూ కాదు సుమా.

196. పాపమనగ వేరె పరదేశమున లేదు
తాను చేయు పనుల దగిలియుండు
కర్మ మర్మములను కనలేరు మూర్ఖులు-విశ్వ.

చేసే పాపాలకి ప్రాయశ్చితములు ఎక్కడో నరకంలో వుంటాదనుకోవడం కేవలం అవివేకమే. పాప ఫలాన్ని తాను చేసే పనుల్లోనే ఎదుర్కొంటాడు. పాప, పుణ్య కర్మఫలాల్ని తెలుసుకోరు మూర్ఖులు.

197. ఎండయనక తిరుగు నిరువెరింగిన యోగి
యుండు నెల్లకాల ముర్విలోన
తిండిపోతువశమె తెలియంగ జ్ఞానంబు-విశ్వ.

కేవలము ఆత్మ తత్త్వాన్ని శోధించే యోగి ఎండా వాన అనేవి పట్టించుకోకుండా తిరుగుతాడు ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు మరిగిన తిండిపోతుకి ఆత్మజ్ఞానం గ్రహించాలంటే సాధ్యమా?

198. కపట వేషమూని కడగండ్లు పడనేల
విపిన భూమి తిరిగి విసుగనేల
యుపముతోనె ముక్తి యున్నది కనవలె-విశ్వ.

వేషాలు వేసుకుని సన్యాసులమని పైకి కన్పించేలా ఊరూరా తిరగడమెందుకు విసుగుచెందడ మెందుకు? సరియైన యోచనతో ముక్తిని పొందగలగాలి

199. పరుల దిట్టినంత పాప కర్మంబబ్బు
విడువదెన్నటికిని విశ్వమందు
పరుడు పరుడు కాదు పరమాత్మ యౌనయా-విశ్వ.

అకారణంగా పరదూషణ చేయడం మహాపాపం అది ఎన్ని పుణ్యకార్యాలు చేసినా పోయేదికాదు పరుడు అనేవాడు పరుడుకాదు పరమాత్మయే అన్న భావంతో వర్తించాలి సుమీ! యిది జ్ఞానులైనవారు నడిచే తీరు. ఎందుచేతనంటే తనలో పరమాత్మ వున్నప్పుడు ఎదుటివానిలోకూడా వుంటాడు.

200. కోతిబట్టి తెచ్చి కొత్త పుట్టముగట్టి
కొండముచ్చులెల్ల గొలిచినట్లు
నీతిహీను నొద్ద నిర్భాగ్యులుందురు-విశ్వ.

కోతిని తీసుకొచ్చి కూర్చోపెట్టి అధికారమప్పగించి, కొండ ముచ్చులన్ని కొలిచినట్టుగా వుంటుంది. నీతి లేనివాని దగ్గర చేరిన నిర్భాగ్యుల తీరుకూడా. ఎందుచేతనంటే నీతి హీనునివద్ద నీతివున్న వాడు మనలేడు

201. వేరు పురుగు చేరి వృక్షంబు జెరచును
జీడ పురుగు చేరి చెట్టు జెరచు
కుచ్చితుండు జేరి గుణవంతు జెరచురా-విశ్వ.

కొన్ని పురుగులు చెట్లయొక్క వ్రేళ్ళలో చేరి వృక్షాన్ని పాడుచేస్తాయి. చీడపురుగులు చెట్లపాదులకు పట్టి ఆ పాదుల్ని నాశనం చేస్తాయి అలానే దుష్టుడు చేరి గుణవంతుణ్ణి పాడుచేస్తాడు. దీనినే నీతిశాస్త్రంలో ఈవిధంగా చెప్తున్నాడు.

శ్లో. ధీరోఽత్యంత గుణాన్వితోపి సుగుణా
చారాఽన్వితోవా ఽథవా నీతిజ్ఞోవిధివాద దేశికవరో
విద్యావివేకోఽథవా దుష్టానామపిపాపభావితధియామ్
సంగం సదాచేద్భజేత్తద్బుద్ధ్యావ్యలిహారతో
ప్రజతింత్సామ్యం కరోతిస్ఫుటమ్॥

ఎంతటి జ్ఞానియైనా, గొప్ప గుణశాలియైనా మంచి వియమములతో వర్తించేవాడైనా, ధర్మం తెలిసినవాడైనా, కర్మశ్రేష్ఠుడైనా, ఆఖరికి బ్రహ్మవిద్య కూడా తెలిసినవాడైనా, బుద్ధివున్న దుర్మార్గులతో మైత్రి ఎల్లప్పుడూ చేసినట్లయితే ఆ దుష్టుని ప్రభావం కొంత ప్రసరిస్తుంది

202. తల్లితండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమివాడు గిట్టనేమి
పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా-విశ్వ.

తల్లి, తండ్రి ప్రతి జీవికి దైవం. అటువంటి మాతాపితృలపై ఎటువంటి దయ, కరుణ, అనురాగము లేనిచో అటువంటి కొడుకు పుట్టినా, పుట్టకపోయినా ఒకటే. అలానే చెదలు పుడతాయి చస్తాయి కాని, ఏం ప్రయోజనం? దీనినే శాంతి శతకంలో—

శ్లో॥ ధైర్యం యస్యపితాక్షమాచ జననీ శాంతిశ్చిరంగేహినీ సత్త్యం
సూనురయం దయాచ భగినీభ్రాతా మనస్సంయమః
శయ్యాభూమి తలంది శోపినసదం జ్ఞానామృతం భోజనమ్
తస్యైతేహి కుటింబినో వదసఖే తస్మాద్భయం యోగినమ్॥

ఏ పురుషునకు ధైర్యము తండ్రీ, ఓర్పు తల్లి, శాంతి భార్యను, సత్యం కుమారుడును. దయ చెల్లెలును, మనస్సుయొక్క నియమము సోదరుడును, మంచమే భూమని నలుదిక్కులు వస్త్రమును, జ్ఞానామృతమే భోజనముగా గల కుటుంబముగా గల్గిన యోగీశ్వరునకు ఏ రీతిగాను భీతి కలుగదు.

203. మ్రాను దిద్దవచ్చు మఱి వంక లేకుండ
దిద్దవచ్చురాయి తిన్నగాను
మనసు దిద్దరాదు మహిమీద నెవరికీ-విశ్వ.

వృక్షము పెరిగేటప్పుడు దాని కాండము వంకరగా వుంటే దానిని జాగ్రత్తగా కఱ్ఱ సహాయంతో నిలువుగా ఏర్పర్చవచ్చు, అలానే వంకరగా వున్న రాయిని సాపుగా చేయొచ్చు. కాని మూర్ఖత గల మనుష్యలను మాత్రం యోగ్యునిగా తీర్చి దిద్దడం ఎవ్వరికీ సాధ్యంకాదు.

దీనినే భర్తృహరి నీతి శతకంలో—

శ్లో॥ లభేత సికతాసు తైల మపి యత్నతః పీడయన్
పిబేచ్ఛ మృగతృష్ణికాసు సలిలం పిపాసార్ధితః
కదాచిదపి పర్యటన్ శశివిషాణ మాసాదయేత్
నతుప్రతిని విష్ట మూర్ఖజన చిత్త మారాధయేత్॥

గట్టి ప్రయత్నంచేత ఇసుకనుండి నూనె తీయవచ్చు. ఎండమావులలోని నీటితో దాహాన్ని చల్లార్చుకోవచ్చు. తిరిగి,

తిరిగి కొమ్ముకన్న కుందేలునైన సాధించవచ్చు కాని మూర్ఖుని మనస్సు రంజింప చేయలేము సుమీ' అంటాడు

204. 'దుండగీడు కొడుకు కొండీడు చెలికాడు
కొండరాజునకు బడుగుమంత్రి
కొండ ముచ్చునకు కోతియె సరియగు-విశ్వ.

కొడుకు దుష్టుడు వాడికి చాడీలుచెప్పే మరో నీచుడు మిత్రుడును, కొండకు మాత్రమే రాజైనటువంటి వానికి ఒక బడుగు మంత్రిను, కొండముచ్చుకి కోతి. సరియైన జోడీ సుమీ అంటే అన్నీ ఒకే తరగతికి చెందినవి నీచులు, దుష్టులు అంతా చేరితే యికవేరే చెప్పక్కర్లేదు కదా వారి భాగోతం'

205 ఓగునోగుమెచ్చు నోనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు పరమలుబ్ధు
పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా-విశ్వ.

దుష్టుణ్ణి దుష్టుడే మెచ్చుకుంటుంటాడు బురదలో దొర్లే పంది బురదగుంటనే మెచ్చుకుంటుందిగాని, సుగంధ పరిమళాలు వెదజల్లే పన్నీటిని మెచ్చుకోదుగదా! అలానే దరిద్రులు ధనంకోసం నజ్ఞానియైనా వున్నవాణ్ణి పొగడుతారు

206. మేడిపండు జూడ మేలిమై యుండును
పొట్టవిచ్చి చూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకెమలాగురా-విశ్వ.

మేడిపండు చూడడానికి చాలా మృదువుగా, అందంగా కన్పిస్తుంది కాని దాన్ని కోసిచూస్తే దాన్నిండా పురుగులుంటాయి. అలానే పైకి పెద్ద డంబాలు పలికేవాడు లోపల చాలా పిరికివాడై వుంటాడు అంటే అధికుడు అనవసరంగా వాగడుసుమీ!

# కోపం - శాంతం

207. కోటిదానమిచ్చి కోపంబు నొందెనా
సాటి సేయరతని బ్రజలు మెచ్చి
సాత్త్వక గుణములను సర్వజ్ఞుడౌనయా-విశ్వ.

కోట్ల రూపాయిలు దానం చేసినప్పటికీ కోపము పూనితే మాత్రం ప్రజలు వాణ్ణి గుర్తించరు కోట్ల రూపాయిలు యివ్వక పోయినా ఉత్తమమైన శాంత స్వభావంతో వర్తించేవాని పూజిస్తారు. సాత్త్వకత నుండే సర్వజ్ఞత సిద్ధిస్తుంది

208. కోపమునను ఘనత కొంచమై పోవును
కోపమునను మిగుల గోడుజెందు
కోపమడచెనేని కోరికెలీడేరు-విశ్వ.

ఎంతటి గొప్పవ్యక్తియైనప్పటికీ అతడు కోపంతో వ్యవహరిస్తే ఎదుటివారిలో చులకన అవ్వవలసిందే. కోపమువలన ఒక్కొక్కప్పుడు కష్టాలు ఎదుర్కోవలసొస్తుంది. కోపాన్ని నిగ్రహించి వర్తిస్తే అనుకున్నవి ఎక్రమంగా సాధించి విజయం పొందచ్చు. అందుకే "తన కోపమే తన శత్రువంటారు" పెద్దలు.

209. శాంతమే జనులను జయము నొందించును
శాంతముననె గురుని జాడతెలియు
శాంతభావ మహిమ చర్చింపలేమయా-విశ్వ.

శాంతగుణము మహోన్నతమైన ఉత్తమ గుణము దాని వలన ఎటువంటి కార్యాన్నయినా దిగ్విజయంగా పూర్తి గావించవచ్చు. ఆ శాంతములోనే గురుని పొందొచ్చు. శాంత గుణము యొక్క గొప్పతనము చెప్పనలవికానటువంటిది

210. మంచివారు లేరు మహిమీద వెదకిన
కష్టులెందరైన గలరు భుమిని
పసిడి లేదుగాని పడదెంత లేదయా-విశ్వ.

ఈ భూమిమీద వెదికితే అధిక భాగం దుష్టులే కన్పిస్తారు. మంచివారు ఎక్కడోకాని వుండుట జరుగదు బంగారము లేక పోయినా పడతులు వుంటారు అంటూ మంచివార్ని స్వర్ణంతో పోల్చాడు

## మోసము - వంచన

211. పరుల మోసపుచ్చి పరధన మార్జించి
కడుపు నింపుకొనుట కానివద్దు
ఋణము సేయు మనుజుడెక్కువ కెక్కునా-విశ్వ.

ఇతరుల్ని మోసం చేసి పైకివద్దామనుకోవడం తనని తాను వంచన చేసుకోవడమే. ఒకవేళ మోసంచేసి తాత్కాలికంగా లబ్ధి పొందినా తర్వాత నికృష్టుడుగాక తప్పదు సుమీ'

## అప్పులు - వడ్డీలు

212. అప్పుదీయు రోత హరిహరాదులకైన
మొప్పెతోడె మైత్రి మొదలెరోత
తప్పుబలుక రోత తాకట్టిడిన రోత-విశ్వ.

అప్పుచేసి బ్రతికేవాడి బ్రతుకు పరమరోత. ఆది, శివ, విష్ణువులకైన సరే రోతే నంటున్నాడు అలానే మూర్ఖుడితో స్నేహం కూడాను తప్పు మాట్లాడ్డమన్నా-తాకట్టు పడడమన్నా కూడా రోతలాంటివే సుమీ.

213. అప్పు తీర్చలేని యా నేర్పరేటికి
కోర్కె దీర్పలేని కొలువదేల
పెట్టిపోయలేని వట్టిబేరం బేల-విశ్వ.

అప్పు తీర్చలేనప్పుడు అప్పు చేయకూడదు. అప్పు చేసి తీర్చకపోవడమనేది చాలా దోషం ఆ ాసే కావలసిన కోరికలు తీర్చనప్పుడు రాజు కొలువులో వుండడం దేనికి? ఒకళ్ళకి కావలసినవి పెట్టి ఆదరించినవాడే గట్టిగా మాట్లాడాలి లేకపోతే వట్టి కబుర్లు ఎందుకు?

214. కాసివాని చేత కాసుపీసము లిచ్చి
వెంటదిరుగుటెల్ల వెర్రితనము
పిల్లితిన్న కోడి పిలిచిన పలుకునా-విశ్వ

అప్పు ఇవ్వడానికి కూడా ఒక అర్థం వుండాలి తీసుకునేవాడు బాకీ తీర్చగలడా లేదా అనేది చూసి యివ్వాలి ఇవ్వలేనివాని కిచ్చి వాడికూడా తిరగడం వ్యర్థం, అవివేకము, అది కోడిని పిల్లి తినిన తర్వాత బో, బో, అంటే కోడి పిల్లి నోటినుండి రాదుకదా!

# మెట్ట వేదాంతం

215. తనువు లస్థిరమని ధనము లస్థిరమని
తెలుపగలడు తాను తెలియలేడు
చెప్పవచ్చు పనులు సేయుట కష్టమౌ-విశ్వ.

* నీతివాక్యాలు వల్లించే అయ్యవార్లు చాలామంది వుంటారు. కాని చెప్పే ధర్మాలు-నీతులు ఆచరణ చేసేవారు మాత్రం చాలా

* 'సింపుల్ లివింగ్ అండ్ హై థింకింగ్' అనేది వారి ఊతపదము మాత్రమే.

అరుడు లండుకే ఉంటాడు "చెప్పేవన్నీ శ్రీరంగ నీతులు, దూరేవి దొమ్మరగుడిశెలు" అని చెప్పటం ప్రతివానికి తేలికే కాని చేయడమే కష్టము

## విగ్రహారాధన

216. శిలను ప్రతిమచేసి చీకటింటను బెట్టి
మ్రొక్కవద్దు వెర్రి మూఢులార
జీవులందెగాని శిలలందు లేదయా-విశ్వ

ఓ నల్లరాతిని తమ నచ్చిన ఆకృతిలో మలిచి దానిని గాలి వెలుతురు లేని చీకటిగా వున్న ఆలయంలో పెట్టి, ఒక నూనెదీపం మాత్రమే వుంచుతారు మళ్ళీ వెలుతురు అధికంగా వుంటే దైవం మీద దివ్యానుభూతిలో కూడిన నమ్మకం కల్గదని కాబోలు కానీ, యివన్నీ మూఢత్వానికి చిహ్నాలు దేవుడనేవాడు ఎక్కడోవుండడు ఆ జీవిలోనే వుంటాడునుమీ అదే గ్రహించాలి

217. రాయియగు నహల్య రాము పదము సోకి
అడదయ్యె నందు రవని జనులు
శిల్పిపదము సోకు శిలలెట్లు దేవులౌ-విశ్వ.

రాయిగా మారిన అహల్య శ్రీరాముని పాద స్పర్శచే తిరిగి మానవరూపం ధరించింది. అటువంటిది శిల్పుల చేతులు సోకిన శిలలు దేవుళ్ళు ఎలా అవుతారో మూఢులారా!

218. రాళ్ళుదెచ్చి నరులు రమ్యమౌ గుడికట్టి
రాతిప్రతిమ చేసి ఖ్యాతిగాను
దేవుడనుచు మ్రొక్కి దీపించి పల్కునా-విశ్వ.

ఎక్కడెక్కడి రాళ్ళో తెచ్చి ఎంతో వ్యయ ప్రయాసలతో శిల్ప చాతుర్యంలో అద్భుత సౌందర్యంతో గుళ్ళు నిర్మిస్తారు. ఐనంత మాత్రాన ఆ గుళ్ళో తాము పెట్టిన రాతిబొమ్మకు మ్రొక్కితే దీవించు తుందా? వెర్రిగాని

219. రాతిబొమ్మకేల రంగైన వలువలు
గుళ్ళుగోపురములు కుంభములును
కూడు గుడ్డ తాను కోరునా దేవుడు-విశ్వ.

రాతి బొమ్మలకి ఎన్ని అందమైన వస్తు, వస్త్రాది రంగు రంగుల హంగును చేస్తేమాత్రం ప్రయోజనం ఏమిటి పరమాత్మ అనేవాడు కూడు గుడ్డా పెట్టమని అడుగుతాడా'

220. గుడులు దేవతలని గుర్తులుగావింత్రు
ముష్టిబాపలనుచు మూర్ఖనేల
మొప్పెలకును దారిజెప్పిన ప్రాజ్ఞత-విశ్వ.

ఏవేవో స్థల పురాణాలు చెప్తుతూ జనాలని ఏదో విధంగా భ్రమకి లోనయ్యేటట్టు చేస్తూ మూఢత్వాన్నే నూరిపోస్తారేగాని, మూర్ఖులకు దారి చూపించే ప్రాజ్ఞులుగారు పౌరాణికులు

221. శివలింగపూజ జేసెడివారికి
శిలలు రూపమందు చింతయేల
చెలగి మధువుగ్రోల చేదు రుచించునా-విశ్వ

శివపూజను మనసా, వాచా, కర్మణా చేసే యోగులకు లింగము ఏ రూపంలో వున్నదో అనే ప్రసక్తేలేదు. కేవలం పరంజ్యోతిని ధ్యానించడమే, ఉత్సాహంతో మధువు త్రాగే సమయంలో చేదు రుచించని విధంగా.

222. బండె త్రాళ్ళుదెచ్చి బంధించి కట్టంగ
లింగడేమి చేసె దొంగతనము
ఆత్మలింగమునకు నర్పింపనేరము-విశ్వ.

దొంగతనం చేసినవాణ్ణి త్రాడుతో స్తంభానికో, చెట్టుకో కట్టి శిక్షించడం పరిపాటి. అటువంటిది, ఏ దొంగతనము చేయని లింగణ్ణి (శివుణ్ణి) త్రాడుతో కట్టడమెందుకు శివభక్తులు, లింగధారలు శివలింగాన్ని త్రాడుతో కట్టుకుని మెడలో వేసుకుంటారు, యిటువంటి కృత్రిమ కార్యమువలన లింగడు దగ్గరున్నట్టు భావించడం వ్యర్థం. ఆత్మలింగాన్నే ధర్శింపాలి అదే లింగదర్శనం.

223. బట్టత్రాళ్ళతోను బంధించి కట్టగా
లింగ దెవరిసొమ్ము దొంగలించె
ఆత్మలోని లింగ మటులె నుండునా-విశ్వ.

వీరశైవంవారు శివలింగాన్ని అతిభద్రంగా గుడ్డచుట్టి యితరులకు దాన్ని కన్పించనీయకుండా త్రాడుతో మెడలో కట్టుకుంటారు. ఆత్మలో నున్నటువంటి లింగము యీవిధంగా వుండదుసుమీ'

224. దశము యేకాదశి యని వ్రతములఁ బూని
మెతుకు దినకున్న దుర్గుణ యడఁగునె
పుట్టపైఁ గొట్ట మరగంబు గిట్టబోదు
తీరెఱుంగని మౌఢ్యమీ తెఱగె వేమ.

హిందూవ్రతాల్లో,*తిధులన్నిటిమీద ఏదో ఒక వ్రతం వుంది. అలా అని దశమి, ఏకాదశి అంటూ ఉపవాసాలతో వ్రతాలు చేయడం వలన ఒరిగేది ఏమీలేదు క్షుద్బాధ, ఆరోగ్యభంగం తప్ప యిది ఎటువంటిదంటే పాముని చంపాలని పుట్టమీద కొట్టడంలాంటిది సుమీ!

* మాకు తెలిసి సుమారు 400 వరకూ ఉన్నవి.

# ఆత్మ - పరమాత్మ

225. * దేవుడనగ వేరుదేశమందున్నాడె
దేవుడనగ తనదు దేహమందు
వాహనంబులైదు వడితోలుచున్నాడు-విశ్వ.

దేవుడనేవాడు ఎక్కడో వేరే లోకంలో వుండడమనేది వట్టి భ్రమ మాత్రమే. పరమాత్మ ప్రతి జీవిలోనూ వుంటాడు పంచ భూతములనే వాహనములపై జీవిని ఎక్కించి తోలుతూ వుంటాడు

226. బ్రహ్మమేదదనుచు పలుమారు నాడేరు
వెఱ్ఱి మూర్ఖజనుల విధముజూడ
బ్రహ్మ మన్నిటందు పరిపూర్ణమై యుండు-విశ్వ.

బ్రహ్మం, పరబ్రహ్మం అంటూ నాలుకపై పదేపదే ఉచ్చరించడం తెలుసు కొందరి మూఢులకు, కాని అది ఏమిటో గ్రహించరు బ్రహ్మమనే పదార్థము అన్నిటా పరిపూర్ణంగా నిండి వుంటుంది.

దీనినే శ్రుతి ఈవిధంగా చెపుతోంది—

శ్లో॥ తిలేషు తైలం దధినీవసర్పిరాపః స్రోత్రః
సర్వాణీషుచాగ్ని ఏమమాత్మాని గృహ్యతేశౌ॥

అనగా నువ్వులయందు నూనె, పెరుగునందు వెన్న (నెయ్యి) భూమియందు నీళ్ళు, కట్టెయందు అగ్ని ఏరీతిగా వుండి యున్నదో ఆ ప్రకారమునే ఈ శరీరమునందు పరమాత్మ వుండి యున్నాడు సుమీ. ఇదొక గొప్ప తార్కాణము.

---

* సర్వ వేద వేదాంత ఉపనిషత్సారము ఈ ఒక్క పద్యములో ఇమిడియున్నది

# ధన ప్రాముఖ్యత

227. ధనము లేమి యనెడి దావానలంబది
తన్ను జెరుచు మీరి దాపుజెరుచు
ధనము లేమి మదిని తలచిన పాపంబు-విశ్వ.

ధనమనేది మానవ మనగడకు అత్యవసరం ఐతే ధనలేమి అనేది దావానలం (కార్చిచ్చు) అది తనని తోటివారిని కూడా యిబ్బందికి గురిచేస్తుంది బీదరికం మనసులో తలుచుకోవడం ఒక పాపం, అంటే ధనం లేకపోతే ఎంత భయంకర కష్టంగా వుంటుందో చెప్తున్నాడు.

228. ధనమే మూలము జగతికి
ధనమే మూలంబు సకల ధర్మంబులకున్
గొనమే మూలము సిరులకు
మనమే మూలంబు ముక్తిమహిమకు వేమా.

ధనమే ఈ ప్రపంచాన్ని నడుపుతుందని లౌకిక వాదం. సర్వ కార్యాలకి ధనమే ఆధారం ఒకటేల సమస్తము ధనముపైనే ఆధారపడి యున్నది.

దీనినే భర్తృహరి నీతిశతకంలో —

శ్లో. యస్యాస్తి విత్త సనరః కులీనః
సపండిత స్సశ్రుతవాన్ గుణజ్ఞః
సఏవ వక్తాసచ దర్శనీయః
సర్వేగుణాః కాంచన మాశ్రయన్తి

* గొనము = శీలము, గుణము.

సర్వగుణములు బంగారాన్ని ఆశ్రయించిన రీతిగా, ఎవడు ధనవంతుడో వాడే ఉత్తమ వంశజుడు. వాడే శాస్త్ర పరనా ప్రకటిత ప్రకండుడు వాడే పూజింపదగినవాడు వాడే గొప్పవక్త, ప్రజ్ఞానిధి పుణ్యాత్ముడు కూడాసుమీ' కావున ధనంలోనే సర్వశుభలక్షణ యశోశోభితము అబ్బుతుంది

229. కులము గలవారు గోత్రము గలవారు
విద్యచేత విఱ్ఱవీగువారు
పసిడి కల్గువాని బానిసకొడుకులు-విశ్వ.

ఎంత అగ్ర వర్ణంవాడూ. గొప్ప గోత్రం అనేవారూ షట్శాస్త్ర పాండిత్యం సంపాదించి విద్యాశేఖరునిగా వెల్గొందినా, ధనం లేకపోతే యివన్నీ వ్యర్థమే ధనంకోసం ధనవంతుణ్ణి ఆశ్రయించాల్సిందేసుమీ!

230. కులములేనివాడు కలిమిచే వెలయును
కలిమిలేనివాడు కులము దిగును
కులము కన్న భువిని కలిమి ఎక్కువ సుమీ-విశ్వ.

కులం గొప్పది కాకపోయినా డబ్బుంటే గొప్ప హోదాతో సంఘంలో చెలామణీ అవ్వొచ్చు. కానీ డబ్బులేకపోతే ఎంతటి ఉన్నత కులమైన విలువ లేనట్టే కులం కన్నా ధనమే ఎక్కువ విలువైనది సుమీ'

శ్లో. జాతిర్యాతురసాతలంగుణ స్తత్రాప్య ధోగచ్ఛతాత్
శీలం శైలతటాత్పత తత్వభిజన స్సందహ్యతాం వహ్నినా
శౌర్యేవైరిణి వ్రజమాశు నివతత్వర్థోస్తునః కేవలం
యేనైకేన వినగుణా స్తృణలవ ప్రాయాస్సమస్తాఇమే.

ఒకప్పుడు కులము చెడినా, బుద్ధి క్షీణించినా మిగిలిన యింకేమి నీచస్థితికి పోయినా ధనమొక్కటి వున్నచో చాలు. మిగిలినవి ఏమీ అక్కర్లేదు. కాబట్టి ఎన్ని మంచి గుణములు వున్నప్పటికీ ధనము లేకపోతే అవన్నీ నిష్ఫలమే

## దానం - ధర్మం - లోభం

231. పెట్టి పోయలేని వట్టిదౌబెలు భూమి
పుట్టనేమి వారు గిట్టనేమి
పుట్టలోన చెదలు పుట్టవా గిట్టవా-విశ్వ.

దానం, ధర్మం అనేవి మానవ మనుగడకు ప్రధానములు. భూతదయ కలిగి వుండాలనేది అమూల్య వాక్యం అందుకే ఒకరికి పెట్టి పోయలేని అధములు భూమియందు వున్నా లేకపోయినా ఒకటే, పుట్టలో వుండే చెదపురుగుల్లా

232. దానములను జేయధర చేతులాడక
బహుధనంబు గూర్చి పాతిపెట్టి
తుదను దండుగనిడి మొదలుగా చెడునరుడు-విశ్వ.

చూస్తూ చేత్తో ఎదుటివాడికి ఒక రూపాయి సహకరించడానికి చేతులు రావు. నానా కష్టాలు పడి దాస్తే ఆఖరికి ఆ సొమ్మును ఎవడో ఎత్తుకుపోవడమో, లేక మోసగాని చేతిలో పెట్టి మోస పోవడమో జరుగుతుంది.

233. దాతలేని కొంప దయ్యాల పెనువాడ
నీతిలేని మాట రాతివేట
ప్రీతిలేని లంజె ఘాతకియై తోచు-విశ్వ.

దానం, ధర్మం చేయని యింటికి జనరద్దీ ఉండక బితుకూ బితుకూ మంటూ వుంటుంది. నీతిలేని మాట ఎట్లాంటిదో అలానే, ఇష్టంలేని వేశ్య పరమ కిరాతకిగా అన్పిస్తుంది.

234. అన్న మరుగనతని కన్నంబు పెట్టిన
పారవేయు దాని ఫలితమేమి
ధనికునకు నొసంగు దానంబు లారీతి-విశ్వ.

ఆకలితో వున్నవాడికే అన్నం విలువ తెలుస్తుంది. అందుకే అన్నమో రామచంద్రా! అనేవాడికి అన్నం పెట్టుటకంటే మించిన దానం లేదు. వూరకనే మిగిలినదల్లా నేలపాలు చేస్తే ఏమి ప్రయోజనమో డబ్బున్న వాడికే దానమివ్వడం కూడా అలాంటిదే, అలానే అవసరానికి సహాయం చేయడంలోనే అర్థం పరమార్థం రెండూ వుంటాయి.

235. అన్న మిడుటకన్న నధిక దానంబులు
ఎన్ని చేయనేమి యెన్నబోరు
అన్నమెన్న జీవ నాధారమౌనయా-విశ్వ.

అన్నదానానికి మించిన దానం లేదు. ప్రతి జీవికి తిండి, నీరు, గాలి, ప్రధానం. ఆ తర్వాతే బట్ట, గూడు వంటివి, ముందు తిండి కనుక ఆకలన్న వాడికి అన్నం పెట్టాలి సుమీ!

236. తనదు భ్రాతలెల్ల దానంబు సేయంగ
తనకు ఫలమటంచు మినుకరాదు
తనదు కాలు గోయ తన తమ్ముడేడ్చునా-విశ్వ.

అన్న, తమ్ముడు దానం చేస్తున్నాడు కదా' ఇక మన మెందుకు దండగ అనుకోవడం అవివేకం సుమీ! తన కాలు తెగితే తనే బాధపడతాడు గాని తమ్ముడు బాధపడడు కదా!

237. తాము గడనసేయు ధనమెల్ల తనదని
నమ్మియుంద్రు వెర్రి నరుల భువిని
తామొరుల కొసంగ తమకదియే గల్గు-విశ్వ.

తాము కష్టపడి గడించినదల్లా తమకు శాశ్వతంగా లభించిన ఐశ్వర్యంగా చూసుకుని మురిసిపోతుంటారే గాని యిది మనకూడా పోయేటప్పుడు రాదు అని భావించరు. ఎప్పుడు వాడు చేసే దానం, ధర్మం ఎంతుందో అదే వాడికి నిజమైన జన్మ జన్మల ఆస్థి. ఇది గ్రహించి మెలిగినవాడే జ్ఞాని.

238. తనదు సొమ్ముజాడ దానమియ్యగ వచ్చు
అవని దొడ్డగాద దైవంకైన
అదురు బెదురులేక యన్యుల సొమ్ముల
దానమిచ్చువాడు దాత వేమ.

తను కష్టపడి సంపాదించిన దానినుండి దానంచేస్తే దాని ఫలం దక్కుతుంది. అంతేగాని అన్యాయంగా ఎదుటివాడి సొమ్ము చేజిక్కించుకునో లేక, వాని సొమ్ము తనపేరుమీద దానం చేయడమో చేయుట ఫలశూన్యమే అందుకే అంటాడు నీతి శాస్త్రంలో—

శ్లో॥ ఉత్తమం స్వార్జితం విత్తం
మధ్యమం పితురార్జితం

అధమం భ్రాతృ విత్తంచ
స్త్రీ విత్త మధమాధమమ్॥

తాను సంపాదించినదే ఉత్తమం తండ్రి ఆస్థి మధ్యమం, సోదర ఆస్తి అధమం, భార్య లేదా అన్య స్త్రీ ఆస్థి నీచము యిది గ్రహించి పురుషుడు వర్తించాలి.

239. ద్రోహ బుద్ధినైన దొంగరికెమునైన
నటలనైన సాహసమునైన
సంపదధికు వలన సాధించి ధనమును
బడుగునకు నొసంగు బాగువేమ.

సొమ్ము ఒకర్ని మాయచేసి సంపాదించినా, లేక దొంగలించినా లేక బెదిరించి లాక్కున్నా, లేక ఇంకే విధంగానైనా సరే వున్నవాడి దగ్గరనుండి సాధించి ఆ ధనాన్ని బీదవాడికి పంచమంటున్నాడు.

240. తండ్రి సొమ్మునైన దాయాది సొమ్మైన
పరుల సొమ్మలైన ప్రాప్తధనము
దయను దీనులకును దానమిచ్చినవాడె
బహుళ పుణ్యజనుడు పరగవేమ.

సొమ్ము తన తండ్రిదైనా, లేక బంధువులదైనా కాక ఇతరులెవ్వరిదైననూ పొందిన ధనము దయతో దీనులు, నిర్భాగ్యులు, క్షుదార్తులు ఐనవారికి దానం చేసినవాడు గొప్ప పుణ్యజనునిగా భావిస్తాడు.

241. అర్థవంతు సొమ్ము నాశింతు రర్థుల
యర్థికీని సొమ్ము వ్యర్థమగును
వ్యర్థమైన సొమ్ము వ్యర్థులజేరురా-విశ్వ.

ధనవంతునినుండి ధనాన్ని ఆశిస్తారు జనులు. తమ యిక్కట్లను తీర్చుకొనుటకు కనీసావసారములకు ఆశించే జనులకు యివ్వని సొమ్ము వ్యర్థమే అంటే అది ఆఖరికి నిష్ఫలంగా నాశనమౌతుంది.

242. అరయనాస్తియనక యడ్డుమాటాడక
తట్టుపడవమదిని తన్నుకొనక
తనది కాదనుకొని తాబెట్టునదె పెట్టు-విశ్వ.

సంపాదించిన ధనాన్ని తన అవసరాలని తీర్చుకుని మిగిలినది లేనివానికి పెట్టటం ఉత్తమ లక్షణం, కాబట్టి అయ్యో యింత కష్టపడి సంపాదించాం, ఇది వూరకనే ఇంకొకరికి ఇవ్వడమా అనే దిగులుతో వుండక ఇది మనకి శాశ్వితం కాదు. చేసే ధర్మమే సహాయమే శాశ్వితమనే భావంతో పెట్టాలి. అందుకే ''ధర్మో రక్షతి రక్షితః'' అని శ్రుతి ధర్మాన్ని రక్షించి నట్టయితే అదే మనల్ని రక్షిస్తుంది సుమాః అని చెప్తోంది.

243. ఇచ్చువాని చెంత యీని వాడుండెనా
చచ్చుగాని ఈవి సాగనీడు
కల్పతరువు కింద గచ్చచెట్టున్నట్టు-విశ్వ.

దానం ధర్మం చేసే గొప్ప దాత వున్నప్పటికి అతడి దగ్గఱ ధర్మహీనుడు, లోభి, కుత్సితుడు అనేవాడు వుంటే ఇక ఆ దాతనుండి చిల్లుకాణీ కూడా ఎవ్వరికీ అందదు.

244. అరుదుగా నడిగిన అతడర్థికాబోడు
తరుచుగా నొసగక దాతగాడు
దాత కర్థికింత తారతమ్యముసుమీ-విశ్వ.

ఎప్పుడో ఉప్పెనొచ్చి ఊళ్ళూ, ఇళ్ళూ కొట్టుకుపోయినప్పుడు మాత్రమే సహాయం కోరేవారు అర్థులు అన్పించుకోరు. ఎందుచేత నంటే వారిది ఒకేమారు అలానే ఎప్పుడో నీళ్ళు ఎద్దడిగా వుందని వాడలోని వారికి నీళ్ళిచ్చినంత మాత్రాన వాడు దాతగాడు. అనగా వున్నంతలో నిత్యం దానం చేసేవాడే దాత, సహాయాన్ని ఎల్లప్పుడూ పొందేవాడే అర్థి అనబడతాడు

245. గొడ్డుటావు బితుక కుండ గైకొనిపోవ
పళ్ళ నూడదన్ను పాలనీదు
లోభివాని నడుగ లాభంబు లేదయా-విశ్వ.

పాలు వర్థిపోయిన గొడ్డావుదగ్గరికి పాలు పితకడానికి కుండ పట్టుకు వెళ్ళితే అది పాలివ్వదు సరికదా, మూతిమీద తన్నుతుంది పళ్ళనీ వూడేటట్టు అలానే పిసినిగొట్టుని ఎంత అర్థించినా ఫలం శూన్యమే కంఠ శోష తప్ప

246. పిసినివాని యింట పీనుగు వెడలిన
కట్టె కోకలకును కాసులిచ్చు
వెచ్చమాయె నునుచు వెక్కి వెక్కి యేడ్చురా-విశ్వ.

పిసినిగొట్టువాడు చూస్తూ ఏ ఖర్చు చేయాలన్నా సహించ లేడు, మానవునికి ఆఖరి ఖర్చు శ్మశానమందు శవ దహానానికి అయ్యే కట్టెల ఖర్చు. అది వున్నవాడికి, లేని వాడికి, ఎవ్వడికీ తప్పదు. అటువంటి ఖర్చుకి కూడా లోభి ఎంతో దుఃఖిస్తాడు కదా! లోభత్వము అంతటి నీచమైనదని చెప్తున్నాడు.

247. లోభివాని జంప లోకంబు లోపల
మందు వలదు వేరుమతముగలదు
పైక మడిగినంత భగ్గునపడి మచ్చ-విశ్వ.

ఎవరినైనా శత్రువులన్న వాళ్ళని చంపాలంటే అనేక మార్గాల్లో మందుపెట్టి (విష ప్రయోగం) చంపడం గోప్యమైనటు వంటిది, లోభిని చంపాలంటే విషం కూడా పెట్టాల్సిన పని లేదంట లోభిని డబ్బు అడిగితే ఇవ్వడానికి చేతులు రావు, ఇస్తే తట్టుకో లేడు ఈ ఘర్షణ మధ్య మానసికంగా క్షీణించి చస్తాడు, అంతే డబ్బుకి ప్రాణానికి అంత లంకె వుంటుంది లోభి విషయంలో

248. ధనము కూడబెట్టి ధర్మంబు సేయక
తాను దినక లెస్స దాచుగాక
తేనె నీగ కూర్చి తెరువరి కీయదా-విశ్వ.

తేనెటీగలు తేనెనంతా తేనె పట్టులో నింపుతాయి ఎక్కడెక్కడో పుష్పములపై ఆఘ్రాణించిన మకరందాన్ని, ఆఖరికి ఆ తేనె తుట్ట మనుషుల హస్తగతమౌతుంది అలానే కూడబెట్టిన సొమ్ము దానధర్మాలు చేయక ఆఖరికి దొడ్డిదారిని దొంగలుపాలే, దీనినే భర్తృహరి నీతి శతకంలో—

శ్లో॥ దానం భోగో నాశస్తి స్రోగతయో భవన్తి విత్తస్య।
యోన దదాతి న భుంక్తే తస్య తృతీయాగతిర్భవతి॥

అనగా మనుజులు సంపాదించినటువంటి ధనానికి మూడు గతులు కల్గుతాయి (1) దానం రూపంగా యితరుల కిచ్చుట (2) వున్నదంతా భోగాలకై ఖర్చులు చేయుట (3) ఒకప్పుడు నిరుప యోగంగా నశించుట అనేవి, అన్యులకు ధానము యివ్వక, తాను అనుభవించక వ్యర్థం చేస్తాడు లోభి.

249. చేత ధనముపెట్టి చేరి ధారను బోసి
చెల్లు దానములను జేసుగాని
యొరులు తనదు భావ మొక్కటి తెలియరో-విశ్వ.

దాన మిచ్చేటప్పుడు పెద్ద అట్టహాసంగా ఓ తంతు చేసే ఆచారాలు మన పురాణాల్లో అధికంగా కన్పిస్తాయి. ఎవరికైనా దానం చేస్తున్నప్పుడు ఆ విషయాన్ని సంకల్పం చెప్పి నీటిని దారగా అవతల దానం పట్టే వారి చేతిలో పోయడం చేస్తారు. ఇలా చేస్తే ఆ దానం చెల్లినట్లు కాబోలు.

250. గంగపారుచుండు కదలని గతితోడ
మురికికాల్వ పారు మ్రోతతోడ
దాత యోర్చినట్ల ధముడోర్వగాలేడు-విశ్వ.

గంగానది ప్రవాహం ఒక గతితో చూడడానికి కన్నుల విందుగా కన్పిస్తూంది. కాని మురికి కాల్వ అతి చిన్నదై యుండి పెద్ద రొద చేస్తూంటుంది. అలానే దాత అనేవాడు ఏంతటి త్యాగానికైనా ఓర్చుతాడు, ధైర్యం సడలదు, కాని అధముడు చిల్లుకాణీకి కూడా ప్రాణం పోయినంత బాధ చెందుతాడు

## కులము - వ్యవస్థ

251. ఉర్వివారికెల్ల నొక్క కంచముబెట్టి
పొత్తుగుడిపి కులము పొలయజేసి
తలను చెయ్యిబెట్టి తగనమ్మ జెప్పరా-విశ్వ.

కులము - వర్ణము అనే విభజన వచ్చేసరికి ఎంతటి గొప్ప వారికైనా, మరెంతటి స్నేహశీలురకన్నా కొంతలో కొంత భేదాభిప్రాయం కల్గటం జరుగుతుంది, దీనినే అందరికి ఒకచే కంచంలో భోజనం పెట్టి, కులం వర్ణం అనేదాన్ని తగలబెట్టమంటున్నాడు.

252. బాపడనగనేమి భక్తుడనగనేమి
భోగియనగనేమి సొంపులేక
ఎన్ని పేరులైన ఇనజుడు పనితీర్చు.

బ్రాహ్మణుడుగాని, భక్తుడుగాని భోగిగాని ఎవ్వరినైనా యముడు తీసికెళ్ళక తప్పదు. అటువంటిది, ఈమధ్య నొచ్చిన ఈ కులాల రొంపి ఎందుకోసమో, దీని జాఢ్యం మానవ పురోభివృద్ధి, సంఘ శ్రేయస్సుకి పెద్ద అంటువ్యాధి సుమీ'

253. రామనామ పరన మహిమచే వాల్మీకి
పరగ బోయడయ్యు బాపడయ్యె
కులము ఘనముగాదు గుణము ఘనంబురా-విశ్వ.

రామనామాన్నే సదా జపించి, తత్ప్రభావంతో ఋషియై సుప్రసిద్ధమైన మహా కావ్యం రామాయణాన్ని రచించాడు బోయ కులంలో పుట్టిన వాడైన వాల్మీకి. దీనినిబట్టి ఆలోచిస్తే కులముకాదు గొప్ప, * గుణము అన్నది ఋజువౌతోంది

254. మాలవాని నేల మహిమీద నిందింప
నొడల రక్తమాంస మొకటిగాదొ
వానిలోన వెలుగు వాని కులంబేది-విశ్వ.

మాలవాడు అంటరాని వాడంటూ యోచించేవారు చాలా మూఢులు. వానిలో వున్న తేడా ఏమిటి రక్తంలో మార్పులేక, మాంసలో మార్పు రెండూ ఒకటిగావా?

---

* గుణము = జ్ఞాన సంపద

# భూతదయ

255. చంపదగిన యట్టి శత్రువు తనచేత
చిక్కెనేని కీడు సేయరాదు
పొసగమేలు చేసి పొమ్మనుటే చాలు-విశ్వ.

భూతదయ అనేది మానవునికి చాలా ఉత్తమగుణం అందుకే చంపవలసినంతటి శత్రువైనా వాడు చేజిక్కినప్పుడు వానికెటువంటి కీడు సేయక వీలుంటే కొంత మేలుచేసి సాగనంపడం ఉత్తమలక్షణం. దీనివలన ఆ శత్రువు ఆనాటినుండి మనసు ద్రవించి పరమ మిత్రు డౌతాడు సుమీ ఇది గొప్ప సత్యం

256. జీవి జీవి జంప శివుని జంపుటెయగు
జీవుడరసి తెలియ శివుడుకాదె
భావమందు వేగ పరికించి చూడరా-విశ్వ.

ఒకణ్ణి ఒకడు చంపుకోవడం పరమాత్మను చంపుతున్నట్టే ఎందుచేతనంటే ప్రతిజీవిలో పరమాత్మ ఉంటాడని తెలిసినపుడు, హింసకార్యమనేది మహాదారుణచర్య సుమీ.

257. పంచమ నిగమంబు భారతం బగునని
పొగడి రేల జనులు బుద్ధిలేక
హింసకార్యము తమకిష్టమే లాయెరా-విశ్వ.

మహాభారతాన్ని పంచమ వేదంగా చెప్పడం పరిపాటి. ఆ భారతంలో వున్నదేమిటి అని చవిచూస్తే అన్నదమ్ముల కొట్లాట, యిటువంటిదానినా ఐదవ వేదంగా పరిగణించేది అంటూన్నాడు యిది వాస్తవమేకదా!

* వేదములు నాలుగు 1 ఋగ్వేదము 2 యజుర్వేదము 3 సామ వేదము 4 అథర్వణ వేదము.

# వేమనగూర్చి చేసిన
# పరిశోధకులు - విమర్శకులు

ఇప్పటివరకూ ఈ వేమన యోగిని గూర్చి చేసినంత మంది పరిశోధకులు యింక ఏ యితరకవిని గూర్చి కూడా చేసియుండరని చెప్పవచ్చు.

అలా యితర తెలుగు కవులగూర్చి పరిశోధనలు చేసినా అవి బహుశా ఒక తెలుగువారే తప్ప అన్యులు తక్కువ, కానీ వేమన గూర్చి తెలుగువారికన్న ప్రాశ్చాత్యులు అధికంగా చేసినట్లు తెలుస్తోంది.

యూరోపియనులు వేమనను ప్రపంచ మహాపురుషుల స్థానంలో కూర్చుండబెట్టారు. ఇది తెలుగుజాతికేగాక, భారత జాతికే గర్వకారణము.

## జె. ఎ. దుబాయ్ (J A DUBHAI)

* పరాసు పండితుడు ఇతడు ప్రప్రథమంగా 1816 లో వేమన పద్యాల్ని ఫ్రెంచిభాషలోకి అనువదించిన వ్యక్తి.

## మేజర్ ఆర్. ఎం. మేగ్డోనాల్డ్
## (Major R. M. MAGDONALD)

ఈ మహానుభావుడు వేమనయోగి సాహిత్యాన్ని అవిశ్రాంతంగా పఠించి, అనితర శోధన గావించి, పిదప వేమన చారిత్రక విషయాలను తీవ్రంగా పరిశీలించి అనేక విషయాల్ని వెల్లడించినవాడు.

---

* పరాసు = ఫ్రాన్స్

## చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్
## (CHARLES PHILLIPS BROWN)

ఇతని గూర్చి కొంత చెప్పుకుందాం, ఈ మధ్యకాలంలో తెలుగుజాతికి, తెలుగువాడికన్న ఎక్కువగా భాషాభిక్షపెట్టిన ఆంధ్ర వాఙ్మయ దాత అనడంలో తప్పు లేదనుకుంటాను. వేమనను గూర్చి తెలుగువాడికి చెప్పి, *కుకవుల కీర్తులకు భంగము వాటిల్లునను నెపంతో చరిత్రకు మరుగై ఎంతో కాలంగా అణగత్రొక్కబడివున్న నిత్య నూత్న చైతన్యవంతమైన వేమన వేదాన్ని బైటికి వెలికితీసి, దానికి రూపంతెచ్చి, పునర్జన్మ ప్రసాదించిన సాహితీ ధన్వంతరి

ఈ బౌన్ పండితుని కృషిమూలంగా 1829 లో వేమన పద్య సంకలనాన్ని తెలుగుజాతి ప్రప్రధమంగా దర్శించి పఠించే భాగ్యం కల్గింది, మళ్ళీ తర్వాత పది సంవత్సరాలకి బ్రౌన్ 1839 లో ద్వితీయ ముద్రణ గావించాడు దీనిలో వేమన సాహితీ సౌరభ్యం ఆంధ్ర భూమి నలు చెఱవులా వ్యాపించింది ఈ రోజున తెలుగునాడులో వేమన పద్యం గూర్చిగాని, వేమనను గూర్చిగాని తెలియనివారు లేరు వేమన నేడు తెలుగునాడే కాదు ప్రపంచంలోనే విప్లవ కవిగా, ప్రజా కవిగా అగ్రస్థానంలో కొనియాడబడుతున్నాడు ఈ కీర్తి చంద్రి కలకు అగ్రతాంబూలమునకు అర్హతగల వ్యక్తి శ్రీ సి పి. బ్రౌన్ అని నిస్సందేహముగ చెప్పవచ్చును.

## విన్సెంట్ స్మిత్ (VINCENT SMITH)

1910 లో విశేషకృషి సల్పి హిందూదేశ చరిత్రను వ్రాస్తూ దానిలో వేమన పద్యాలు వ్రాసి ప్రశంసించిన వ్యక్తి

* కుకవులు = ప్రయోజనము లేని కవులు

వినయకుమార్ సర్కార్

ఆంధ్ర సాహిత్యంలో వేమన స్థానము అద్వితీయమని తెల్పిన వ్యక్తి వేమనను చైతన్య స్వామి, కబీర్‌లతో పోల్చినాడు.

యిక తెలుగు వ్యక్తులుగా పరిశోధకుల్ని భావిస్తే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ వీరు పండితులు. సమర్థులైన విమర్శకులు, వీరు వేమనమీద జరిపిన పరిశోధన తెలుగునాడులో మరి ఏ ఒక్కరూ జరుపలేదనియే చెప్పవచ్చును. వేమన తత్త్వం లోతుకెళ్ళి తఱచి, తఱచి చూసి ప్రజలకు బోధిస్తే యితడు వేమన వేదం లోతుకెళ్ళి, తనకుగల అశేష పాండితీ ప్రాబల్యంతో వేమన సాహిత్యాన్ని విపులపఱచిన శేముషీదురంధరుడు యిక వేమన చరిత్ర వ్రాసినవారు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి (1917) పిదప వేటూరి ప్రభాకరశాస్త్రి, బండారు తమ్మయ్య, వంగూరు సుబ్బారావు (1922) చాగంటిశేషయ్య యిత్యాదులను చెప్పుకోవచ్చును.

పిదప 1980 లో వేమనయోగి తెలుగు విజ్ఞానకేంద్రం, హైదరాబాదు వారి ఆధ్వర్యంలో శ్రీ బంగోరె సంపాదకత్వంలో వచ్చిన సి. పి. బ్రౌన్ 1839 నాటి సంకలనంలో అనేక విషయాలు దొర్లాయి ఆ ప్రతికి, ఈ మధ్యకాలంలో వస్తూన్న వేమన పద్యాల ప్రతులకు చాలా పాఠాంతరాలు, ప్రక్షిప్తాలు కన్పిస్తూ చాలా అస్తవ్యస్తంగా వుంటున్నాయి. 1985లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ముద్రించిన శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు వేమన సాహిత్యంపై అతని చరిత్రను గుప్పిస్తూ, చేసిన విమర్శ అతి చక్కనిది.

వేమన సాహిత్యానికి ఎంతో పరిశీలనాత్మకంగా, సాహితీ సమన్వయం చేస్తూ వ్రాసిన ఆరుద్రగారి వ్యాఖ్యానం కూడా చెప్పుకో దగ్గది.

వేమన పద్యాలు ఈరోజున ఫ్రెంచ్, లాటిన్, ఇంగ్లీషు సంస్కృతము, హిందీ తమిళం, కన్నడంలోకి అనువదించబడింది. యింకా మిగిలిన భాషల్లోకి అక్కడక్కడా కొందరు అనువాదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది

నాకు వేమన సాహిత్యంపై చిన్ననాటినుండి యున్న మక్కువ, రాయలసీమ ప్రాంత చారిత్రకాంశములపై కలిగిన పరిచయము సంస్కృతాంధ్రములలో నాకు వున్న స్వల్ప అభినివేశ ములతో వేమన సాహిత్యంపై చిన్న టీకతో ఈ చిఱు పొత్తమును 1987లో వ్రాసితిని, యిది కేవలం వేమన సాహితీ మండలమున చంద్రునికో నూలుపోగు మాత్రమైన చాలు, విశేష పరిశోధనా వివర్శ చేసినవారు, పరిశీలక విద్వాంసులు నా ప్రయత్నములో ఏవేని దోషములు దొర్లినచో వాటిని నాకు తెల్పిన మహదానందముతో స్వీకరించి మలిముద్రణమున వాటిని సవరించుకొన గలవాడనని వినయపూర్వకముగా మనవి చేసుకొనుచున్నాను.

విబుధజన విధేయుడు

వి. ఉదయశంకర్.

# వేమన బోధలు మన నిత్య జీవితమునకు

వేమన యోగి ప్రవచించిన ప్రవచనాలు ప్రతి మానవుడికి నిత్య జీవితంలో నూటికి నూరుశాతము అత్యంతావశ్యకములని చెప్పవచ్చును. అతని బోధనలో ప్రతి అంశము ఒక్కొక్క విశిష్ఠ తను సంతరించుకుని, మానవుని నిత్యజీవితానికి ఒక మార్గదర్పణంగా రూపొందిందనవచ్చును. అటువంటి విషయాలు ప్రత్యేకంగా ఈ క్రింద పొందుపరచడమైనది.

ఆధ్యాత్మిక మార్గము:—ప్రతిజీవి భగవంతుని సృష్టిలో ఒకటే గాని, వారివారి పూర్వకర్మ ఫలానుసారము, సుఖదుఃఖములను పొందుట జరుగునని భారతీయ కర్మ సిద్ధాంతము. అట్టిది ప్రతిజీవి భగవశ్చక్తి ఒకటి ఏదో ఈ విశాల విశ్వంలో వుండి అది మనల్ని నడిపిస్తోంది అని భావిస్తాడు. అటువంటి ఆ భగవత్కృప కొఱకు అనేక మార్గములు అవలంభిస్తారు. పూజలు, జపములు, ఉపవాస ములు, వ్రతములు, నోములు, యిలా ఎన్నో యివన్నీ యిలా వుండగా, 'దైవం మానుషరూపేణ' మానవసేవయే మాధవసేవ అనే నగ్నసత్యాన్ని గ్రహిస్తే భౌతిక పూజలు నిష్ఫలం, అవి కేవలం మానవునికి శాంతి, సౌఖ్యాన్ని కొంతవఱకు యివ్వగలవు తప్ప భగవత్సన్నిధిని దైవ యోగాన్ని పొందింపలేవు అనే విషయాన్ని వేమన ఎంతో స్పష్టంగా చెప్పాడు. ప్రతి మానవుడు

భగవంతుని కృపను పొందుటకు నిబంధనలు లేవని దానికొఱకు సన్యాస దీక్షే పొందనక్కర్లేదని గృహస్థు మార్గమే సరియైనదని, ప్రతి మానవుడు దానం, ధర్మం అంతశ్శుచి ఈ మూడు కల్గి యుండుటే భగవంతుని పొందుటకు అతి దగ్గఱ మార్గాలని సూచించాడు.

కులము -మతము:—దేశములో నేడు కులము మతము అనేక సంఘములుగా రూపొంది అవి జన కల్యాణమునకు బదులు జన నాశమునకు పురికొల్పుచున్నవి మతము అనేది కేవలము కొందఱి మానవాళికి అనుకూలంగా ఉండే పద్ధతులు రూపొందించుకొని ఆ పద్ధతులు అవలంభించేవారు పలాని మతము అనిపించుకోవడం అనాది. అంతమాత్రంచేత మానవులలో భిన్నత్వానికి ఎంతమాత్రం తావు లేదు. ముస్లిమ్‌లుగాని, హిందువులుగాని, క్రైస్తవులుగాని ఏ మతము వారుగాని మానవాళి అంతా ఒక మతమే. వారివారి అభిప్రాయాలకు పెట్టినపేర్లు మాత్రమే అవి, ఒక కుటుంబంలోని సభ్యులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిరుచులు, ఒక్కో ఆహార యిష్టతలు వుంటాయి. అంతమాత్రాన వారు వేరుగాదే, తమ్ముడు తమ్ముడే, అన్న అన్నే అలానే మతముగా అభిప్రాయాలు మాత్రమే వేరని భావించి తీరాలి, అల్లాయైనా, క్రీస్తుయైనా, ఈశ్వరుడైనా రూపమే వేరు, భగవదాత్మ ఒక్కటే. ఈ విషయాన్ని వేమన్న ''మృత్పిండమేకం బహుభాంఢ రూపం'' అన్నాడు. మన్ను అంతా ఒకటే కుండలు రూపంలో చిన్నవి పెద్దవి, పొట్టివి పొడుగు పాటివి ఏర్పరుస్తున్నాము: అంటూ మానవాళి ఒకే కంచంలో తినాలి అంటూ కుల మతాన్ని మంటకలపమన్నాడు. ప్రతివారు ఏకాగ్రతతో యోచిస్తే ఎందుకీకులం, ఎందుకీమతం అనేది అవగత

మౌతుంది. దానివలన ఎన్నో వర్తమాన సమస్యలు పరిష్కరింప బడతాయి.

కన్యాశుల్కం-వరకట్నం :—ఒకటి నాటిది (వేమన నాటిది) రెండవది నేటిది ఇవి రెండూ జాతి వినాశనానికి ఏర్పడ్డ కిరాతక దురాచారాలు. అంటువ్యాధికన్న భయంకరమైన వనుటలో సందేహము లేదు. మానవుడు ఏర్పరచుకున్న కట్టు బాట్లు, ఆచార వ్యవహారములు, సాంప్రదాయములు, మానవా భ్యుదయమునకు మానవ సుఖ-సంతోషములకు, శాంతి - సౌభాగ్య ములకు దోహదమొనర్చవలెను గాని అవి వాని వినాశనమునకు హేతువు కారాదు, ఒకనాడు వధువుకి శుల్కం చెల్లించి కొను క్కుంటే, ఈనాడు వరునికి శుల్కం చెల్లించి కొనుక్కుంటు న్నారు. ఇందులో వరుని ఉద్యోగ హోదాను బట్టి అనేక రేట్లు ఒక్కొక్క కులంలో ఒక్కో రేటు, ఒక్కో విధమైన పోటీలు 'ఛీ' యిది ఒకవిధంగా ఎంతటి అనాచారమో' యోచించేవాళ్లు ఎంతమంది? ఈ జాడ్యం రోజు రోజుకీ పెచ్చు పెరుగుతోందే తప్ప తగ్గుముఖం పట్టే అవకాశం కన్పించడం లేదు. వేమన ఈ అంటురోగానికి ఒకే ముక్కలో మందు సూచించాడు. "డబ్బిచ్చే వాడికి కాయమిచ్చినట్టు అవుతుందిరా." వివాహం, దాంపత్యం, సంసారం యివి వ్యాపారం కాదు స్త్రీ పురుషుల యిష్టతలు, అభి ప్రాయాలు తెలిసికొని అన్యోన్యంగా వుండే విధంగా వాళ్ళని కలప మన్నాడు. అటువంటి ధాంపత్యమే దాంపత్యం అన్నాడు. వేమన ప్రతి పలుకు మనకు శిరోధార్యమే కనుక దానిని మననం చేసుకు అనుసరిద్దాం.

ఆనంద భారతి పవర్ ప్రెస్, గోపాలపురం. మద్రాసు - 600 086.